ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
సోమవారం 16.03.2026 | సంపుటి :12 సంచిక : 236 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






## దేశసమైక్యతకు పాటుపడదాం

# కలిసి మెలిసి జీవిద్దాం

### ప్రభుత్వం మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తుంది

- అజారుద్దీన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకున్నాం.. షబ్బీర్ అలీనీ ప్రభుత్వ సలహాదారుగా నియమించాం
- క్రీడాకారులు సిరాజ్, నిక్కత్ జరీన్‌ను గౌరవించుకున్నాం
- ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.. వీరి మాయలో పడొద్దు
- ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ప్రపంచంలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మనదేశంలోనూ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. వీరి మాయలో పడవద్దని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్-ఏ-దావత్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి హాజరయ్యారు. ప్రభుత్వం మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమంలో ఈ వర్గాలకు సింహభాగం ఇస్తోందని వివరించారు. మైనార్టీ నేత అజారుద్దీన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకున్నామని అన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన షబ్బీర్ అలీనీ ప్రభుత్వ సలహాదారుగా నియమించామన్నారు. 8 మంది మైనార్టీలను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించుకున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులు సిరాజ్, నిక్కత్ జరీన్‌ను గౌరవించుకున్నామని వివరించారు. ఈ ప్రభుత్వం మీదని తాను మీ సోదరుడిని అందరం కలిసి హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్ ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

> రంజాన్ కేవలం పండుగ కాదు .. ఆత్మ శుద్ధి చేసుకునే సమయం..ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది.. సోదరభావం తీసుకువచ్చి మతసామరస్యంతో అంతా కలిసి మెలిసి ఉండాలి..ప్రభుత్వం ముస్లిం లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది..అజరుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చాం..సీనియర్ నేత షబీర్ అలీకి సలహాదారు పదవి ఇచ్చాం.. 8 మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చాం.. ఈ ప్రభుత్వం మీ ది ,నేను మీ సోదరుడి ని మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలి ..మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు..మనం కలిసి మెలసి తెలంగాణ ను ముందుకు తీసుకెళ్లాలి దేశం లో తెలంగాణ ను అభివృద్ధి లో ముందుకు తీసుకు వెళ్దాం ..
> - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలి

: మంత్రి కోమటిరెడ్డి

2లో..

## 22 నుంచి రైతు భరోసా

- నర్మెట్ట నుంచి మొదటి విడత నిధులు విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 70 లక్షల మంది రైతులకు రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు




హైదరాబాద్(జనంసాక్షి): అన్నదాతలకు శుభవార్త వెలువడింది. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా నిధులు విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మిగతా 2లో..

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- 20న బడ్జెట్‌ను పద్దును ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క
- సమావేశాలకు గవర్నర్‌కు ఆహ్వానం



2లో..



# అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా

### తమిళనాడు,పశ్చిమ బెంగాల్, కేరళ , అస్సాంలతోపాటు పుదుచ్చేరిలో ఎలక్షన్లు

- తమిళనాడులో రెండు, మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో నిర్వహణ
- వీటితోపాటు ఎనిమిది స్థానాల్లో ఉప ఎన్నిక..
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్
- ఎన్నికల రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రకటన




న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో నాలుగు రాష్ట్రాలతోపాటు ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను వెల్లడించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం.. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు షెడ్యూల్ ప్రకటించారు.

**నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో..**

మొత్తం ఓటర్ల సంఖ్య – 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు – 2.19లక్షలు
ఎన్నికల అధికారులు – 25 లక్షలు
ఎనిమిది స్థానాల్లో ఉప ఎన్నిక..

వీటితోపాటు ఆరు రాష్ట్రాల్లో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక జరగనుంది. మిగతా 2లో..

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో

# ఆరుగురికి పాజిటివ్

### జాబితాలో ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

- వివరాలు వెల్లడించిన ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్
- ఎంపీ పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు
- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు : మహేశ్ కుమార్
- డ్రగ్స్‌కేసులో పుట్టా మహేశ్‌పై ఆరోపణలు..
- సీఎం చంద్రబాబు సీరియస్.. ఎంపీకి షోకాజ్ నోటీసులు



హైదరాబాద్,మొయినాబాద్జనంసాక్షి): మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఈగల్ బృం దం ఎస్పీ గిరిధర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాద వ్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రె డ్డిలకు పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు. శనివారం రాత్రి నిర్వహించిన ర్యాపిడ్ టెస్ట్‌లో ఎంపీ పుట్టా మహేశ్‌కు నెగిటివ్ వచ్చిందని.. రక్త పరీక్షలో పాజిటివ్ వచ్చిం దని ఎస్పీ తెలిపారు. నెగిటివ్ వచ్చిన వారిలో రమేశ్, శ్రవణ్‌కుమార్, విజయ్‌కృష్ణ, సిలివేరి శరత్‌కుమార్, ప్రియాంకరెడ్డి ఉన్నట్లు చెప్పారు. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వీకెండ్ పార్టీ ఏర్పాటు చేశారని ఎస్పీ తెలిపారు. శనివారం రాత్రి ఈగల్ బృందం రైడ్ చేస్తున్న సమయంలో కాల్పుల శబ్దం వినిపించిద న్నారు. అప్పుడు నమిత్ అనే వ్యక్తి చేతిలో తుపాకీ ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. నమిత్‌ను దిల్లీకి చెం దిన వ్యక్తిగా ప్రాథమికంగా నిర్ధరించామని తెలిపారు.

**ఎంపీ పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు స్టేషన్ బెయిల్ మంజూరైంది. ఆయనకు నోటీసులు ఇచ్చి పోలీసులు వదిలేశారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఇవాళ ఉదయం మిగతా 2లో..



## నన్ను లాగితే నేనూరుకోను

ఇష్టారీతిన ఆరోపణలు చేస్తే చట్టపరంగా నోటీసులిస్తా : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచనను స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు డ్రగ్స్ వాడటం దురదృష్టకరమన్నారు. వ్యక్తిగతంగా డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానన్నారు. డ్రగ్స్ మిగతా 2లో..

## రాత్రంతా ఆన్‌లో బైక్ ఇంజిన్..

- పొగ పీల్చి ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి
- అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం



**అన్నమయ్య జిల్లా (జనంసాక్షి):** అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బైక్ నుంచి వచ్చే పొగ పీల్చి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పట్టణంలోని త్యాగరాజు వీధిలో ఈ ఘటన జరిగింది. మృతిచెందిన వారిని తాత, మనవడు, ఇద్దరు మనవరాళ్లుగా గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్యాగరాజు వీధికి చెందిన మురళి, రేవతి భార్యాభర్తలు. ఆయనకు తండ్రి రామ చంద్రయ్య, కుమారుడు కార్తీక్, కవల కుమార్తెలు చరిత, చందన ఉన్నారు. మురళి శనివారం తన ద్విచక్ర వాహనాన్ని మెకానిక్ వద్ద మరమ్మతు చేయించాడు. ఇంజిన్ సమస్య ఉండటంతో బోర్ మిగతా 2లో..

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

- ఇరాన్ అత్యంత కీలకమైన అణు కేంద్రంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు
- పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్‌పై బాంబుల వర్షం
- అమెరికా సైనిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో ఐఆర్‌జీసీ దాడులు



- యూఏఈలోని 3 ఓడరేవుల నుంచి ప్రజలు వెళ్లిపోవాలని సూచన
- దక్షిణ ఇజ్రాయెల్‌లోకి దూసుకెళ్లిన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- అమెరికా-ఇజ్రాయెల్‌కు చెందిన 114 డ్రోన్లను కూల్చేవేత
- 'ఖర్గ్'పై మరిన్ని దాడులు చేస్తాం: ట్రంప్ కవ్వించే వ్యాఖ్యలు
- మొజ్తాబా బతికే ఉన్నారా? అని ప్రశ్నిస్తూ 'ఎక్స్'లో పోస్ట్
- నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద భారీ పేలుళ్లు
- ఉద్రిక్తలతో పశ్చిమాసియాలో సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు రద్దు
- పశ్చిమాసియాలో యుద్ధాన్ని తక్షణమే ఆపండి.. పోప్‌పిలుపు

**ఇరాన్ దాడుల్లో నెతన్యాహు మృతిచెందారని వార్తలు**
పుకార్లేనని కొట్టిపారేసిన ఇజ్రాయెల్ 2లో..

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్‌కు చెందిన అత్యంత కీలకమైన అణు కేంద్రం ఉన్న ఇస్ఫహాన్ నగరంపై అమెరికా-ఇజ్రాయెల్ విమానాలు విరుచుకుపడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి నగరంలోని వివిధ ప్రదేశాల్లో భారీ పేలుళ్లు వినిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. చాలా చోట్ల భారీ ఎత్తున నల్లని పొగ ఆకాశాన్ని కమ్మేసింది. అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ ఈ దాడులు చేసినట్లు చెబుతున్నారు.పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఇరాన్ తనకు అవసరమైన శాటిలైట్ ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ సమాచారాన్ని ఇక్కడి నుంచే సేకరిస్తుంది.

**భారీ బాంబర్‌ను పంపిన సెంట్రల్ కమాండ్..**

ఇరాన్‌పై దాడులకు అమెరికా తన వద్ద ఉన్న బి-52 బాంబర్ విమానాన్ని పంపినట్లు తెలుస్తోంది. ఇది దాదాపు 38 టన్నుల బాంబులను తీసుకెళ్లగలదు. మిగతా 2లో..

## అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే.. హర్మూజ్ బంద్


- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు
- మా డ్రోన్లను కాపీ కొట్టి ఇతర దేశాలపై అమెరికా ఇజ్రాయెల్‌లు దాడులు చేస్తున్నారు
- తిరిగి మాపైనే నిందలు వేస్తున్నారు : ఇరాన్

2లో..



## మూసీ సుందరీకరణ పేరిట దోపిడీ పర్వం

### ప్రజా ధనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నాడు:హరీశ్‌రావు



**సిద్దిపేట (జనంసాక్షి):** మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటిఫికేషన్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోట్లు కొల్లగొడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పీఆర్సీ రిపోర్టు వస్తే ఉద్యోగులకు జీతాలు పెంచాల్సి వస్తుందన్న కారణంతో దానిని పొడిగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని విద్యాకమిషన్ రిపోర్టులో ఉందన్నారు. ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన నివేదిక అని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్ల నిధులుంటాయిగానీ, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేందుకు రూ.10 వేల కోట్లు లేవా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఆదివారం ఒక్కరోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా హరీశ్‌రావు మిగతా 2లో..

## రాహుల్ దేశాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు

### ఆయన చర్యలకు ఏ భారతీయుడూ మద్దతు ఇవ్వడు: కేంద్ర హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ(జనంసాక్షి):భాజపా, ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. దేశాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు యత్నిస్తున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయన చర్యలకు ఏ భారతీయుడూ మద్దతు ఇవ్వడని పేర్కొన్నారు. అస్సాం పర్యటనలో భాగంగా వైద్యారోగ్య మిగతా 9లో..

## ఉత్తర కొరియా దుందుడుకు చర్యలు

అణ్వస్త్రాలను ప్రయోగించే రాకెట్ లాంచర్లను పరీక్షించిన కిమ్ సైన్యం



ప్యాగ్యాంగ్(జనంసాక్షి):త్తరకొరియా మరో అత్యాధునిక ఆయుధాన్ని పరీక్షించింది. 600 ఎంఎం క్యాలిబర్ కలిగిన 12 మల్టీపుల్ రాకెట్ లాంచర్లను పరీక్షించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ మీడియా కేసీఎన్ఏ వెల్లడించింది. ఈ వారం అమెరికా, దక్షిణ మిగతా 2లో..

## సీఎం రేవంత్ చిన్న మోదీలా వ్యవహరిస్తున్నారు

మూసీ భూములను ప్రపంచ బ్యాంక్‌కు కట్టబెట్టే యత్నం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపణ

హైదరాబాద్(జనంసాక్షి): మూసీపై ఇప్పటివరకు ప్రభుత్వం డీపీఆర్‌ను విడుదల చేయలేదని కవిత అన్నారు. పూర్తి డీపీఆర్‌ను విడుదల చేయకపోవడం వెనుక మోసం ఉందని, మూసీ భూములను ప్రపంచ బ్యాంక్‌కు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి.. చిన్న మోదీలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు.










హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమ దృశ్యమాలిక

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం



దీనికి సంబంధించిన వీడియోను సెంట్రల్ కమాండ్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం దాదాపు 20 నిమిషాల వ్యవధిలోనే 20 భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానికులు వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద ఇవి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

**పశ్చిమాసియాలో 12వ తరగతి పరీక్షలు రద్దు**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాంతంలో జరగాల్సిన పరీక్షలను పలుమార్లు వాయిదా వేసిన బోర్డు.. వీటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో మార్చి 16 నుంచి ఏప్రిల్ 10 వరకు జరగాల్సిన 12వ తరగతి సహా ఇంతకుముందు వాయిదా పడిన పది పరీక్షలను కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. అభ్యర్థుల ఫలితాలను ఏ విధంగా ప్రకటిస్తామనే విషయాన్ని తగిన సమయంలో వెల్లడిస్తామని సీబీఎస్ఈ పేర్కొంది. యూనిట్ టెస్టులు, ప్రీ-బోర్డ్, ప్రాక్టికల్, ప్రాజెక్టు వంటి ఇంటర్నల్ మార్కుల ఆధారంగా ఫలితాలను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమాసియాలో దాడుల కారణంగా ఇటీవల జరగాల్సిన పదో తరగతి పరీక్షల్లో కొన్నింటిని నిర్వహించలేకపోయారు. దీంతో ఆ పరీక్షలను కూడా రద్దు చేస్తున్నట్లు సీబీఎస్ఈ పేర్కొంది.

**'ఖర్గ్'పై మరిన్ని దాడులు చేస్తాం: ట్రంప్**

ఒక పక్క పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతుండగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ చమురుకు ఆయువుపట్టు వంటి ఖర్గ్ ఐలాండ్‌పై సరదాగా మరిన్ని దాడులు చేస్తామంటూ పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఖర్గ్ ద్వీపంపై మరిన్ని దాడులు జరగొచ్చని ట్రంప్ అన్నారు. ఇప్పటికే తమ దళాలు జరిపిన దాడుల్లో అక్కడ చాలా భాగం ధ్వంసమైందన్నారు. కానీ, సరదాగా తాము మరికొన్ని సార్లు దాన్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఇరాన్ యుద్ధం మూడో వారానికి చేరుకుంది. ఖర్గ్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇప్పటికే అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో వాటిని పూర్తిగా ధ్వంసం చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు. అక్కడి చమురు క్షేత్రాలను మాత్రం టచ్ చేయలేదని వెల్లడించారు. ఇక యుద్ధం ముగింపునకు సంబంధించి ఒక ఒప్పందం కోసం చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, అందుకు ప్రతిపాదించిన షరతులు సరిపోవని అన్నారు. దీంతో యుద్ధం ముగించేందుకు ఇప్పుడు తాను సిద్ధంగా లేనని తేల్చిచెప్పేశారు. కాల్పుల విరమణకు సంబంధించిన నిబంధనలు బలంగా ఉండాలన్నారు. అయితే, అవేంటో చెప్పేందుకు ట్రంప్ నిరాకరించారు.

**మొజ్తాబా బతికే ఉన్నారా? ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

ఇరాన్ సుప్రీం నేతగా నియమితులైన మొజ్తాబా ఖమేనీని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మొజ్తాబా ప్రాణాలతో లేనట్లు తాను విన్నానని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మొజ్తాబా ప్రాణాలతోనే ఉన్నారనేందుకు స్పష్టమైన ఆధారాలు ఏవీ కన్పించడం లేదని ట్రంప్ అన్నారు. "మొజ్తాబా బతికే ఉన్నారా? లేదా? అనే విషయం నాకు తెలియదు. ఇప్పటివరకు ఆయన బహిరంగంగా కనిపించలేదు. మొజ్తాబా ప్రాణాలతో లేరని విన్నాను. ఒకవేళ బతికే ఉంటే.. యుద్ధం నేపథ్యంలో తన దేశం కోసం లొంగిపోవడం లాంటి ఏదైనా తెలివైన నిర్ణయం తీసుకుని ఉండేవారు" అని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తాబా ఇప్పటివరకు కనిపించలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపై అనేక ఊహాగానాలు వెల్లువెత్తాయి. అమెరికా-ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఆయనకు గాయాలయ్యాయని మీడియా పేర్కొంది. అయితే, దానికి సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇరాన్ అధికారులు కొందరు వీటిని ఖండిస్తూ వచ్చారు. తాజాగా ట్రంప్ వ్యాఖ్యలతో మొజ్తాబా ఆరోగ్యం విషయం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది.

**పశ్చిమాసియాలో యుద్ధాన్ని తక్షణమే ఆపండి.. పోప్‌పిలుపు**

అమెరికా, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న వేళ పోప్ లియో కీలక ప్రకటన చేశారు. తక్షణమే యుద్ధానికి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. "పశ్చిమాసియాలో క్రైస్తవుల తరఫున, సన్మార్గంలో నడిచే స్త్రీ, పురుషులందరి తరఫున, ఈ సంఘర్షణకు కారణమైన వారికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. చర్చల మార్గాలు తిరిగి తెరుచుకోవడానికి తక్షణమే కాల్పులను విరమించండి. హింస అనేది ఎన్నటికీ ప్రజలు కోరుకుంటున్న న్యాయం, స్థిరత్వం, శాంతిని తీసుకురాలేదు" అని అన్నారు. వాస్తవానికి ఆయన అమెరికాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ, తన ప్రసంగంలో యూఎస్, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకపోవడం గమనార్హం.

## నెతన్యాహు మరణించారంటూ వార్తలు

### పుకార్లేనని కొట్టిపారేసిన ఇజ్రాయెల్

టెల్‌అవీవ్(జనంసాక్షి):ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. యుద్ధంలో ఆయన ప్రాణాలు కోల్పోయారంటూ నెట్టింట ప్రచారం జరుగుతోంది. శుక్రవారం నెతన్యాహు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసిన వీడియోనే ఈ ఊహాగానాలకు కారణం. తాజాగా ఆయన కార్యాలయం దీనిపై స్పందిస్తూ.. అవన్నీ ఫేక్ అని కొట్టిపారేసింది. అసలేం జరిగిందంటే.. ఇరాన్‌పై యుద్ధం గురించి నెతన్యాహు ఓ సమావేశంలో మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియోను ఇటీవల ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆ వీడియోలో నెతన్యాహు చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కన్పించింది. దానిని ఏఐ వీడియోగా నెటిజన్లు అభివర్ణించారు. ఈ క్రమంలో నెతన్యాహుకి ఏమైంది? అసలు ఆయన ప్రాణాలతో ఉన్నారా? వంటి అనేక ప్రశ్నలను నెటిజన్లు లేవనెత్తారు. యూఎస్ కన్జర్వేటివ్ వ్యాఖ్యాత కాండేస్ ఓవెన్స్ దీనిపై స్పందిస్తూ.. 'బీబీ ఎక్కడ?ఆయన కార్యాలయం ఎందుకు ఫేక్ ఏఐ వీడియోను విడుదల చేసింది. ఎందుకు తొలగించింది. అమెరికా ప్రభుత్వం ఎందుకు ఆందోళనకు గురవుతోంది' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరికొందరు కూడా వీడియోలోని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోస్టులు పెట్టారు. దీంతో ఇరాన్ దాడుల్లో ఆయన మృతి చెందారంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు కార్యాలయం వీటిపై స్పందిస్తూ.. ఆయన క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేసింది. దీంతో ఊహాగానాలన్నింటికీ చెక్ పెడింది. ఇదిలాఉండగా.. ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ నెతన్యాహుకి హెచ్చరికలు చేసింది. పిల్లల ప్రాణాలు తీసే వ్యక్తిగా ఇజ్రాయెల్ ప్రధానిని అభివర్ణించింది. ఆయన ఇంకా బతికే ఉంటే.. శక్తి మేరకు వెంటాడతాం అని వ్యాఖ్యానించింది. ఆయన మరణంపై వస్తున్న వార్తలు ఫేక్ అని ఇజ్రాయెల్ పేర్కొన్న కొన్ని గంటల్లో ఐఆర్జీసీ ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. నెతన్యాహు బతికే ఉన్నారా అనే అంశం అస్పష్టంగానే ఉందని ఇరాన్ దళాలు పేర్కొన్నాయి. ఆయన మృతిచెంది ఉండొచ్చని.. లేదా కుటుంబంతో సహా దేశాన్ని వీడి ఉండవచ్చని తెలిపాయి.

## అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే.. హర్మూజ్ బంద్

టెహ్రాన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే దీనిని మూసివేసినట్లు ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇతర దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని చెప్పారు. అయితే.. భద్రతా సమస్యల కారణంగా అనేక దేశాలు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. దీనికి ఇరాన్‌తో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి మీదుగా అనేక చమురు ట్యాంకర్లు, నౌకలు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. హర్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్ తదితర దేశాలు ఇబ్బంది పడుతున్నాయని, త్వరలో ఈ ప్రాంతానికి అవి తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని ట్రంప్ ప్రకటించిన వేళ అరాగ్చీ ఈమేరకు వ్యాఖ్యానించారు. నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవలి దాడుల్లో గాయపడ్డారని అమెరికా చేస్తున్న వాదనలపైనా స్పందిస్తూ.. ఆయనకు ఎటువంటి సమస్యా లేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం మొజ్తాబా తన విధులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. తమ దేశం పటిష్ఠ స్థితిలో ఉందని, ఏ ఒక్క వ్యక్తిపైనా ఆధారపడి లేదని చెప్పారు. ఒకవేళ కీలక వ్యక్తులకు ప్రాణనష్టం సంభవించినా.. తట్టుకోగలదని చెప్పారు. పరిస్థితి అంతా అదుపులోనే ఉందన్నారు. గత నెలలో జెనీవాలో జరిగిన చర్చల సందర్భంగా.. అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, కుష్నర్‌లపై తాను గట్టిగా అరిచానని, ఇరాన్ వద్ద 11 అణుబాంబులకు సరిపడా యురేనియం ఉందని బెదిరించానంటూ వచ్చిన ఆరోపణలనూ అరాగ్చీ ఖండించారు. వారు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. చర్చలకు సంబంధించిన వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు..

హైదరాబాద్(జనంసాక్షి):నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్ణయించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్చి 16వ తేదీ గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టనున్నారు. మార్చి 16 వ తేదీ నుంచి 30 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సత్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఉప ముఖ్యమంత్రితో పాటుగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన వారిలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్-ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఆర్థిక శాఖ కార్యదర్శి స్మితా పట్నాయక్ తదితరులున్నారు. తొలుత ఫిబ్రవరి 26వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరపాలని భావించినా.. ఆ తేదీని కాస్త వెనక్కు జరిపింది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌కు సంబంధించి తుది మెరుగులు దిద్దే క్రమంలోనే అసెంబ్లీ సమావేశాల తేదీని కాస్త వెనక్కు జరపాల్సి వచ్చినట్లు సమాచారం. ఆర్థికశాఖ మల్లు భట్టి విక్రమార్క. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను మార్చి 20వ తేదీన అసెంబ్లీ ప్రవేశపెడతారు. గత బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు భారీగా ఉండే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది.

## 22 నుంచి రైతు భరోసా

ఆదివారం చర్చించారు. మొదటి విడతగా ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3,590 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లోకి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బదిలీ చేయనున్నారు. తర్వాత మరో 20 రోజులకు రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగతా నిధులు రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు. మొత్తంగా 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ పాల్గొన్నారు.

## ఉత్తర కొరియా దుందుడుకు చర్యలు

కొరియా దేశాలు సంయుక్త యుద్ధ విన్యాసాలు చేయడంతో ఉత్తర కొరియా వరుసగా ఆయుధాలను పరీక్షిస్తోంది. దాదాపు 420 కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాలను అంతం చేసేలా ఈ రాకెట్ లాంచర్లను నిర్మించినట్లు ఆ పత్రిక పేర్కొంది. దీంతోపాటు టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్ శక్తిపై ఓ అవగాహన కోసం దీనిని పరీక్షించినట్లు తెలిపింది. ఈ పరీక్షలను ఉ.కొరియా అధినేత కిమ్ స్వయంగా పర్యవేక్షించారు. ఆయనతోపాటు దేశ వారసురాలిగా భావిస్తున్న కిమ్ జుయే కూడా ఉన్నారు. ఈ పరీక్షల్లో 364 కిలోమీటర్ల దూరంలోని ఓ ద్వీపంలోని లక్ష్యంపై గురిపెట్టినట్లు కేసీఎన్ఏ వెల్లడించింది. ఈ రాకెట్ అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించినట్లు పేర్కొంది. శనివారం ఉ.కొరియా ఏకంగా 10 బాలిస్టిక్ క్షిపణులను సముద్రంలోకి పరీక్షించి బల ప్రదర్శన చేసింది. రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించారని.. అవి ఎంత దూరం ప్రయాణించాయో తమకు తెలియదని దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. మరోవైపు, క్షిపణి ప్రయోగాన్ని గుర్తించిన వెంటనే జపాన్ ప్రధాని కార్యాలయం అత్యవసర స్పందన చర్యలు ప్రారంభించింది. క్షిపణి ప్రయోగం తర్వాత సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలకు జపాన్ తీర దళం అత్యవసర సూచనలు జారీచేసింది.

### అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలి : మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ప్రభుత్వానికి కేసీఆర్ సలహాలు ఇవ్వాలని కోరారు. మూసీపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ఫ్లోరైడ్‌తో నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మూసీ ప్రక్షాళన చేస్తే వారి జీవితాలు కూడా బాగుపడతాయన్నారు.

## నన్ను లాగితే నేనూరుకోను: కేటీఆర్

వాడకం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను బీఆర్ఎస్ ఖండిస్తుందని చెప్పారు. డ్రగ్స్‌ను వినియోగించేది ఎంతటివారైనా శిక్షించాలని డిమాండ్ చేశారు." రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉండాలి. నేను ఏ పరీక్షకైనా సిద్ధమని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశా. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టు చేయించుకొని అందరికీ ఆదర్శంగా ఉందాం. డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే చట్టపరంగా నోటీసులిస్తా" అని అన్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలని ఆయన అన్నారు.

# అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా

గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురాలో ఐదు స్థానాలకు ఏప్రిల్ 9న, గుజరాత్, మహారాష్ట్రల్లోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ఎనిమిది స్థానాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. వీటి ఫలితాలు కూడా మే 4న వెల్లడి కానున్నాయి.

బెంగాల్‌పైనే అందరి చూపు!

దేశంలో ఈ వేసవి మరింత వేడెక్కనుంది. మినీ సార్వత్రిక ఎన్నికలుగా భావించే నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలకు నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో ఏప్రిల్ నెలలో ఎన్నికల సమరానికి తెరలేచింది. ఒక్క పశ్చిమ బెంగాల్ మినహా అన్ని రాష్ట్రాల్లో ఒకే విడతలో ఎన్నికలు జరగనుండగా.. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో రాజకీయ ముఖచిత్రం గమనిస్తే..

15 ఏళ్లుగా దీదీ అడ్డా

పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టులను అధికారం నుంచి దూరం చేసి 2011లో పవర్‌లోకి వచ్చిన మమతా బెనర్జీ.. గడిచిన 15 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డిన భాజపా.. ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. మూడుసార్లు అధికారంలో ఉన్నప్పుడు ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేక, ఉపాధ్యాయ కుంభకోణం వంటివి మమతకు ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పోటీ చేసినా ఒక్క సీటు కూడా దక్కించుకోలేదు. దీంతో ఈసారీ తృణమూల్ వర్సెస్ భాజపాగానే ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 294 స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. 2021లో మాత్రం 8 దఫాల్లో ఎన్నికలు నిర్వహించారు.

త్రిముఖమా? ద్విముఖమా?

తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే కూటముల మధ్యే మరోసారి ప్రధాన పోటీ నెలకొనే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొత్తగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన నటుడు విజయ్ ఏ మేర ప్రభావం చూపుతారనేదీ ఆసక్తిగా మారింది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మద్దతుతో డీఎంకే మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాతో జట్టుకట్టిన అన్నాడీఎంకే క్షేత్రస్థాయిలో చెక్కు చెదరని క్యాడర్ బలంతో అధికారంలోకి రావాలని చూస్తోంది. విజయ్‌ను కూడా కలుపుకొని పోవాలని భాజపా భావిస్తోంది. దీంతో ఎన్నికలు సమీపిస్తున్న వేళ త్రిముఖ పోరు ద్విముఖ పోరుగా మారుతుందా? అనేది ఆసక్తిగా మారింది. అదే జరిగితే తమిళ రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతాయి. తమిళనాడులో 234 స్థానాలకు గానూ ఏప్రిల్ 23న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

కేరళలో హ్యాట్రిక్ సాధ్యమేనా?

ప్రతి ఐదేళ్లకు అధికారం మార్చే ఆనవాయితీ ఉన్న కేరళలో దాన్ని బ్రేక్ చేసి రెండోసారి అధికారంలో కొనసాగుతున్నారు పినరయి విజయన్. ఎల్డీఎఫ్ కూటమిని మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఈసారి విజయం తమదేనన్న ధీమాతో ఉంది. తిరువనంతపురం మేయర్ పదవిని దక్కించుకుని కేరళ రాజకీయాల్లో బోణీ కొట్టిన భాజపా సైతం.. అసెంబ్లీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. కేరళలో 140 స్థానాలకు గానూ ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

హ్యాట్రిక్‌పై భాజపా కన్ను

కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న అస్సాంలో పాగా వేసిన భారతీయ జనతా పార్టీ గత రెండు దఫాలుగా అధికారంలో కొనసాగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు, అభివృద్ధే మంత్రంగా హిమంత బిశ్వశర్మ నేతృత్వంలో భాజపా ఈసారి ఎన్నికలకు వెళుతోంది. ఇటీవలే రూ.4500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. మరోవైపు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ నిరుద్యోగం, సీఏఏ వంటి అంశాలతో ప్రజల మద్దతు కోరుతోంది. 126 స్థానాలకు ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. పుదుచ్చేరిలో 33 స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్, భాజపాతో కూడిన ఎన్డీయే సర్కారు అధికారంలో ఉంది. కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. తమిళ రాజకీయాల ప్రభావం ఈ కేంద్ర పాలిత ప్రాంతంపై ఉంటుంది. ఈసారి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి మరి!

మొయినాబాద్ డ్రగ్స్ కేసు..

## ఆరుగురికి పాజిటివ్

ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు. శనివారం రాత్రి నిర్వహించిన ర్యాపిడ్ టెస్ట్‌లో ఎంపీ పుట్టా మహేశ్‌కు నెగిటివ్ వచ్చిందని.. రక్త పరీక్షలో పాజిటివ్ వచ్చిందని ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో మహేశ్‌కుమార్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

**మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. ఎలాంటి రాజకీయం లేదు: మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్: మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కేసులో ఈగల్ బృందం తమ కర్తవ్యాన్ని నెరవేర్చిందని, దీనిలో ఎలాంటి రాజకీయం లేదని చెప్పారు."డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈగల్ బృందం దాడులు చేపడుతోంది. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలి. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం సీఎం రేవంత్ కృషి చేస్తున్నారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు నిరసన చేపట్టారు. నో డ్రగ్స్.. సేవ్ తెలంగాణ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిపై వెంకట్ ఆరోపణలు చేశారు.

**పుట్టా మహేశ్‌పై ఆరోపణలు.. సీఎం చంద్రబాబు సీరియస్.. ఎంపీకి షోకాజ్ నోటీసులు**

అమరావతి: మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు.. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పుట్టా మహేశ్‌పై వచ్చిన ఆరోపణలను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఇప్పటికే ఆయన్ను అధిష్ఠానం ఆదేశించింది. ఈ ఘటనపై మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదన్నారు. వ్యక్తులు, నేతల బలహీనతలు, తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వొద్దని చెప్పారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చింది. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వీకెండ్ పార్టీ ఏర్పాటు చేశారని.. దానికి పుట్టా మహేశ్ హాజరైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

రాత్రంతా ఆన్‌లో బైక్ ఇంజిన్..

## పొగ పీల్చి ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

చేయించిన అనంతరం బైక్‌ను ఇంటికి తీసుకెళ్లాడు. రాత్రంతా ద్విచక్ర వాహనం స్టార్టింగ్‌లో ఉంచాలని మెకానిక్ చెప్పడంతో ఇంట్లో తలుపులు వేసి ఇంజిన్‌ను ఆన్ చేశాడు. శనివారం రాత్రి తండ్రి, మనవడు, మనవరాళ్లు ఇంట్లో నిద్రించగా.. మురళి, రేవతి ఇంటిపైన గదిలో పడుకున్నారు. ఇల్లు ఇరుకుగా ఉండటం.. మరోవైపు గాలి బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో రాత్రంతా బైక్ నుంచి వెలువడిన పొగ గదిలో వ్యాపించింది. దీంతో తాత, మనవడు, మనవరాళ్లు ఆ పొగ పీల్చి మృతిచెందారు. ఇంటి పైన గదిలో నిద్రించడంతో మురళి, రేవతి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. పిల్లల మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## మూసీ సుందరీకరణ పేరిట దోపిడీ పర్వం

మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలు రాక పదుల సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆక్షేపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వచ్చే బడ్జెట్‌లో బకాయిల కోసం రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# దేవుని పేరుతో రాజకీయం చేస్తే అంతే!

- ఆగ్రహించిన కొండగట్టు అంజన్న.. బిజెపి శ్రేణుల పై తేనె తీగల దాడి వెనుక ఉన్న మర్మం అదే
- బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రానికి డ్రగ్స్‌ను పరిచయం చేసింది.. సొంత చెల్లెలిని లిక్కర్ కేసులో ఇరికించింది కేటీఆరే.
- పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఘాటు విమర్శలు



కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజల బాగోగులను గాలికొదిలేసి, కేవలం దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మండిపడ్డారు. ఆదివారం రోజు కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ నేతలు దేవుడి పేరుతో పబ్బం గడుపుతున్నారు. దేశ ప్రధాని నుంచి కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ వరకు రాముడు, హనుమంతుడు తప్ప మరో విషయం మాట్లాడటం లేదని విమర్శించారు. బీజేపీ నాయకులు తమ జీవితకాలమంతా దేవుడి పేరు చెప్పుకుంటూ గడుపుతున్నారు తప్ప, ప్రజల బాగోగులను గాలికొదిలేశారని మండిపడ్డారు. నిన్న కొండగట్టు యాత్రకు వెళ్లిన బండి సంజయ్‌ను అంజన్న స్వామే అడ్డుకున్నారని, ఇక్కడ కూడా రాజకీయ లబ్ధి కోసమే యాత్ర చేశారు తప్ప కొండగట్టు అభివృద్ధి కోసం ప్రజల శ్రేయస్సు కోసము కాదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ వారి స్వార్ధ రాజకీయాలకు దేవుడి పేరు వాడుకుంటున్నారని దేవున్ని రాజకీయాల్లోకి లాగడం పట్ల కొండగట్టు అంజన్న ఆగ్రహించడం వల్లనే తేనె తీగల దాడి జరిగిందని బిజెపి నేతలు భగవంతుని ఆగ్రహానికి లోనయ్యారని దుయ్యబట్టారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పుట్టకముందు నుండే ప్రజలు దేవుళ్లను మొక్కుతున్నారని, ప్రజల విరాళాలతో నిర్మించిన అయోధ్య రామాలయంపై రాజకీయాలు చేసినందుకే అయోధ్యలో మోదీని ప్రజలు ఓడించారని గుర్తు చేశారు.

**బీఆర్ఎస్ పాలనలో కోట్ల రూపాయల డ్రగ్స్ దందా నడిపిన కేటీఆర్**

అలాగే రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో డ్రగ్స్ మహమ్మారి విజృంభించిందని వారి పాలనలో యువతను డ్రగ్స్ కు బానిసలుగా చేసి ఉపాధి విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండేందుకు కేటీఆర్ వేలకోట్ల డ్రగ్స్ మాఫియాను రాష్ట్రంలో నడిపించారని తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చిందని ఆరోపించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా విజృంభించిందని దేశ విదేశాలతో రహస్యంగా డ్రగ్స్ దందా నడిపిన కేటీఆర్ వేలకోట్ల రూపాయలు సంపాదించారు. రాష్ట్రంలోని యువతకు, సినీ పరిశ్రమకు కేటీఆర్ డ్రగ్స్ అలవాటు చేస్తే కరీంనగర్ యువతకు ఇక్కడి మాజీ మంత్రి డ్రగ్స్ అలవాటు చేశారని విమర్శించారు. అసలు రాష్ట్రంలోకి డ్రగ్స్‌ను తీసుకువచ్చిందే కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వమని ధ్వజమెత్తారు.

**కవితకు మరోసారి సిబిఐ నోటీసుల వెనుక కేటీఆర్, హరీష్ రావు కుట్రలు**

సొంత చెల్లెలు కవిత ఆస్తిలో వాటా అడిగినందుకే కేటీఆర్ ఆమెను ఇంటి నుంచి బయటకు పంపారని సంచలన ఆరోపణలు చేశారు. కవితను లిక్కర్ కేసులో ఇరికించింది కేటీఆర్, హరీష్ రావులేనని, ఇప్పుడు మళ్లీ ఆమెకు సీబీఐ నోటీసులు రావడానికి కేటీఆరే కారణమని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలు కుటుంబ సభ్యుల మధ్య గొడవల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సొంత కూతురునే కాపాడుకోలేని కెసిఆర్ రాష్ట్ర ప్రజలను ఏమి కాపాడుతారని ధ్వజమెత్తారు. మూసి పునరుజ్జీవనం పై ప్రతిపక్షాల మూర్ఖపు ఆరోపణలు మూసీ పరివాహక ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి మరోచోట మెరుగైన స్థలం, వసతులు కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ మూర్ఖపు ఆరోపణలు చేస్తున్నారని, గత పదేళ్లలో ఆ ప్రజల కోసం మీరు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పత్రిక విలేకరుల సమావేశంలో నాయకులు సముద్రాల అజయ్, ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిర్మల్‌లో అట్టహాసంగా వండర్ ల్యాండ్ ప్రారంభం

- ఆధునిక వినోద సౌకర్యాలు



నిర్మల్ బ్యూరో, మార్చి 15 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లాలోని రాణపూర్‌లో ఆదివారం ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్మల్ వండర్ ల్యాండ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్ హాజరుకాగా, స్థానిక శాసన సభ్యులు, బీజేపీ ఫ్లోర్ లీడర్ యేలేటి మహేశ్వరరెడ్డి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకలకు యువత, మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున హాజరై సందడి చేశారు. కేరింతల మధ్య అతిథులను స్వాగతిస్తూ పలువురు యువకులు సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ఇంత భారీ స్థాయిలో వినోద కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు వినోదం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిర్మల్ పట్టణంలోనే ఆధునిక సౌకర్యాలతో ఈ వండర్ ల్యాండ్ ఏర్పాటు చేయడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. వండర్ ల్యాండ్‌లో వాటర్ ఫార్క్, మల్టీ ప్లే స్టేషన్, కిడ్స్ ప్లే జోన్, బుల్ రైడ్, రాకెట్ ఈజెక్టర్, రెస్టారెంట్ వంటి ఆధునిక వినోద సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు, పిల్లలు ఆనందంగా సమయం గడపడానికి ఇది మంచి కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఈ పార్క్ ప్రారంభంతో నిర్మల్ జిల్లాలో పర్యాటక రంగానికి కూడా ఊతం లభిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 15 (జనంసాక్షి):జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చార్జ్ అధికారులు, అదనపు చార్జి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్ అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియాలో కేటీఆర్‌పై తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం

- బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ సోషల్ మీడియాలో విచ్చలవిడిగా నిరాధారమైన, సత్య దూరమైనటువంటి వార్తలతో టిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలలో వారికి ఉన్న అభిమానాన్ని తగ్గించే విధంగా వారి కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా పెయిడ్ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం చేయించడం కరెక్ట్ కాదని బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉపేంద్ర అన్నారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు విషయంలో ఏమైనా జరిగితే విచారణ జరపడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదని అలాంటి కేసులకు టిఆర్ఎస్ వ్యతిరేకమనికేటీఆర్ తెలియజేసిన తరువాత కూడాకాంగ్రెస్ పెయిడ్ సోషల్ మీడియా వర్కర్స్ పదేపదే వ్యక్తిత్వ హననం చేయడం దుర్మార్గమని అన్నారు. గతంలో కేటీఆర్ బావమరిది గృహప్రవేశం కార్యంలో కూడా ఇలాంటి తప్పుడు వార్తలే ప్రచారం చేశారని, నేడూ అదే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, మొదటి నుంచి కూడా కాంగ్రెస్ పార్టీ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రతిపక్ష పార్టీగా ఇదేవిధంగా ప్రచారం చేసి తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తిరిగి నిరాధారమైనటువంటి వార్తలతో తప్పుడు ప్రచారాలు చేయడం రాజకీయాలలో నైతిక విలువలను దిగ జార్చడమేనని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి దమ్ముంటే రేపు జరగబోయే అసెంబ్లీలో అందరికీ డ్రంకెన్ డ్రైవ్ లాగా డ్రగ్ టెస్టులు చేయాలని లేదంటే తప్పుడు ప్రచారం చేసినందుకు రెండు చెంపలు వేసుకొని పిసిసి అధ్యక్షుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షుడిగా ఉండి బాధ్యతారహిత్య మైనటువంటి స్టేట్మెంట్ ఇవ్వడం ద్వారా తప్పుడు సంకేతాలు వెళ్తాయని మీడియాకు మాట్లాడేటప్పుడు అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత ఆధారాలు ఉంటే మాత్రమే మాట్లాడాలని కేవలం వాళ్ళ గురువు ముఖ్యమంత్రి ని ఆదర్శంగా తీసుకొని మాట్లాడటం కరెక్ట్ కాదని హితవు పలికారు ఇలాంటి తప్పుడు విమర్శలు చేస్తే తప్పకుండా కోర్టులో గౌరవభంగ మైనటువంటి అంశంలో డిఫమేషన్ కేసులు వేసి కోర్టులో సరైన శిక్ష పడే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన అన్నారు

## ఫంక్షన్‌లకు సంబంధం లేని వ్యక్తులు వస్తే జరిమానా

- ఏటూరునాగారం లోని ఒక కల్యాణ మండపం ముందు వెలసిన ఫ్లెక్సీ




ఏటూరు నాగారం, మార్చి 15 (జనంసాక్షి) : ఇటీవల కాలంలో ఈ యొక్క విషయం తెగ వైరల్ అవుతుంది అందరికీ తెలిసిన విషయమే.ఏటూరునాగారం లోని శ్రీనివాస కల్యాణ మండపం ముందు అర్చికి ఈ యొక్క ఫ్లెక్సీని యజమాని బిళ్ళ శ్రీనివాస్ పెట్టడంతో పలువురు ఆశ్చర్యపోయారు.ఇది ఒక కల్యాణ మండపం మొదట మహబూబాబాద్ లో వెలసి,త్వరలోనే ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్ లో ప్రజల సెల్ ఫోన్ స్టేటస్ లో తెగ వైరల్ అవుతుంది.ఇది పెట్టడం కూడా మంచిదే అని ఆయా ఫంక్షన్లు చేసే కుటుంబ సభ్యులు,బంధువులు కూడా అంటున్నారు.ఈ యొక్క విషయాన్ని, ఫ్లెక్సీ ని కూడా ఇతర కల్యాణ మండపాల్లో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని కూడా కొందరి అభిప్రాయం మనసులో ఉంది అని తెలుపడం జరిగింది.

## అరకొరగా రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌ల మంజూరు సరికాదు

- కేటాయింపుల్లో రాజకీయ వివక్ష.. పేదలకు అన్యాయం
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా ఆవేదన



హైదరాబాద్ (జనంసాక్షి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిరుపేద ముస్లింలకు అందించే రంజాన్ గిఫ్ట్ ప్యాక్ లను అత్యంత అరకొరగా మంజూరు చేసిందని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20,000 మసీదుల పరిధిలో 44 లక్షల ముస్లిం జనాభా ఉండగా, అందులో 80 శాతానికి పైగా ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అయితే, ప్రభుత్వం కేవలం 815 మసీదులకు మాత్రమే 4,07,500 గిఫ్ట్ ప్యాక్‌లను కేటాయించడం సరికాదని విమర్శించారు. ముఖ్యంగా ఈ కేటాయింపుల్లో పక్షపాత ధోరణి కనిపిస్తోందని, ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు 5 వేల చొప్పున మరియు మంత్రుల నియోజకవర్గాలకు 2 వేల చొప్పున ప్యాక్‌లను అదనంగా కేటాయించి, మిగిలిన ప్రాంతాల్లోని లక్షలాది మంది పేదలను విస్మరించారని మండిపడ్డారు.ఈ నిర్ణయం పేద ముస్లింల మధ్య చిచ్చు పెట్టినట్లయిందని, అలాగే కేవలం 815 మసీదుల్లోనే ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేద ముస్లింలందరికీ చేరాలే తప్ప, ఇలాంటి పక్షపాత చర్యల వల్ల ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన హితవు పలికారు. ముస్లిం సమాజం మధ్య వైరుధ్యాలు సృష్టించే విధంగా కాకుండా, భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా ప్రతి పేద ముస్లింకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని యాకూబ్ పాషా డిమాండ్ చేశారు.

## మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ డ్రగ్స్ ఘటనపై పారదర్శక విచారణ జరపాలి

- అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్ టెస్ట్ చేయించుకుందాం
- ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ సవాల్



హైదరాబాద్, మార్చి 15 (జనంసాక్షి) : మొయినాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ ఘటనపై పూర్తి స్థాయి, లోతైన మరియు పారదర్శక విచారణ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఎవరు ఉన్నా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా, ఎంతటి పెద్దవారైనా సరే చట్టం ముందు సమానంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి జరిగిన విందులో టీడీపీ ఎంపీ మహేష్ యాదవ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు పాల్గొన్నారని సమాచారం ఉందని, ఆ ఫార్మ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికాయని పోలీసులు చెబుతున్న నేపథ్యంలో నిజానిజాలను పూర్తిగా వెలికితీయాలని అన్నారు. ఈ ఘటనను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ సోషల్ మీడియా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కావాలని బురద జల్లుతోందని తీవ్రంగా ఖండించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సహవాస దోషంతో కేటీఆర్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన హోదాకు తగ్గట్టు వ్యవహరించకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ ఘటనకు కేటీఆర్‌ను లింకు పెట్టడం అంటే మోకాలికి బోడి గుండు కు సంబంధం అంటగట్టినట్లేనని వ్యాఖ్యానించారు. డ్రగ్స్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు ఉందా అని ప్రశ్నించిన శ్రవణ్, చెర్లపల్లిలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను ముంబై పోలీసులు పట్టుకున్న ఘటనను ప్రస్తావించారు. ముంబై పోలీసులు వచ్చే వరకు రాష్ట్రంలోని ఈగల్ పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా అని ఆయన ప్రశ్నించారు. 2025 సంవత్సరంలో రాష్ట్రంలో 2,572 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని, గంజాయి వినియోగం అదుపు లేకుండా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. శాసన మండలిలో డ్రగ్స్ అంశంపై తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం 30 శాతం పెరిగిందని ప్రభుత్వం తెలిపిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనే బదులు రాజకీయాలకు మళ్లిస్తోందని విమర్శించారు. డ్రగ్స్ అంశంపై ఎవరైనా అనుమానాలు వ్యక్తం చేస్తే, డ్రగ్స్ టెస్ట్‌కు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని శ్రవణ్ స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యాగానే అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అన్ని పార్టీల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వరుసగా నిలబడి డ్రగ్ టెస్ట్ చేయించుకుందామని ఆయన సవాల్ విసిరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేటీఆర్ ప్రభుత్వం లోపాలను ఎత్తి చూపుతున్నందుకే కాంగ్రెస్ నేతలు ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. గతంలో మంత్రి కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన అనుచిత ఆరోపణలపై కోర్టు గట్టి హెచ్చరికలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌పై పిచ్చి ఆరోపణలు చేసే కాంగ్రెస్ నేతలను కోర్టులోకి లాగుతామని హెచ్చరించారు.

## సంగారెడ్డి ఇఫ్తార్ విందులో ముగ్గురు మంత్రులు







- జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మిలాద్ గ్రౌండ్‌లో విందు

సంగారెడ్డి, మార్చు 15( జనం సాక్షి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మిలాద్ గ్రౌండ్ లో ఆదివారం సాయంత్రం జగ్గారెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్రంలోని ముగ్గురు మంత్రులు హాజరైనారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్‌లో కోచ్ తిరుమల రావు స్టూడెంట్స్ సత్తా

హైదరాబాద్ (జనంసాక్షి) : ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర 3వ రిలే కార్నివాల్ లో 60 మీటర్ల పరుగు, 14 ఏళ్లలోపు 600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు 20 ఏళ్లలోపు 400 మీటర్ల పరుగు, ,100 మీటర్ల 400 మీటర్ల పరుగు పురుషులు మరియు మహిళలు. మన మేడ్చల్ మల్కాజ్గిరి కి సంబంధించిన అథ్లెట్స్ విజయం సాధించారు . అండర్ - 20 కాంస్యపతకం గరిగే అభినయ శ్రీ 100 మీటర్స్, ఉమెన్ 400మీటర్స్ రన్నింగ్‌లో స్వర్ణపతకం పోత్రకుండ సరిత , కాంస్యపతకం తిరుమల 100 మీటర్స్ మెన్స్ లో అండర్ -14 అమ్మాయిలు 600మీటర్స్ ఫైనల్స్ క్వాలిఫై సాధించారు. ఎస్ గౌతమి, ఎం దీపిక సాధించారు. జెఎన్ స్టేడియం, హనుమకొండ జరగగా ఇందులో అత్యున్నత మెరిట్ అథ్లెట్స్ మన తెలంగాణ తరఫున జాతీయ స్థాయి పోటీలు చండీగఢ్ ఈనెల మార్చ్ 28వ తారీకు ఆడారు. వీరిని కోచ్ తిరుమలరావు అభినందించారు.

## వెలుగుమట్ల బాధితులకు బీఆర్ఎస్ ఆపన్నహస్తం



ఖమ్మం (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూముల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, కుటుంబాలను పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారు ఇటీవల ఖమ్మం పర్యటనలో పాల్గొని వారికి ధైర్యం, భరోసా ఇచ్చిన విషయం తెలిసిందే. బాధితుల సమస్యలను దగ్గరగా తెలుసుకొని, వారికి న్యాయం జరిగేలా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితులకు బీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ తమ సంఘీభావాన్ని తెలియజేస్తుందని బీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా బాధిత రైతులకు న్యాయం జరగాలని ఆయన ఆకాంక్షించారు. అక్కడ జరిగిన కార్యక్రమానికి అన్ని విధాలుగా సహకరించిన ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు గారికి బీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత కొన్ని రోజులుగా ప్రతి రోజు బాధితుల వద్దకు వెళ్లి వారికి సహాయ సహకారాలు అందిస్తూ, ఎన్నో మంది కుటుంబాలకు ధైర్యం మరియు భరోసా కల్పిస్తూ నిరంతరం అండగా నిలుస్తున్నారని ఆయన అభినందించారు.

# ఒక యుగాంతపు అంతర్మథనం..!



భారతదేశ అంతర్గత భద్రతను దశాబ్దాల పాటు శాసించిన ఒక సాయుధ పోరాటం నేడు ముగింపు అంచున నిలబడి ఉంది. ఇంకా చెప్పాలంటే దాదాపుగా ముగిసిందనే చెప్పాలి. అడవుల నుండి వినిపించిన గెరిల్లా గర్జనలు ఇప్పుడు మీడియా చర్చల రూపంలో, నాయకుల మధ్య ఆరోపణల పర్వంగా మారి బహిరంగ వేదికల మీదకు రావడం ఒక యుగాంతాన్ని సూచిస్తోంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలోని అగ్ర నేత దేవ్ జీ ఇటీవలి ఇంటర్వ్యూ, ఆ పార్టీలోని అంతర్గత వైరుధ్యాలను మాత్రమే కాదు, ఒక సిద్ధాంతం తన ఉనికి కోసం పడుతున్న వేదనను కూడా బయటపెట్టింది. అయితే, ఈ 'అంతర్మథనం'లో గెలుపోటముల కంటే, ఈ నాయకుల అడుగులు సమాజంపై చూపే ప్రభావమే ఇప్పుడు చర్చనీయాంశం.

ఒకరకంగా భారతదేశ సాయుధ విప్లవోద్యమ చరిత్రలో నేడు ఒక వింతైన, కలవరపెట్టే దృశ్యం ఆవిష్కృతమవుతోందని, దశాబ్దాల పాటు 'క్రమశిక్షణ'కు మారుపేరుగా, రహస్య కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఒక శక్తివంతమైన పార్టీగా చెప్పుకునే పార్టీ నేడు టీవీ కెమెరాల ముందు తన అంతర్గత కలహాలను వీధిన పెట్టుకుంటోందని, ఆ పార్టీలోని చీలికను బహిర్గతం చేయడమే కాకుండా, సాయుధ పోరాటం ఏ తీరానికి చేరుకుందో స్పష్టం చేస్తోంది. అయితే, ఒక పరిశీలకుడిగా మనం సోను లేదా దేవ్ జీ ల పక్షం వహించకుండా, ఈ మొత్తం వ్యవహారాన్ని సమీక్షించడమే ఇక్కడ చేసే ప్రయత్నం.

**మీడియా చర్చలు అవసరమే కానీ సోను లేదా దేవ్ జీ మధ్య జరుగుతున్న, లేదా అగ్రనేతల మధ్య జరుగుతున్న మీడియా చర్చల వాదనల ఆరోపణల ప్రక్రియతో ముందే చెప్పినట్లుగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదు. నాయకులు తమ వ్యక్తిగత ఇగోలను పక్కనపెట్టి, ఒక ఐక్య అవగాహనతో ప్రజల పక్షాన, రాజ్యాంగ బద్ధంగా నిలబడాలి.**

అయితే మావోయిస్టు ఉద్యమ చరిత్రలో చీలికలు కొత్తేమీ కాదు, కానీ ప్రస్తుత ఘర్షణలో సిద్ధాంతం కంటే 'వ్యక్తిగత అస్తిత్వమే' ఎక్కువగా కనిపిస్తోంది. ఒకవైపు మల్లోజుల వేణుగోపాల్ (సోను), ఆశన్న వర్గం వందల సంఖ్యలో క్యాడర్‌తో బయటకు రావడం ఒక వాస్తవిక నిర్ణయంగా కనిపిస్తుంటే, దేవ్ జీ దీనిని 'ద్రోహం'గా అభివర్ణించడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక్కడ ప్రశ్న ఎవరిది ద్రోహం అని కాదు.. దశాబ్దాల పాటు ప్రజల కోసం అని చెప్పిన పోరాటం, చివరకు నాయకుల మధ్య 'ఎవరు స్వచ్ఛమైన విప్లవకారుడు..?' అనే పోరుగా ఎందుకు మారింది..? అనేదే ప్రశ్న.

ఈ మొత్తం చర్చలో అత్యంత ఆందోళనకరమైన బాధ్యతారాహిత్యమైన అంశం 'అర్బన్ నక్సల్స్' ప్రస్తావన. దేవ్ జీ వంటి అగ్రనేతలు 'లీగల్' రాజకీయాల గురించి మాట్లాడటం ఇప్పటికే 'అర్బన్ నక్సల్స్' ముద్రతో జైళ్లలో మగ్గుతున్న, లేదా ఆ కేసుల వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతున్న పౌర హక్కుల నేతలను, మేధావులను, ప్రజాసంఘాల ప్రతినిధులను, జర్నలిస్టులను మరింత ప్రమాదంలోకి నెట్టేలా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగుతున్న వారిపై నిఘా పెరిగేలా చేస్తున్నట్లుగా వ్యవహారం సాగుతున్న పరిస్థితి కనిపిస్తున్నది.

నిజానికి, ఈ అగ్రనేతల అడుగులు వారిని నమ్మి అడవికి వెళ్ళిన అమాయక క్యాడర్‌ను గానీ, లేదా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల కోసం పోరాడే వారిని గానీ కాపాడేలా ఉండాలి. వారి సిద్ధాంత ప్రభావంతో, లేదా ఆ సిద్ధాంతాన్ని ఆపాదించి నిందించి ముద్రవేసి అరెస్టులు చేయబడిన సామాన్యులు, విద్యావంతులు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మాత్రం చట్టపరమైన ఊబిలో ఉండిపోవడాన్ని కూడా మరువొద్దు. ఈ స్థితిలో తమ ఉనికిని చాటుకునే క్రమంలో వ్యవస్థను మరింత కఠినతరం చేసి, అన్యాయంగా ముద్రలు పడ్డ వారిని ఇబ్బందుల్లోకి నెట్టేసే విధంగా ఉండకూడదు. నేడు ప్రధాన స్రవంతిలోకి వచ్చిన సోను, దేవ్ జీ వంటి నేతలు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే పరిస్థితి పెరిగడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. వారు అడవిలో ఉన్నప్పుడు పాటించిన 'సమిష్టి నాయకత్వం' అనే సూత్రాన్ని ఇప్పుడూ పాటించకపోవడాన్ని ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలో వారే పరిశీలించుకోవాలి. లొంగుబాటు లేదా పంథా మార్పు అనేది కేవలం వ్యక్తిగత భద్రతకు పరిమితం కాకూడదు.?నేతల మధ్య ఒక ఐక్య అవగాహన ఉంటేనే, ఇంకా అడవిలో ఉన్న ఆ పార్టీకి చెందిన 'మావో'లకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుంది. విడివిడి గ్రూపులుగా విడిపోయి ఉండటం కంటే ఒక సమూహంగా ప్రభుత్వంతో చర్చలు జరిపి, తమను నమ్మిన వారికి సామాజిక, రాజకీయ పునరావాసం కల్పించడంలో వీరు బాధ్యత వహించాలి. ఐక్యత లేని ఈ నాయకత్వం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న వారికి అభద్రత పెరుగుతుందే తప్ప శాంతి లభించదు అనే అంశాన్ని గమనించాలి. ఇక్కడ శాంతి అనేది కేవలం ఆయుధాలు కింద పెట్టడం వల్ల రాదు. దశాబ్దాల పాటు జరిగిన హింసకు బాధ్యత వహించడం, బాధితులకు న్యాయం చేయడం, రాజ్యాంగ విలువలకు నిజాయితీగా తలవంచడం ద్వారానే వస్తుంది.

చివరిగా 'ఒక యుగాంతపు అంతర్మథనం' అంటే కేవలం ఒక ఉద్యమం ముగియడం మాత్రమే కాదు. ఆ ఉద్యమం విడిచిపెట్టిన గాయాలకు చికిత్స చేయడం కూడా. తమ వాయిస్, తమ అభిప్రాయాలు ప్రజలకు తెలియపరుచడం కోసం మీడియా చర్చలు అవసరమే కానీ సోను లేదా దేవ్ జీ మధ్య జరుగుతున్న, లేదా అగ్రనేతల మధ్య జరుగుతున్న మీడియా చర్చల వాదనల ఆరోపణల ప్రక్రియతో ముందే చెప్పినట్లుగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదు. నాయకులు తమ వ్యక్తిగత ఇగోలను పక్కనపెట్టి, ఒక ఐక్య అవగాహనతో ప్రజల పక్షాన, రాజ్యాంగ బద్ధంగా నిలబడాలి. ప్రభుత్వం కూడా వీరిని రాజకీయ పావులుగా వాడుకోకుండా, దశాబ్దాల హింసలో నలిగిపోయిన ఆదివాసీలకు, బాధితులకు నిజమైన న్యాయం చేయాలి. అప్పుడే ఈ సుదీర్ఘ పోరాట ముగింపునకు ఒక అర్థవంతమై ముగింపు అవుతుంది.



**రాజేందర్ దామెర (దారా)**
**సీనియర్ జర్నలిస్ట్**
rajenderdamera@mail.com

## ఆకాశమంత ధరలు ..

# అట్టడుగున పేదవాడి బతుకు!

భారతదేశం ఆర్థికంగా దూసుకుపోతోందని గణాంకాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దేశంలోని ప్రతి గల్లీలో, ప్రతి పల్లెటూరి చివరన నివసించే పేదల జీవితాలు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. ఒకప్పుడు కనీస అవసరాలుగా పిలవబడే కూడు, గూడు, గుడ్డ నేడు వారి పాలిట లగ్జరీ వస్తువులుగా మారుతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, వైద్యం, విద్య ఇలా ప్రతిదీ సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంటుంటే, వారి ఆదాయం మాత్రం నత్తనడకన సాగుతోంది. ఈ వ్యత్యాసం పేదరికాన్ని కేవలం ఆర్థిక సమస్యగా కాకుండా, ఒక జీవన్మరణ పోరాటంగా మార్చేసింది. గత రెండు మూడు ఏళ్ల కాలంలో ఆహార ద్రవ్యోల్బణం సామాన్యుడి వంటగదిపై కోలుకోలేని దెబ్బ కొట్టింది. బియ్యం, పప్పులు, వంటనూనెలు వంటి ప్రాథమిక అవసరాల ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. గతంలో 30 రూపాయలకు లభించే అరటిపండ్లు నేడు 70 రూపాయలు పలుకుతున్నాయి. టమాటా, ఉల్లిపాయల ధరలు పెరిగినప్పుడు పేదవాడి కంచంలో కూర మాయమై, కేవలం పచ్చడితోనో లేదా ఉప్పుతోనో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.



**ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల నాణ్యతను పెంచి, ప్రైవేట్ దోపిడీని అరికట్టాలి. యువతకు ఉపాధి దొరికేలా వృత్తి విద్యా కోర్సులను ఉచితంగా అందించాలి.**

హైదరాబాద్‌లోని బసంతినగర్ మురికివాడలో నివసించే రాజమ్మ ఆవేదన వింటే మనసు కలచివేస్తుంది. ఆమె భర్త దినసరి కూలీ. మంచి రోజుల్లో ఆరు వందల రూపాయలు వస్తాయి, కానీ నెలకు పది రోజులు పని ఉండటమే కష్టమవుతోంది. ఇద్దరు పిల్లల చదువు, కడుపు నిండా అన్నం పెట్టడం ఇప్పుడు అసాధ్యంగా కనిపిస్తోంది. రెండేళ్ల క్రితం రెండు వందల రూపాయలతో సంచి నిండా కూరగాయలు తెచ్చేదాన్ని, ఇప్పుడు ఐదు వందలు పెట్టినా సంచి అడుగు కూడా నిండటం లేదు అని ఆమె కన్నీళ్ల పర్యంతమైంది. ఇది కేవలం రాజమ్మ కథ కాదు, దేశంలోని కోట్ల మంది తల్లుల వ్యథ.

నగరాలకు వలస వచ్చే పేదలకు నివాసం అనేది ఒక పెద్ద సవాలు. విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో కూడా ఒక చిన్న సింగిల్ రూమ్ అద్దె నెలకు 3000 నుండి 5000 రూపాయల వరకు ఉంటోంది. దీనికి తోడు విద్యుత్, నీటి బిల్లులు అదనం. తక్కువ అద్దె కోసం చాలా కుటుంబాలు గాలి, వెలుతురు లేని, అసురక్షితమైన భవనాల్లో లేదా మురికివాడల్లో ఉండక తప్పడం లేదు. తిరుపతిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే శివయ్య తన కష్టాలను ఇలా చెప్పుకొచ్చాడు. నాకు వచ్చే 15,000 రూపాయల జీతంలో 5,000 అద్దెకే పోతుంది. కరెంటు బిల్లు మరో 2,000 దాటుతోంది. వేసవిలో ఫ్యాన్ వేయకుండా ఉండలేం కదా! మిగిలిన డబ్బుతో నలుగురు మనుషులు తినాలా? పిల్లల్ని చదివించాలా? ఒక్కోసారి నెల ఆఖరులో తిండికి కూడా డబ్బులు లేక తెలిసిన వారి దగ్గర చేయిచాచాల్సి వస్తోంది. ఈ అద్దెల భారం పేదవాడిని ఎప్పటికీ సొంత గూడులేని అద్దె బానిసగానే ఉంచుతోంది.

పేదలకు వైద్యం అనేది ఒక పీడకల. ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నప్పటికీ, అక్కడ రద్దీ, సౌకర్యాల కొరత వల్ల అదనపు ఖర్చులు తప్పడం లేదు. మందులు, స్కానింగ్‌లు, రక్తం పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. చిన్న జ్వరానికి కూడా కనీసం వెయ్యి రూపాయలు ఖర్చవుతున్న రోజులివి. కర్నూలుకు చెందిన లక్ష్మీదేవి తన అనుభవాన్ని పంచుకుంటూ, నా కూతురికి డెంగ్యూ వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాం. కానీ మందులు, ప్లేట్‌లెట్స్ కోసం కావాల్సిన ప్రత్యేక ఆహారం కోసం 15,000 రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. ఆ అప్పు తీర్చడానికి నా చిన్నపాటి బంగారు నగలను అమ్ముకోవాల్సి వచ్చిందని బాధపడింది. ఇక డయాబెటిస్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులున్నవారి పరిస్థితి వర్ణనాతీతం.

మందుల కోసం నెలకు వేల రూపాయలు ఖర్చు చేయలేక చాలామంది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రతి పేద తండ్రి తన బిడ్డ తనలా కష్టపడకుండా గొప్పగా చదువుకోవాలని కోరుకుంటాడు. కానీ నేటి విద్యా వ్యయం ఆ కలలను చిదిమేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు లేకపోయినా, పుస్తకాలు, యూనిఫాంలు, ప్రైవేట్ ట్యూషన్లు, ప్రాజెక్ట్ వర్కుల పేరుతో అవుతున్న ఖర్చు తడిసిమోపెడవుతోంది. గుంటూరులో నివసించే నాగరాజు అనే కార్మికుడు తన గోడు వెళ్లబోసుకున్నాడు. నా ఇద్దరు పిల్లలు హైస్కూల్లో ఉన్నారు. వారి పుస్తకాలు, బస్సు చార్జీలు, స్పెషల్ క్లాసుల కోసం నెలకు 5,000 రూపాయలు కావాలి. నా జీతంలో మూడో వంతు ఇందుకే పోతే, ఇంకా సంసారం ఎలా గడవాలి? పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అవ్వాలని అడుగుతుంటే, నా జేబు చూసుకుని భయమేస్తోంది. పేదరికం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా చదువు మధ్యలోనే ఆపేయడం సామాజిక విషాదం.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కేవలం వాహనదారులనే కాదు, బస్సుల్లో ప్రయాణించే పేదలను కూడా దెబ్బ తీస్తోంది. ఆర్టీసీ చార్జీల పెరుగుదల వల్ల రోజువారీ కూలీలు తమ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోంది. అలాగే, వంట గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయలు దాటడంతో, మళ్లీ పాత రోజుల్లాగే కట్టెల పొయ్యిని ఆశ్రయిస్తున్న వారు ఎందరో ఉన్నారు. ఇది వారి ఆరోగ్యంపై, ముఖ్యంగా మహిళల ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ప్రభుత్వాలు రేషన్ బియ్యం, పెన్షన్లు వంటి పథకాలు అందిస్తున్నా, అవి ప్రస్తుత ద్రవ్యోల్బణానికి ఏమాత్రం సరిపోవడం లేదు. నెలకు ఇచ్చే 5 కిలోల బియ్యం ఒక కుటుంబానికి వారం రోజులకు కూడా సరిపోవు. వృద్ధాప్య పెన్షన్ 4,000 రూపాయలు అనేది నేటి ధరల ప్రకారం కేవలం ఒక వ్యక్తి మందులకే సరిపోతుంది. పథకాల్లో ఉన్న లోపాలు, మధ్యవర్తుల ప్రమేయం వల్ల అర్హులకు పూర్తిస్థాయిలో సాయం అందడం లేదు.

ఆర్థిక నిపుణుల ప్రకారం, దేశంలో ఆర్థిక అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ద్రవ్యోల్బణం అనేది పేదవాడిపై పడే పరోక్ష పన్ను. ధనికుల ఆదాయం పెరిగినంత వేగంగా పేదవారి వేతనాలు పెరగవు, అని ప్రొఫెసర్ రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. సామాజిక కార్యకర్తలు చెబుతున్నట్లుగా, కేవలం ఉచిత పథకాలు కాకుండా, శాశ్వత ఉపాధి కల్పన మరియు ధరల నియంత్రణ మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం.

నిరంతర ఆర్థిక ఇబ్బందులు పేదల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. రేపు ఏం తినాలి? అప్పు ఎలా తీర్చాలి? పిల్లల ఫీజు ఎలా కట్టాలి? అనే ప్రశ్నలు వారిని నిద్రపోనివ్వడం లేదు. ఈ ఒత్తిడి వల్ల కుటుంబాల్లో గొడవలు, ఆత్మహత్యలు, మద్యపానం వంటి సామాజిక సమస్యలు పెరుగుతున్నాయి. ఆకలి తీరని చోట నైతికత ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా మార్కెట్ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ధరల పెరుగుదలకు అనుగుణంగా అసంఘటిత రంగ కార్మికుల వేతనాలను సవరించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల నాణ్యతను పెంచి, ప్రైవేట్ దోపిడీని అరికట్టాలి. యువతకు ఉపాధి దొరికేలా వృత్తి విద్యా కోర్సులను ఉచితంగా అందించాలి. రేషన్ ద్వారా కేవలం బియ్యమే కాకుండా పప్పులు, నూనె వంటి ఇతర నిత్యావసరాలను కూడా అందించాలి. దేశాభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, జీడీపీ అంకెలు మాత్రమే కాదు. చిట్టచివరి పేదవాడు కూడా మూడు పూటలా తృప్తిగా భోజనం చేసి, తన పిల్లలను గౌరవంగా చదివించుకోగలిగినప్పుడే అది నిజమైన అభివృద్ధి. సామాన్యుడి కళ్లలో నీరు తుడవని ఏ ఆర్థిక విధానమైనా విఫలమైనట్టే. ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా స్పందించి, పేదరికం అనే చీకటి నుండి వారిని బయటకు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది. మానవత్వం ఉన్న సమాజంగా మనందరి బాధ్యత ఇది.

**డా. సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

## క్యూబా వైఖరిలో మార్పు

# వ్యూహాత్మక పునరాలోచనా.. లేక లొంగుబాటా?

క్యూబా అధ్యక్షుడు మిగ్యుయేల్ దయాజ్ కానెల్ చేసిన ప్రకటన, అమెరికాతో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధమని చెప్పడం, కరేబియన్ దీవుల దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. దశాబ్దాలుగా అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటూ, ఆ దేశం ఇంతవరకు ఇలాంటి స్పష్టమైన చర్చల ప్రతిపాదన చేయలేదు. ముఖ్యంగా ట్రంప్ పాలనా యంత్రాంగం 'క్యూబా పతనం దశలో ఉంది' అని ప్రకటిస్తున్న సమయంలో కానెల్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అంతర్జాతీయ పరిణామాలే ఈ మార్పుకు కారణమని ఆయన సూచించారు కానీ వివరాలు చెప్పలేదు. నిశితంగా పరిశీలిస్తే, కేవలం దౌత్యపరమైన మార్పు మాత్రమే కాకుండా, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, వెనిజులాలో మారిన పరిస్థితులు, లాటిన్ అమెరికాలో క్యూబాకు తగ్గుతున్న మద్దతు వంటి అంశాలు ఈ నిర్ణయం వెనుక ఉన్నాయి .

గత కొన్ని నెలలుగా క్యూబాలో పెట్రోలు సరఫరాలు పూర్తిగా నిలిచిపోవడం, దేశంలోని కార్యకలాపాలు స్తంభించడం వంటి విషయాలు కానెల్ స్వయంగా ప్రస్తావించారు. ఇది కేవలం దౌత్యపరమైన భాష కాదు, వాస్తవ పరిస్థితికి అద్దం పడుతుంది. అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలు, ముఖ్యంగా చమురు నౌకలను అడ్డగించడం, క్యూబాపై అపూర్వమైన ఒత్తిడిని సృష్టించాయి . 1962లో క్యూబా క్షిపణి సంక్షోభ సమయంలో కెన్నెడీ పరిపాలన కూడా సైనిక పరికరాలకు మాత్రమే పరిమితం చేసిన నిరోధాన్ని, నేటి ట్రంప్ పరిపాలన మొత్తం చమురు సరఫరానే నిలిపివేసే స్థాయికి తీసుకెళ్లింది. ఆర్థిక ముట్టడి ద్వారా పాలనను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ విధానం, క్యూబా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. కరెంటు కోతలు, ఆహార కొరత, ఆరోగ్య సేవలు కుప్పకూలడం ఇవన్నీ ఇప్పుడు క్యూబాలో సాధారణ దృశ్యాలుగా మారాయి .

క్యూబా ఈ నిర్ణయం తీసుకోవడానికి మరో కీలక కారణం వెనిజులాలో జరిగిన పరిణామాలు. నికోలస్ మదురోను అమెరికా ప్రత్యేక దళాలు ఎత్తుకెళ్లడం, ఆయన భద్రతా బృందంలో ఉన్న 32 మంది క్యూబన్లు మరణించడం – ఇది హవానాకు పెద్ద షాక్ లాంటిది . చావెజ్–క్యాస్ట్రోల కాలం నుండి కొనసాగుతున్న వెనిజులా–క్యూబా స్నేహం, మదురో పతనంతో ప్రమాదంలో పడింది. వెనిజులా నుండి రోజుకు 35,000 బ్యారెళ్ల చమురు సరఫరా అయ్యేది, ఇప్పుడు అది పూర్తిగా నిలిచిపోయింది . వెనిజులాలో కొత్తగా అధికారంలోకి వచ్చిన డెల్సీ రోడ్రిగెజ్ ప్రభుత్వం, ట్రంప్ షరతులకు లొంగి, క్యూబాకు మద్దతు తగ్గించే అవకాశం ఉంది. మదురు అనుసరించిన ఎదురు నిలబడే విధానం ఫలించలేదని, చర్చల ద్వారా బతికే ప్రయత్నం చేయాలనే పాఠం క్యూబా నేతలకు అర్థమైంది .

అంతర్జాతీయ స్థాయిలో కూడా క్యూబా ఒంటరిగా మారింది. బ్రెజిల్, మెక్సికో, కొలంబియా వంటి దేశాలు, సాంప్రదాయకంగా క్యూబాకు మద్దతు ఇచ్చిన వామపక్ష ప్రభుత్వాలు కూడా, ట్రంప్ ఒత్తిడికి లొంగి చమురు సరఫరా నిలిపివేశాయి . మెక్సికో వంటి దేశం, 2025లో క్యూబాకు అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉండి, ట్రంప్ టారిఫ్ బెదిరింపులతో సరఫరా ఆపేసింది. ఈక్వడార్ దౌత్య సంబంధాలు తెంచుకోగా, గ్వాటెమాల, హోండురస్ వైద్యుల ఒప్పందాలు రద్దు చేసుకున్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రతి ఏటా క్యూబాపై ఆంక్షలను వ్యతిరేకిస్తూ తీర్మానాలు వస్తున్నప్పటికీ, ఆచరణలో ఆ మద్దతు కేవలం మాటలకే పరిమితమైంది. క్యూబా ఇప్పుడు పశ్చిమార్ధగోళంలో దాదాపు ఒంటరి దేశంగా మారింది.



ఈ నేపథ్యంలోనే క్యూబా ప్రభుత్వం, వాటికన్ మధ్యవర్తిత్వంతో 51 మంది ఖైదీలను విడుదల చేయడానికి ముందుకు వచ్చింది . 2010 నుండి 9,905 మంది, గత మూడేళ్లలో మరో 10,000 మంది విడుదల చేసినట్లు కానెల్ ప్రకటించడం, ఇది కొత్త విధానం కాదని చెప్పినా, టైమింగ్ మాత్రం గమనార్హం. ఇది వాటికన్ కు సద్భావన ప్రకటనగా పేర్కొన్నా, అమెరికాతో చర్చలకు ముందస్తు షరతుల్లో భాగమని స్పష్టమవుతోంది. అసమ్మతివాది జోస్ డేనియల్ ఫెర్రర్ విడుదల, ఆయన అమెరికా వెళ్లిపోవడం– ఇవన్నీ అంతర్జాతీయ ఒత్తిడికి క్యూబా ఎలా స్పందిస్తోందో చూపిస్తున్నాయి.

మరో ఆసక్తికరమైన పరిణామం, రౌల్ కాస్ట్రో మనవడు రౌల్ గుల్లెర్మో రోడ్రిగెజ్ కాస్ట్రో (రౌలిటో) ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపించడం. మార్కో రూబియోతో ఈయన రహస్య చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. రౌల్ కాస్ట్రోకు అత్యంత సన్నిహితుడైన ఈయన, తాత భద్రతా బృందానికి నేతృత్వం వహించిన అనుభవం ఉన్నవాడు. ఇప్పుడు ఇతను ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపించడం, అధికార బదిలీకి సన్నాహాలు జరుగుతున్నాయనే అనుమానాలను రేపుతోంది. క్యూబాలో మార్పు రావాలంటే అది క్రమంగా, చర్చల ద్వారా జరగాలని రూబియో ఇటీవల వ్యాఖ్యానించడం కూడా ఈ సందర్భంలో మరువరానిది .

కానీ ఈ చర్చలు ఎంతవరకు ఫలిస్తాయి? అమెరికా లక్ష్యం స్పష్టంగా 'పాలన మార్పు' అని రూబియో బహిరంగంగా చెప్పడం, క్యూబాతో చర్చలు అంటే కేవలం లొంగుబాటుతప్ప మరోటి కాదనే అనుమానాన్ని కలిగిస్తోంది. క్యూబా వైపు నుండి, తమ సార్వభౌమత్వం, రాజకీయ వ్యవస్థ పట్ల గౌరవం ఉండాలనే షరతు పెట్టడం, పూర్తి లొంగుబాటుకు సిద్ధంగా లేదని సూచిస్తోంది . చారిత్రక అనుభవం ప్రకారం, క్యూబాపై ఒత్తిడి పెంచడం వల్ల మాత్రమే ఆ దేశ ప్రజలు బాధపడతారు తప్ప, పాలన మార్పు జరగదు. 60ఏళ్లుగా అమెరికా ఆంక్షలు విఫలమవడం దీనికి నిదర్శనం. క్యూబా ఇప్పుడు చేస్తున్నది, నికోలస్ మదురోను పతనం నుండి నేర్చుకున్న పాఠం ఆధారంగా మనుగడ కోసం చేస్తున్న వ్యూహాత్మక మార్పు మాత్రమే.

క్యూబా ముందు ఉన్న మార్గం సుగమంగా లేదు. చర్చలు ప్రారంభించడం ఒక విషయం, వాటిని కొనసాగించడం మరో విషయం. అమెరికా తరఫున మాట్లాడేవారు ట్రంప్ వ్యవహార శైలిని బట్టి ఊహించలేని విధంగా ప్రవర్తించవచ్చు. క్యూబా ఇప్పటికే చేసిన చిన్న చిన్న రాయితీలు (ఖైదీల విడుదల) త్వరలోనే పెద్ద డిమాండ్లకు దారితీస్తాయి. క్యూబా ఆర్థిక వ్యవస్థను తెరవాల్సిన అవసరం ఎంతైనా ఉంది, కానీ అది అంతర్గతంగా, క్యూబా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జరగాలి . బయటి ఒత్తిడితో వచ్చే మార్పులు కేవలం మరో రకమైన ఆధిపత్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ట్రంప్ 'డాన్రో డాక్ట్రిన్' పేరిట లాటిన్ అమెరికాను అమెరికా వెనుక స్థలంగా భావించే విధానం, క్యూబా చర్చలను ప్రభావితం చేస్తుంది .

మొత్తంమీద, క్యూబా ఇప్పుడు చేస్తున్న ప్రకటనలు, చర్యలు – ఇవన్నీ ఒక క్లిష్టమైన దశలో తీసుకున్న నిర్ణయాలు. వీటిని పూర్తి లొంగుబాటుగా కాకుండా, వ్యూహాత్మక పునరాలోచనగా చూడాలి. అమెరికా ఒత్తిడి, వెనిజులా పతనం, లాటిన్ అమెరికా మద్దతు కోల్పోవడం వంటి పరిణామాల మధ్య క్యూబా ప్రభుత్వం మనుగడ కోసం ఒక కొత్త మార్గం వెతుక్కుంటోంది. ఇది నిజంగా ద్వైపాక్షిక చర్చలా, లేక ఒక వైపు నుండి మాత్రమే షరతులు విధించే ప్రక్రియా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. క్యూబా ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, వారి సార్వభౌమత్వాన్ని గౌరవించే పరిష్కారం మాత్రమే నిలకడగా ఉంటుంది. కేవలం ఒత్తిడి ద్వారా తీసుకువచ్చే మార్పులు, ఆ దేశంలో అస్థిరతను మరింత పెంచి, ప్రాంతీయ భద్రతకే సవాల్ విసిరే ప్రమాదం ఉంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# వినియోగదారుడా మేలుకో..
# నీ హక్కుల కోటను కాపాడుకో..

'వికసిత భారత్'గా అవతరించాలనే మన జాతీయ లక్ష్యాన్ని నెరవేరాలంటే దేశం ఆర్థిక పథంలో వేగంగా దూసుకు పోవాలి. దీనికి ప్రధానంగా ప్రజల అవసరాలకు తగినట్లుగా వస్తూత్పత్తి జోరుగా సాగాలి, అదే వేగంతో అవి మార్కెట్‌లో అమ్ముడుపోవాలి. అయితే, వస్తువుల నాణ్యత సేవల విషయంలో వినియోగదారుడు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందినప్పుడే ఈ ఆర్థిక చక్రం సజావుగా సాగుతుంది. వినియోగదారుడు సంతృప్తిచెందకపోతే ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. ఇక్కడ ఉత్పత్తి అంటే కేవలం వస్తువులే కాదు, సేవలు అని కూడా అర్థం చేసుకోవాలి. దురదృష్టవశాత్తూ, నేటి మార్కెట్‌లో కొందరు విక్రేతలు వస్తువులను అమ్మగానే తమ బాధ్యత తీరిపోయిందని భావిస్తున్నారు. కానీ, ఉత్పత్తిదారులు వినియోగదారులకు గ్యారంటీ లేదా వారంటీ రూపంలో కచ్చితమైన హామీలు ఇవ్వాల్సి ఉంటుంది. దురదృష్టవశాత్తూ చైతన్యం లేకపోవడం వల్ల మన దేశంలో వినియోగదారులు అనేకసార్లు నష్టపోతున్నారు.

**వినియోగదారుడి పాత్ర కీలకం:** ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుడి పాత్ర అత్యంత కీలకం. సూక్ష్మంగా చెప్పాలంటే, మార్కెట్‌లోని ఆర్థిక, వ్యాపార, ప్రచార రంగాలలో సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువులను లేదా వారి సేవలను పొందే ప్రతి వ్యక్తి వినియోగదారుడే అవుతాడు. ఉత్పత్తిదారులకు కొత్త వస్తువులను తయారు చేయడానికి అసలైన ప్రేరణ వినియోగదారుల నుండే లభిస్తుంది. ఒకవేళ వినియోగదారులు వస్తువులను లేదా సేవలను వాడటం మానేస్తే, ఉత్పత్తి ప్రక్రియే నిలిచిపోతుంది. అందుకే, వినియోగదారుల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఏటా మార్చి 15వ తేదీన 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం' జరుపుకుంటారు. ఇది అంతర్జాతీయ వినియోగదారుల ఉద్యమంలో ఒక గొప్ప వేడుక, సంఘీభావం తెలిపే వార్షిక కార్యక్రమం.

**వినియోగదారుల హక్కులు:** ప్రస్తుత కాలంలో వినియోగదారుల హక్కులు కేవలం కొనుగోళ్లకు మాత్రమే పరిమితం కాలేదు. పర్యావరణ పరిరక్షణ కూడా ఇందులో భాగమైంది. గత దశాబ్దం చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైంది, దీనివల్ల అనేక దేశాల్లో తీవ్రమైన వాతావరణ మార్పులు నిత్యకృత్యమై ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. కాలుష్యం, జీవవైవిధ్య నష్టం భూమితో పాటు మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారాయి. ఈ పర్యావరణ సంక్షోభాలు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. కాబట్టి మనం తినే ఆహారం, ప్రయాణించే విధానం, విద్యుత్ వినియోగం, మనం కొనే ఉత్పత్తులలో ప్రాథమిక మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా, వారికి స్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించే ఉత్పత్తులు సరసమైన ధరకే అందుబాటులోకి రావాలి. చట్టం కల్పించిన వినియోగదారుల హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. మొదటిది 'భద్రత హక్కు'. ప్రాణానికి, ఆస్తికి ప్రమాదకరమైన వస్తువులు సేవల నుండి రక్షణ పొందే హక్కు ఇది. మనం కొనే వస్తువు తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా దీర్ఘకాలికంగా సురక్షితంగా ఉండాలి. రెండవది 'ఎంచుకునే హక్కు'. పోటీ ధరలకు రకరకాల వస్తువులను పొందే అవకాశం ఉండాలి. గుత్తాధిపత్యం ఉన్న చోట కూడా నాణ్యమైన సేవను పొందే హక్కు వినియోగదారుడికి ఉంటుంది. మూడవది 'సమాచారం పొందే హక్కు'. వస్తువు నాణ్యత, పరిమాణం, స్వచ్ఛత, ధర వంటి పూర్తి వివరాలను తెలుసుకునే హక్కు ఇది. దీనివల్ల వినియోగదారుడు వ్యాపారుల మాయమాటలకు బలైపోకుండా తెలివిగా నిర్ణయం తీసుకోగలడు. నాలుగవది 'విద్య హక్కు'. అజ్ఞానం వల్లే గ్రామీణ వినియోగదారులు ఎక్కువగా దోపిడీకి గురవుతున్నారు. కాబట్టి వినియోగదారులకు తమ హక్కుల పట్ల పూర్తి జ్ఞానం, నైపుణ్యం ఉండాలి. అప్పుడే వినియోగదారుల రక్షణ సాధ్యమవుతుంది. వీటితో పాటు 'వినిపించే హక్కు', 'పరిష్కారాన్ని కోరే హక్కు' కూడా చాలా ముఖ్యమైనవి. వినియోగదారుల ప్రయోజనాలను వివిధ వేదికలపై ప్రతిబింబించేలా సంఘాలను ఏర్పాటు చేసుకోవచ్చు. అన్యాయమైన వాణిజ్య పద్ధతులపై లేదా దోపిడీపై ఫిర్యాదు చేసి న్యాయమైన పరిష్కారం పొందవచ్చు.

**బాధ్యతలూ ప్రధానమే.. :** హక్కులతో పాటు వినియోగదారులకు కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి. వస్తువులను కొనేటప్పుడు నాణ్యతను తనిఖీ చేయడం, తమకు ఏం కావాలో వ్యాపారులకు స్పష్టంగా చెప్పడం, అన్యాయం జరిగినప్పుడు నిజాయితీగా ఫిర్యాదు చేయడం వినియోగదారుడి బాధ్యత. నేటి డిజిటల్ యుగంలో ఇ-కామర్స్ లావాదేవీల కోసం ప్రభుత్వం 'వినియోగదారుల రక్షణ చట్టం 2019' ని తీసుకువచ్చింది. ఇది 1986 చట్టం స్థానంలో వచ్చి నిబంధనలను మరింత బలోపేతం చేసింది. తప్పుడు ప్రకటనల నుండి ప్రజలను రక్షించడానికి 'సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ' స్థాపించబడింది. ప్రకటనల్లో ఇచ్చే హామీలు నిజమైనవో కాదో తనిఖీ చేసే అధికారం దీనికి ఉంది. అంతేకాకుండా, ఈ చట్టం నేటి కాలంలో పెరిగిపోతున్న ఆర్థిక మోసాలు, ఉద్యోగ మోసాలు వైవాహిక మోసాల నుండి కూడా వినియోగదారులకు రక్షణ కల్పిస్తుంది.



**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# విశ్వశాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలి

- **తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుంది**
- **జూనియర్ మోడీ, యోగిగా సీఎం రేవంత్ రెడ్డి**
- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**ముషీరాబాద్, మార్చ్ 15 (జనం సాక్షి) :** ఖురాన్ ఆవిర్భవించిన పవిత్ర రంజాన్ మాసంలో విశ్వశాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని, అదేవిధంగా శాంతి స్థాపన కోసం కృషి చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని భోలక్ పూర్ డివిజన్ అంజుమాన్ స్కూల్ లో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ సలీం ఆధ్వర్యంలో భారీగా రేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి హరీష్ రావు, ముషీరాబాద్ నియోజక వర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నేత ముఠా జై సింహా పాల్గొని ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం హయంలో పేదల అభివృద్ధి కోరుకొని షాది ముబారక్, కెసిఆర్ కిట్టు,లాంటి ఎన్నో పథకాలు తీసుకొచ్చి పేద ప్రజల అభివృద్ధికి తోడ్పడింది అని అన్నారు. అదే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి తో పాటుగా తులం బంగారం లాంటి ఎన్నో వాగ్దానాలు ఇచ్చి ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాలలో కనీసం హైదరాబాద్ లో ఒక ఇల్లు కూడా నిర్మించలేక పోగా,ఒక లక్ష ఇల్లుకూల్చివేశారన్నారు. ఉత్తరప్రదేశ్ యోగి తరహా, హైదరాబాద్ లో కూడా బుల్డోజర్లతో పేదల ఇల్లు కూల్చుతున్నారన్నారు, అందులో మూసి, హైడ్రా పేరున మూసి, చాదర్ ఘాట్ ప్రాంతంలో ఎక్కువగా ముస్లింల ఇల్లులు కూల్చి, జూనియర్ మోదీ ,యోగి గా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని,తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడిపిస్తున్నారని విమర్శించారు. బస్తీ దేవకన్లు కూడా డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రంజాన్ పర్వదినాల సందర్భంగా ప్రపంచంలోని ముస్లింలు శాంతి సౌహార్దం నెలకొనాలని ప్రార్థన చేయాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాల వలనే మైనార్టీలు లబ్ధి పొందారని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరి, సోదరులందరికీ రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాసరావు, మీడియా ఇంచార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు చాంద్ పాషా, మోసిన్, షార్ఫుదిన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన



**నారాయణఖేడ్, మార్చి 15 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని మయికోడ్, రాణాపూర్ గ్రామలలో తెలంగాణ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గ్రామాలలో మహిళా సమైక్య భవనాలకు 10 లక్షల రూపాయలతో మంజూరు చేయడం జరిగింది. మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ స్వయం ఉపాధి సంక్షేమ కార్యక్రమాలకు ఈ భవనం సహకరిస్తుందని స్థానిక మహిళా సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు ఈ అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు ప్రభుత్వ అధికారులు, మరియు మయికోడ్ మరియు రాణాపూర్ గ్రామ ప్రజలు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మానూర్ మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- **కార్మికులకు సబ్బులు, నూనెలు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్**



**పెబ్బేరు, మార్చి 15 (జనం సాక్షి) :** పెబ్బేరు పట్టణాన్ని స్వచ్ఛ భారత్ ఉంచేందుకు కార్మికులు శ్రమ వెలకట్టలేనిదని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం తరపున కేటాయించిన సబ్బులు, నూనెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. ఎండనక, వాననక ప్రాణాలకు తెగించి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా ఉండాలన్నారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా ఈ నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కేవలం వస్తువుల పంపిణీ మాత్రమే కాకుండా, కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు (గ్లౌజులు, మాస్కులు, బూట్లు) కూడా క్రమం తప్పకుండా అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి కౌన్సిలర్లు జమ్ములమ్మ, భాగ్యలక్ష్మి శివ, పర్వీన్ షకీల్, హరి శంకర్ నాయుడు, మన్యం శానిటరీ ఇన్స్పెక్టర్లు, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**తెలకపల్లి, మార్చి 15 (జనం సాక్షి) :** నిరుపేదల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తుందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లక్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలో పేదలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని అన్నారు. ఇచ్చిన హామీల లో భాగంగా ఈరోజు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ప్రజలు, నిరుపేదలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహప్రవేశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ,లబ్ధిదారులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు , మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో, మార్చి 15 (జనం సాక్షి) :** దేశంలో దాదాపు 15 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న జనగణన--2027 అత్యంత ముఖ్యమైనదని, దీని ఆధారంగానే దేశ అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని, అందువల్ల ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.జనగణన--2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశగా హౌస్ లిస్టింగ్ మరియు హౌస్ సెన్సస్ నిర్వహణకు సంబంధించి జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు మార్చి 15 నుండి 17 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది.ఆదివారం వనపర్తి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మొదలైన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరై జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో



దాదాపు 15 ఏళ్ళ తర్వాత నిర్వహించ తలపెట్టిన జనగణన-2027 ప్రక్రియ అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. ఈ ప్రక్రియ ఆధారంగా దేశంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించబడతాయని, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని ఖచ్చితంగా గుర్తించి గృహాల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని చెప్పారు. జన గణన కోసం బ్లాక్ లను గుర్తించడం, ఎన్యూమరేటర్ లను అపాయింట్ చేయడం జిల్లా చార్జ్ అధికారుల బాధ్యత అన్నారు. శిక్షణ మాన్యువల్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వడానికి ముందు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయడం ద్వారా దేశ అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసిన తర్వాతే బ్లాక్ లిస్టింగ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయడానికి వీలు లేదని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సిపిఓ హరికృష్ణ, డీఈవో అబ్దుల్ ఘని, డిఐఈఓ అంజయ్య, డి ఎఫ్ ఓ లక్ష్మప్ప, డీఎస్ఓ శ్రీనివాసులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యత

- **వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి**



వనపర్తి బ్యూరో, మార్చి 15 (జనం సాక్షి) : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని అని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు.ఆదివారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) ఆధ్వర్యంలో చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని రోడ్లు శుభ్రం చేశారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ పల్లెలు ప్రగతి బాటలో నడిచినప్పుడే రాష్ట్ర ప్రగతి పథంలో ముందుంటుంది అన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వేసవికాలంలో ప్రతి నీటి చుక్కను సక్రమంగా వినియోగించుకోవాలని, నీటిని వృధా చేయొద్దని సూచించారు. రోడ్లు, పాఠశాలల్లో, దేవాలయాల్లో, వార్డులలో ఉన్న కాలనీలను పరిశుభ్రత చేసిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను, బృందాన్ని అభినందించారు.నేషనల్ సర్వీస్ స్కీమ్ బృందం వారు లోగో తో కూడిన టీ షర్ట్స్ కావాలని ప్రతిపాదించగా వెంటనే స్పందించి 70 టీషర్ట్స్ ఇప్పిస్తారని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి, లబ్ధిదారులైన ఎద్దుల బాలకృష్ణ శిరీషలకు పట్టు వస్త్రాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం వాళ్ల కలను నెరవేరుస్తుందని , రాష్ట్రంలో ఏ ఒక్కరికి ఇల్లు లేని నిరుపేదగా ఉండొద్దన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజాపాలన ప్రభుత్వం నిరుపేదల కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోల్లికమ్మ, మాజీ సర్పంచ్ కొండన్న, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉండాల రాములు, రొయ్యల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సఫాయి కార్మికుల సేవలు మరువలేనివి



**ధారూర్, మార్చి 15 (జనం సాక్షి) :** సఫాయి కార్మికుల సేవలు మరువలేనివని గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో సఫాయి కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని గడ్డమీదిగంగారం గ్రామ సర్పంచ్ బంటు లక్ష్మి అంజయ్య అన్నారు.మండల పరిధిలోని గడ్డమీది గంగారం గ్రామంలో ఆదివారం నాడు గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బంటు లక్ష్మి అంజయ్య మాట్లాడుతూ...ప్రతి రోజు తెల్ల వారుజామున గ్రామంలోని ప్రధాన రహదారులన్నీ ఊడ్చి చెత్త చెదారాన్ని తొలగించడం వలన గ్రామం శుభ్రంగా కనిపిస్తుందని సఫాయి కార్మికుల కృషి వలన ప్రధాన విధులు అన్ని పరిశుభ్రంగా ఉంటున్నాయని అన్నారు.ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం పారేసిన తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించడంతో గ్రామం శుభ్రంగా ఉంటుందని మురుగు కాలువలు శుభ్రం చేయడం వల్ల నీరు సాపిగా వెళ్లేలా చూస్తారని దీనివల్ల దోమలు పెరగకుండా ప్రజలు రోగాలు బారిన పడకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి అనేక పనులు చేస్తున్నారని సఫాయి కార్మికులు ఎంతో కష్టపడి పని చేయడం వల్లనే గ్రామం పరిశుభ్రంగా పచ్చదనంగా ఉందని సఫాయి కార్మికులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్ల మల్లేశం.వార్డు సభ్యులు.మాజీ సర్పంచ్ పట్నం అమర్నాథ్.కుర్వ చంద్రయ్య.గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ అభివృద్ధికి మరో ముందడుగు

- **మూసీ తీరంలో రూ.98 కోట్లతో ఎంఎంసీ కార్యాలయ భవనం**
- **మూసీ ఒడ్డున రూ.98 కోట్లతో ఎంఎంసీ కార్యాలయం నిర్మాణం**
- **ఉప్పల్ భగాయత్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి, రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, మార్చి 15 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సేవా కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మూసీ నది ఒడ్డున ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కార్యాలయ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించబోయే ఈ కార్యాలయం ద్వారా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు పరిపాలన సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు



తెలిపారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, ప్రాంతీయ పరిపాలనకు ఇది ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్ లో యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని, ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపరీక్షలు, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు, కీళ్ల నొప్పులు, కంటి, చెవి, చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత వైద్య సలహాలు, మందులు అందించారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన విప్లవ్ రెడ్డితో పాటు వేవ్ సెలూన్, టర్బో ఫిట్ జిమ్ యాజమాన్యాన్ని పరమేశ్వర్ రెడ్డి, రజిత పరమేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రావు, ఈగ సంతోష్ ముదిరాజ్, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, చర్ల సుధాకర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, పూజారి హనుమంతు, శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ప్రభాకర్, నరసింహారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ప్రశాంత్ కుమార్, భాస్కర్ రెడ్డి, హరీష్, సురేష్, పవన్, శ్యామ్, పి.సి.రావు తదితరులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓయూలో మాలల ఆత్మీయ సమ్మేళనం



**సికింద్రాబాద్, మార్చి 15 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్ వేదికగా ఆదివారం మాలల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ మాల స్టూడెంట్ జేఏసీ, ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు,అధ్యాపకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వల్ల మాల జాతికి రిజర్వేషన్లు , రోస్టర్ పాయింట్లలో జరుగుతున్న అన్యాయంపై పలువురు వక్తలు లోతైన విశ్లేషణ చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మాలలు సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకుంటూ,రాబోయే రోజుల్లో చేపట్టబోయే పోరాట కార్యాచరణను ఈ సందర్భంగా ప్రకటించారు .ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ పి.వి. సునీల్ కుమార్, డాక్టర్ ఎం.ఎఫ్. గోపినాథ్, మాల జేఏసీ ప్రెసిడెంట్ మందాల భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరై దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రొఫెసర్లు ఆర్. లింబాద్రి, కర్రెసదాశివ, మాయాదేవి, వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మాదాసు రాహుల్ రావు, నామా సైదులు, బత్తుల రమేష్, లావణ్య, భాను తేజ, బట్టపోతుల మోహన్, అరుణ్ మాల సంఘాల నేతలు మంధాల భాస్కర్, చెరుకు రామచంద్రం తదితరులు పాల్గొని మాలల ఐక్యత కోసం పిలుపునిచ్చారు.

# ప్రశ్నించే ప్రజలను అధికారులు అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

- మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, మార్చి 15 (జనం సాక్షి) :** ప్రశ్నించే ప్రజలను, అధికారులు అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని,మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం, వనపర్తి పట్టణంలోని స్వగృహంలోవనపర్తి నియోజకవర్గంలోని పలు సమస్యలపై పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు సమస్యలను, ముఖ్యమంత్రికి లేఖ ద్వారా వివరించారు.అధికారులు ప్రశ్నించే ప్రజల పక్షాన నిలబడాలికానీ, రాజకీయ నాయకుల కొమ్ముకాయకూడదన్నారు. 9వేల కోట్ల రూపాయలు సిద్ధంగా ఉన్నాయని, మూడు సీజన్లు రైతు భరోసా రేవంత్ ఎగ్గొట్టారని,ప్రశ్నించారు.మోసం చేయడానికి ప్రమాణాలు చేసిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని,సి.ఎం.ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని దుయ్యబట్టారు. రైతులు రైతు భరోసాపై ఆశలు వదులుకున్నారన్నారు.ప్రశ్నించే ప్రజలను అధికారులు అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని,సంక్షేమ పథకాలు అమలు కానప్పుడు ప్రజలు తిరగబడుతారు ఆది వారి హక్కు.,ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు.సకాలములో కరెంట్,యూరియా సరఫరా చేయలేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, ఇది ప్రభుత్వ అసమర్థత అని విమర్శించారు.

సోషల్ మీడియాలో ప్రభుత్వ అసమర్థతను పెడితే, వాళ్లపై కేసులు పెట్టడం ఖండిస్తున్నామన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యకేసు తేల్చకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం, రెండున్నర ఏండ్లు గడిచిన ఇప్పటికీ శ్రీధర్ రెడ్డి హత్య కేసు తేల్చకుండా,అధికార పార్టీకి తొత్తులుగా మారడం సహించరానిదన్నారు.వారం రోజుల్లో శ్రీధర్ రెడ్డి హత్యకేసు తెలచకపోతే,రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంచేపడతామని, పోలీస్ అధికారులను హెచ్చరించారు.

### మున్సిపల్ పాలనలో విఫలం

పట్టణ చుట్టుపక్కల చెత్తతో నిండిపోయి, దుర్గంధం వెదజల్లుతుందని, రోడ్ల విస్తరణ పూర్తి చేయలేకపోవడం,అన్ని వసతులతో ఏర్పాటు చేసిన, టౌన్ హాల్ ను ప్రారంభించకపోవడం,అధికారుల ,పాలకుల అసమర్థతకు నిదర్శనమని,రోడ్ల విస్తరణ చేపట్టిన కొన్ని చోట్ల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు.

### సాగునీటి ప్రాజెక్టుల సాధనలో ప్రభుత్వం విఫలం

రామన్న గట్టు రిజర్వాయర్ శంకుస్థాపన చేసి,మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని, డి5, డి8 కాలువలు ఆధునీకరించడం ద్వారా సాగు నీళ్లు పెంచే అవకాశం ఉన్న సాగునీటి మీద ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.ఇరిగేషన్ చీఫ్ అందుబాటులో లేకపోవడం ద్వారా సాగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు.

### మెడికల్ కాలేజ్ ప్రాంగణములో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం ఆపాలి

యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదని, కానీ మెడికల్ కళాశాల ఆవరణలో కాకుండా వేరే చోట స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.100ఏండ్ల విద్యార్థుల భవిష్యత్తు కోసం సువిశాలమైన స్థలం ను, మెడికల్ కళాశాల కు కేటాయించడం జరిగిందని అన్నారు.

### అర్ధ చంద్రాకారం బైపాసు రోడ్డు వెంటనే చేపట్టాలి

కె.సి.ఆర్ స్వయంగా 9కిలో మీటర్లు రాజపేట నుండి పానగల్ రోడ్డును కలుపుతూ బైపాసు రోడ్డుకు టెండర్ అయి పనులు ప్రారంభించారని,కానీ నేటి పాలకులు ఈ రోడ్డును పునరుద్ధరించకపోవడం దురదృష్టకరమన్నారు.ఈ విషయములో ముఖ్యమంత్రికి లేఖ వ్రాయడం జరుగుతుందన్నారు.ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ ,వివిధ డిపార్టుమెంటు చెందిన అధికారులను సమన్వయం చేసి, పరిష్కరించాలని నిరంజన్ రెడ్డి సూచించారు. ఈ సమావేశములో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, లక్ష్మా రెడ్డి,ఎద్దుల కరుణశ్రీ, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి,భీమన్న,కర్రెస్వామి, తిరుపతయ్య, మాణిక్యం, పెద్దింటి వెంకటేష్, దిలీప్ రెడ్డి,శివ రామ్ రెడ్డి,గౌడ్ నా యక్, రాజశేఖర్, సూర్యవంశం గిరి, చంద్రశేఖర్, చిట్యాల రాము,తోట.శ్రీను ఉన్నారు.

## మహిళా సమైక్య భవనం, స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**నాగలిగిద్ద, మార్చి 15 (జనం సాక్షి) :** నాగల్ గిద్ద మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనం మరియు స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రధాన అతిథిగా పాల్గొని, అభివృద్ధి కార్యక్రమాలకు ఆదర్శంగా నిలిచారు.స్థానిక మహిళలు, గ్రామసభ సభ్యులు, అధికారులు, విద్యార్థులు మొదలైనవారు ఘనంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ,మన నారాయణఖేడ్ నియోజకవర్గంలో మహిళా సాధికారతకు మహిళా సమైక్య భవనాలు కీలకం. ఈ భవనం ద్వారా మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయి. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మహిళలకు, పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ఈ రకమైన పనులు మండల అభివృద్ధికి మొదటి దశ. మీ అందరి సహకారంతో మన నియోజకవర్గం అభివృద్ధిగా జరుగుతుందని అని పేర్కొన్నారు. నాగల్ గిద్ద మండలానికి ఎస్సీ హాస్టల్ మరియు గురుకుల పాఠశాల మంజూరైనవని వాటిని కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామని గ్రామాలలో ఎక్కడైనా నీటి సమస్యలు ఉండకూడదని ఉద్దేశంతో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి గ్రామలలో మరియు తాండలలో నీటి సమస్య ఉండకూడదని ఎమ్మెల్యే అధికారులకు సుచించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు గ్రామ సర్పంచ్ లక్ష్మీ లక్ష్మణ్, శ్రీకాంత్ పిఎసిఎస్ మాజీ చైర్మన్, సంజు పాటిల్, గుండేరావు పాటిల్, మండలాధికారులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు మహిళా సంఘాల నేతలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- కార్మికుల కాళ్లు కడిగిన సర్పంచ్



**నారాయణపేట, మార్చి 15 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని వారి సేవలు వెల కట్టలే నివని ఊట్కూర్ సర్పంచ్ ఎం. రేణుక భరత్ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ గ్రామ పంచా యతీ కార్యాలయం వద్ద ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికుల కాళ్లు కడిగి ఘనం గా సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం గ్రామ పంచాయ తీ సిబ్బంది ఏదో ఒక కాలనీ లో తమ సేవలు చేస్తూ నిరం తరం ప్రజల మధ్య ఉంటూ చేస్తున్న సేవలు ఆదర్శనీ యమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించా లని అన్నారు. ఊట్కూర్ పట్టణంలో 16 వార్డులు ఉన్నాయని సిబ్బంది కొరత ఉన్న ఏ వార్డులో సమస్య ఉన్న తక్షణమే స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసు కుంటున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పారిశుధ్య కార్మి కులకు వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, పంచా యతీ కార్యదర్శి శ్రీనివాసరా వు, వార్డు సభ్యులు గోవింద మ్మ, సువర్ణ, భరత్, నరేష్, అక్షయ్, మౌనిక, నరేష్, రూప తదితరులు పాల్గొన్నారు.


## సంగారెడ్డికి బడ్జెట్‌లో 10వేల కోట్లు నిధులు కేటాయించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజు



**సంగారెడ్డి టౌన్, మార్చి 15 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో 10వేల కోట్లు నిధులు కేటాయించాలని మంజీర జలాలు సంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగుకు తాగుకు ఇవ్వాలని మెట్రో రైల్ మియాపూర్ నుండి సంగారెడ్డి వరకు పొడిగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కేవల్ కిషన్ భవన్లో సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కూతవేటు దూరంలో జిల్లా ఉన్న అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. నేటికీ నారాయణఖేడ్ అందోల్ జహీరాబాద్ ప్రాంతాల నుండి వలసలు పోతున్నారని అన్నారు. జిల్లాకు గుండెకాయ లాంటి మంజీరా నది పైన సింగూర్ ప్రాజెక్టు ఉన్నది సారవంతమైన భూములు అనేక ఇతర వనరులు ఉన్న అభివృద్ధి జరగ లేదని అన్నారు. ఇందులో పాలకుల యొక్క నిర్లక్ష్యం ఉందని అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వేసి రాష్ట్ర బడ్జెట్లో 10 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశార. బసవేశ్వర సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి సాంస్కృతిక కార్యక్రమా నల్లవాగు నారింజ ప్రాజెక్ట్ గంగకత్వ బొగులంపల్లి మల్కాపూర్ చెరువులకు నిధులు కేటాయించాలన్నారు. రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సామాజిక ఉద్యమకారులు ఎం.అనంతయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నర్సింలు, తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిటిఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు రాములు, మహిళా సంఘం నాయకురాలు న్యాయవాది లక్ష్మి మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కృష్ణ, రైతు సంఘం నేతలు రమేష్ గౌడ్, రాజయ్య, యాదవరెడ్డి, కేవీపీఎస్ నాయకులు అశోక్ తది తరులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



**రామచంద్రాపురం, మార్చి 15 (జనం సాక్షి) :** తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో ఉన్న శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన జాతర మహోత్సవంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాన్సిరాం చూపించిన బాటలో నడవాలి



**గద్వాల నడిగడ్డ, మార్చి 15 (జనం సాక్షి) :** కాన్సిరాం చూపించిన బాటలోనే మనం నడవాలని గద్వాల బీఎస్పీ నాయకులు గంజిపేట కోళ్ళ హుస్సేన్, బహుజన రాజ్యసమితి నాయకులు వాల్మీకి అన్నారు. జోగులమ్మ గద్వాల జిల్లా కేంద్రంలో గంజిపేట అంబేద్కర్ చౌరస్తాలో మాన్యవర్ కాన్సీరాం 92వ జయంతి సందర్భంగా గద్వాల బిఎస్పీ నాయకులు గంజిపేట కోళ్ల హుసేన్, బహు జన రాజ్యసమితి నాయకులు వాల్మీకి మాట్లాడుతూ మాన్యవర్ కాన్సీరాం చూపించిన మార్గంలో మనం నడవాలని అని, భారతదేశానికి గుండెకాయ అయినటువంటి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రములో బాబాసాహెబ్ డా. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలేల మార్గంలో బిఎస్పీ పార్టీని స్థాపించి, 4 సార్లు బిఎస్పీ పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చిన ఘనత మాన్యవర్ కాన్సీరాం దని కొనియాడారు. భారతదేశ బహుజనుల రాజకీయాల దశ, దిశ మార్చిన గొప్ప నాయకుడు మాన్యవర్ కాన్సీరాం అని పేర్కొన్నారు. దేశంలోని ఆధిపత్య పార్టీలు డబ్బునోళ్ళను, కులం ఉనోళ్ళను పార్లమెంట్, అసెంబ్లీలకు పంపితే – సమాజంలో మెజారిటీ ఓట్లు ఉన్న బహుజనులను పార్లమెంట్, అసెంబ్లీలకు పంపిన ఘనత మాన్యవర్ కాన్సీరాం దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్యసమితి నాయకులు వాల్మీకి, కురుమన్న, బీఎస్పీ టౌన్ అధ్యక్షులు దేవేంద్ర,తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర నాయకులు గోపాల్ యాదవ్, సత్యం, సుభాను, వెంకట్రాములు, కే తిమ్మప్ప,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**సదాశివపేట, మార్చి 15 (జనం సాక్షి) :** సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి నియోజకవర్గ సదాశివపేట మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ 70 లక్షల వ్యాయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముబారక్పూర్ ఏ గ్రామానికి రూ .7 లక్షలు, వెల్టూరు గ్రామానికి రూ. 8 లక్షలు, కోనాపూర్ గ్రామానికి రూ. 8 లక్షలు, నాగ్సన్ పల్లి గ్రామానికి రూ. 6.50 లక్షల చొప్పున నిధులు కేటాయించి సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సిసి రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని, ఈనెల చివరిలోపు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, ఎన్నికల తర్వాత రాజకీయ కక్ష సాధింపులు సరికావని అన్నారు. రెండు సంవత్సరాలుగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు రైతుబంధు ఇస్తామని ఇవ్వలేదని, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని అనేక సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు,సర్పంచులు తొంట కృష్ణ, అనిల్ రెడ్డి,కాశీపురం రవి,నవీన్ యాదవ్, కిష్టారెడ్డి,మండల అధికారులు ఏఈ కోటేశ్వర్ రావు ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడిల సుమిత్ర సుధీర్ రెడ్డి, సిడిసి మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి,మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, బోయిని శ్రీనివాస్, సత్యం,దాసు,లక్ష్మీ చంద్రశేఖర్,మాజీ ఎంపీటీసీలు సత్యనారాయణ,శివ కుమార్,నల్లోల కుమార్,ఉప సర్పంచ్ లు,వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జూపల్లి



**వనపర్తి బ్యూరో, మార్చి 15 (జనంసాక్షి) :** గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దమదూరు గ్రామంలో ఆదివారం ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న రూ.21 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని చెప్పారు.పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### కొప్పునూరులో శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి జూపల్లి

రైతులకు న్యాయమైన ధర కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ మండలం కొప్పునూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన శనగ పంటను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,875కు కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ముఖ్యమని, శనగలో తేమ శాతం 14 శాతం లోపే ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. రైతులకు మద్దతుగా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, మార్క్‌ఫెడ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- అధికారులకు శివారెడ్డి ఆదేశం



**నారాయణపేట, మార్చి 15 (జనం సాక్షి) :** నారాయణపేట మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను వెంటనే. పరిష్కరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా నారాయణపేట పట్టణంలో 23, 24 వ వార్డు ల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నీటి సమస్యలు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం,విద్యుత్ స్తంభాలు వంటి పలు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్ప టికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయ కుడు చిట్టెం మాధవ రెడ్డి, పుర కమీషనర్ నర్సయ్య, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ముగ్గురు చిన్నారులతో మొక్కలు నాటించిన వన ప్రేమికుడు సమ్మయ్య



**చెన్నారావుపేట, మార్చి 15 (జనంసాక్షి) :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ- మౌనిక దంపతులకు ఒకే రోజు, ఒకే నెల రెండు సంవత్సరాల వ్యవధిలో జూన్ 3న జన్మించిన కూతురు అక్షర, కుమారులు అర్జున్, ఆదిత్యలతో నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ వాస్తవ్యులు వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య మొక్కలను నాటించారు. పర్యావరణం పరిరక్షణ కొరకు పచ్చని చెట్లు పెరిగి మంచి వాతావరణం అందించాలన్న ఉద్దేశంతో మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ- మౌనిక దంపతుల ఇంటి ఆవరణంలో మారేడు, నేరేడు, ఉసిరి, గణపాల మొక్కలను నాటించి పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు శివకృష్ణ మాట్లాడుతూ నల్లగొండ సమ్మయ్య మా ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మా ముగ్గురు పిల్లలు జూన్ 3వ తేదీన జన్మించడం ఎంత సంతోషంగా ఉందో మా పిల్లలతో కలిసి తమ గుర్తింపుగా మొక్కలను నాటించడం అంతే సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం యువతకు ఆదర్శంగా ఉంటుందని కొనియాడారు.

# పేదల సొంత ఇంటి కల నెరవేర్చడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- **ఇందిరమ్మ ఇళ్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకలు**
- **నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**ఆత్మకూరు, మార్చి 15 (జనం సాక్షి):** పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్,హౌస్ బూజూర్గు గ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని,రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి,కుటుంబ సభ్యులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, జిల్లా నాయకులు మార్కా రజినీకర్ గౌడ్, కక్కెర్ల రాజు, తదితరులు ఉన్నారు.

# జనగణన మూడు రోజుల శిక్షణ ముగింపు

- **డిజిటల్ ప్రక్రియలో వివరాలు సేకరణ**



**వరంగల్ ప్రతినిధి, మార్చి 15(జనంసాక్షి):** జనగణన--2027 నిర్వహణలో భాగంగా జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముగిసింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయానికి చెందిన జాయింట్ డైరెక్టర్ డి. సుబ్బరాజు, స్టాటిస్టికల్ ఆఫీసర్ సీహెచ్ సతీష్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జనగణన-2027 నిర్వహణ విధానం, గణన బ్లాకుల విభజన, ఇండ్ల జాబితా, గణన ప్రక్రియపై అధికారులకు వివరించారు. ఈసారి జనగణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అలాగే విధానం ద్వారా కుటుంబ వివరాల నమోదు ప్రక్రియను ప్రాక్టికల్‌గా చూపించారు. అందరూ సెన్సస్ చార్జ్ అధికారులు సిఎంఎంఎస్ పోర్టల్ లో శిక్షణ పొందారు. శిక్షణ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, సెన్సస్-2027 సర్క్యులర్ మార్గదర్శకాల ప్రకారం ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన ప్రక్రియను జిల్లాలో సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, సీపీఓ చంద్రకళ, ఆర్డీఓలు సుమా, ఉమారాణి, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారానికి వినియోగిస్తే కఠిన చర్యలు


- **కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 15(జనంసాక్షి):** గృహ అవసరాలకు కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, కాగజ్ నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ, పౌరసరఫరాలు, మున్సిపల్ శాఖల అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని, ప్రస్తుతం జిల్లాలో ఎల్ పి జి, పెట్రోల్ కొరత లేదని తెలిపారు. ఎల్పీజీ గోదాముల, పెట్రోలు బక్కుల వద్ద స్టాకు వివరాలను పట్టికలో ప్రదర్శించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోజుకు 2 వేల చొప్పున బుకింగ్ చేసుకున్న వారికి సిలిండర్లు అందించడం జరుగుతుందని, ప్రతిరోజు ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, పంపిణీ వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, గురుకులాల అవసరాలకు సరిపడా సిలిండర్లు అందించాలని, హోటల్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులు ఎట్టి పరిస్థితులలో డొమెస్టిక్ సిలిండర్ లను వ్యాపారానికి వినియోగించరాదని తెలిపారు. పెట్రోల్ బంకులలో పెట్రోల్ ను ప్లాస్టిక్ క్యానులలో పోయరాదని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో 45 రోజులు, పట్టణ ప్రాంతాలలో 25 రోజుల సిలిండర్ల బుకింగ్ గడువు ఉందని, పత్రికలు, మీడియా,సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల కథనాలపై వెంటనే స్పందించి అదే రోజు జిల్లా పౌర సంబంధాల అధికారికి రిజాయిండర్లను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా, అగ్నిమాపక, సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్ పి జి డీలర్లు, పెట్రోల్ బంకుల యజమానులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పం

- **లబ్ధిదారులు సకాలంలో ఇల్లు నిర్మించుకోవడం అభినందనీయం**
- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అర్హులైన నిరుపేదలను గుర్తించి, వారికి నివాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య సంకల్పమని, లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లు సకాలంలో నిర్మించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మండలం రాంపూర్ గ్రామంలో సుంకరి సంతోష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై నమోదు చేయడం ద్వారా వారికి ఆస్తి హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగరిక జీవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### భూపాలపల్లిలో రెస్టారెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే..

భూపాలపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తార రెస్టారెంట్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. రెస్టారెంట్ యజమానులు ప్రజలకు రుచికరమైన, శుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మైలారంలో అంగన్‌వాడీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

గణపురం మండలం మైలారం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు, అంగన్‌వాడీ భవనాలను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ భవనం ద్వారా గ్రామంలోని చిన్నారులు, గర్భిణీలకు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ భూక్య సమ్మయ్య, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రాజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకం

- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు,మార్చి15(జనం సాక్షి):** గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో పారిశుద్ధ కార్మికుల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు.ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్లంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారిని శాలువాలతో సత్కరిస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలు మరియు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు.సమాజ ఆరోగ్యాన్ని కాపాడేందుకు కష్టపడుతున్న నిజమైన సేవకులని కొనియాడారు.ప్రజల ఆరోగ్యం,పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో పారిశుధ్య కార్మికుల సేవలు మరింత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజం వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్లను, అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ స్లాబ్ లెవెల్ పూర్తిచేసుకుని చివరి దశ పనులు ప్లాస్టిక్, విద్యుత్ కనెక్షన్,పెయింటింగ్,ఫ్లోరింగ్ , ప్లంబింగ్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బిల్లులు వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని ఉగాది పండుగ వరకు గృహప్రవేశానికి సిద్ధం కావాలని సూచించారు.అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల ఎత్తు బరువు నిరంతరం పర్యవేక్షించాలని,పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అందించే పాల ప్యాకెట్లను దిగుమతి చేసుకునే సమయంలో వాటిపై ఉండే ముద్రణ తేదీలను తప్పనిసరిగా గమనించాలని గడువు దాటిన వస్తువులను ఎట్టి పరిస్థితులలో దిగుమతి చేసుకోకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీవో హన్మంతరావు,సిడిపిఓ శిరీష,గ్రామ సర్పంచ్ శ్యామ్ రావు,కార్యదర్శి పోలురాజు,స్థానిక ప్రజా ప్రతినిధులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘన అవాస్తవం

- **వైస్ చైర్మన్ ఏకు దివ్య**



**పరకాల, మార్చి 15 (జనం సాక్షి):** పరకాల మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినట్లు వస్తున్న వార్తలను ఖండిస్తున్నానని మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక దళిత మహిళగా, ఉన్నత విద్యావంతురాలిగా తనను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, పాలకవర్గ సభ్యులు, ప్రజల ఆశీర్వాదంతో వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. కౌన్సిల్ సమావేశం పూర్తిగా ప్రోటోకాల్ ప్రకారమే జరిగిందని, తనకు ఎలాంటి అవమానం జరగలేదని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయ ప్రవేశం చేశానని తనకు అందరూ సహకారం అందించాలని కోరారు.

# బైక్‌ల దొంగల అరెస్ట్

- **మూడు రోజుల్లోనే కేసును చేదించిన మరిపెడ పోలీసులు**



**మరిపెడ మార్చి 15 (జనంసాక్షి) :** మరిపెడ మండలం పరిధిలోని గాలివారి గుండెం ఏఎన్ఆర్ గార్డెన్ వద్ద 3 రోజుల క్రితం దొంగలించబడిన బైక్ విషయంలో కేసు నమోదు చేసిన మరిపెడ పోలీసులు ఆ కేసులో మూడు రోజులుగా వివిధ ప్రాంతాలలో విచారణ జరిపి మొత్తం ఐదుగురు నిందితులను గుర్తించామని, వారిలో సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం హస్లా తండాకు చెందిన వాంకుడోత్ గోపీచంద్, ఇదే జిల్లా మోతే మండలం గోల్ తండాకు చెందిన గుగులోత్ మనోజ్‌లను ఆదివారం కార్గిల్ సెంటర్ వద్ద పట్టుకుని వారి వద్ద నుండి మూడు బైకులను స్వాధీన పరచుకుని రిమాండ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామని మరిపెడ ఎస్సై వీరభద్రరావు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్ నాయక్, సాయికిరణ్, రమేష్, స్వామి, బలరాం, జహంగీర్ ఉన్నారు

# రబీ సీజన్ ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ ప్రతినిధి, మార్చి 16 (జనంసాక్షి):** రాబోయే రబి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రబి 2025-26 ధాన్యం సేకరణ, 2024--25 సీఎంఆర్ డెలివరీ, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జిల్లాలో 2025-26 రబీ సీజన్ లో సుమారు 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశముందని అంచనా ఉన్న నేపథ్యంలో, రైతులకు ఇబ్బందులు కలగకుండా సుమారు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, అలాగే 2024-25 రబి సీఎంఆర్ ను 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్ 2025-26 సీఎం ఆర్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. గోదాముల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని, రాబోయే ఏప్రిల్ రెండవ వారంలో రబి ధాన్యం కొనుగోలు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నందున మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు తదితర సామగ్రిని ముందుగానే సమకూర్చుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం ఎలాంటి దుర్వినియోగం జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డీఓ రామ్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి నీరజ, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.


# కల్తీ కల్లుపై చర్యలేవీ?



- **140 నుండి 200 లీటర్ల వరకు కల్లు పారబోత**
- **శాంపిల్ టెస్టింగ్‌లో ఎలాంటి కృత్రిమ రసాయనాలు కలపలేదని నిర్ధారణ**
- **శాంపిల్ సేకరించిన బాటిల్ మారుస్తున్నారని అనుమానాలు**
- **జిల్లా కలెక్టర్ ను తప్పుదోవ పట్టిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారులు**
- **ప్రజావాణిలో 17 ఫిర్యాదులు అందిన చర్యలు శూన్యం**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 15 (జనం సాక్షి) :** జిల్లాలో కల్తీ కల్లు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు తూ తూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 140 నుండి 200 లీటర్ల వరకు కల్లు పారబోసినట్లు అధికారులు వెల్లడించినప్పటికీ, శాంపిల్ పరీక్షల్లో ఎలాంటి కృత్రిమ రసాయనాలు కలపలేదని నిర్ధారణ కావడం అనుమానాలకు తావిస్తోంది. చెట్ల నుంచి సాధారణంగా ఒక టి ఎఫ్ టి కి ప్రభుత్వం కేటాయించేది 30 ఈత చెట్లు అయితే అందులో ఒక రోజు తర్వాత ఒకరోజు 15 చెట్లను మాత్రమే వాడుకుంటారు. దీంతో ప్రతిరోజు సుమారు 30 లీటర్ల వరకు మాత్రమే కల్లు సేకరించే అవకాశం ఉండగా, కొన్ని చోట్ల వందల లీటర్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో విక్రయించేది కల్తీ కల్లేనని, కానీ రిపోర్టుల్లో మాత్రం చెట్టు కల్లు అని చూపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి సరియైన కేసులు చేయకపోవడానికి రాజకీయ నాయకుల అండ ఉందని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. దాడి చేసిన సమయంలో వాళ్లు శాంపిల్ల సేకరించిన బాటిల్లు మారుస్తున్నారని పలు గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారు కల్లు శాంపిల్ తీసుకునే సమయంలో కల్తీకల్లు అని చూసిన వారికి, తీసుకునే వారికి తెలుసు అని ఆ శాంపిల్ బాటిల్లు ల్యాబ్ కు వెళ్లేసరికి మారుతున్నాయని అందుకే టెస్ట్ లో ఏమి రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇంతగా మత్తునిచ్చే ఆ కల్లు అంతలోనే ఎలా మారుతుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కల్లు లో కలిపే మత్తు పదార్థాలు:క్లోరల్ హైడ్రేట్ ఎక్కువ మత్తు కలిగించే రసాయనం. డైజోఫామ్ నిద్ర మాత్రలు నిద్రపట్టే మందులు పొడి చేసి కలపడం. అల్కహాల్ స్పిరిట్ మత్తు పెంచడానికి. యూరియా ఫర్మెంటేషన్ వేగంగా జరగడానికి కొందరు కలుపుతారు. సాచరిన్ లేదా చక్కెర పదార్థాలు రుచిని మార్చడానికి. అమోనియం క్లోరైడ్ కృత్రిమంగా ఫర్మెంటేషన్ పెంచడానికి, ఇవి కలపడం వల్ల వచ్చే ప్రమాదాలు తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం, కాలేయం దెబ్బతినడం, తీవ్రమైన పరిస్థితుల్లో ప్రాణాపాయం కూడా కలుగుతుంది. ప్రజావాణి కార్యక్రమంలో ఇప్పటివరకు 17 ఫిర్యాదులు అందినప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు జిల్లా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆరోపిస్తున్నారు. అదే సమయంలో కొంతమంది రాజకీయ నాయకుల అండతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ కల్లు విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.చుక్కాపూర్ గ్రామంలో రెండు కల్లు దుకాణాలకు మాత్రం అనుమతులు ఉండగా ఎనిమిది చోట్ల కల్లు విక్రయిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో చెట్టుకల్లు తక్కువ కల్తీకల్లు ఎక్కువగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తున్నారు.



Prajavani Acknowledgement Receipt

Name:K Narsa Goud
Mobile No. : 8374539421
Address:Chukkapur,Kamareddy,Machareddy
Village:CHUKKAPUR
Mandal:MACHAREDDY
Grievance Subject:Requests

Your Grievance is Registered vide Registration no.KMREXC/E/2026/00001 On02-02-2026Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to excise department

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- గంజాయి డ్రగ్స్ నిర్మూలనకై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి
- చెరుపల్లి సీతారాములు మాజీ ఎమ్మెల్సీ




**హైదరాబాద్, మార్చి 15 (జనంసాక్షి) :** భగత్ సింగ్ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేటి విద్యార్థి యువత పోరాటాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు గారు పిలుపునిచ్చారు. ఆదివారం రోజున ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్ యువజనోత్సవాల్లో భాగంగా గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలించాలని ఉస్మానియా యూనివర్సిటీ లో 2కే రన్ ఎన్సిసి గేట్ నుండి ఆర్ట్స్ కాలేజి వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు గారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడి దురాగాతాలకు వ్యతిరేకంగా తమ జీవితాలను అర్పించిన వీర కిశోరాల స్ఫూర్తిని విద్యార్థులు,యువత మరింత ముందుకు తీసుకపోవాల్సిన అవసరం ఉందని, దేశ స్వాతంత్రోద్యమ వీరుల చరిత్రను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. నేడు సమాజంలో సామ్రాజ్యవాద దోపిడి మరో కోణంలో జరుగుతుంది. విద్యా, వైద్యం వంటి అంశాలు పేదలకు అందని ద్రాక్షలా మారుతున్నాయి.నిరుద్యోగం పెరుగుతుంది. మతోన్మాదం పెచ్చరిల్లుతూ భారత చారిత్రక లౌకిక వారసత్వాన్ని దెబ్బతీస్తున్నది. అంటరానితనం, అసమానతలు తీవ్రమవుతున్నాయి. మహిళలు, చిన్నారుల పై దాడులు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో వీటన్నింటిపై ఉద్యమించడమే భగత్సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లకు మనం ఇచ్చే ఘననివాలని అన్నారు. ప్రపంచంలో ఆధిపత్యం కోసం అమెరికా సామ్రాజ్యవాదంతో దేశాలపైన యుద్ధాలు చేస్తూ దేశ అధ్యక్షులను, దేశ ప్రజలను హతమరుస్తుందని అన్నారు. పశ్చిమాసియా దేశాల యుద్ధాల వలన ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యుద్ధం వలన గ్యాస్ కొరత ఏర్పడి ధరలు పెరిగిపోతున్నాయని అన్నారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ట్రంప్ కు లొంగిపోయి మౌనంగా ఉండడం సిగ్గుచేటన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా,దోపిడి పీడనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో నేడు అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విద్యార్థి యువత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచి పోషించడంతో యువత చెడు వ్యసనాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమంగా రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించి యువత ప్రాణాలను కాపాడాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడబిగుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 15 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో విద్యార్థి యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. ఎల్ మూర్తి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాలను రద్దు చేయాలని అన్నారు.భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో అవినీతి అంతానికై, మతోన్మాదానికి వ్యతిరేకంగా, అందరికీ విద్యా ఉపాధి కై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ చేసే పోరాటాలలో విద్యార్థి యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి,జావీద్ ప్రజా సంఘాల నాయకులు కొమ్ము విజయ్, సంగీత,మారన్న,సైదులు, నరేష్ ,పవన్,వెంకటరెడ్డి, రాజయ్య సునీల్, రవి,నాగేందర్ రజనీకాంత్, అర్జున్, ప్రవీణ్,అర్జున్,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేకు వినతి




**చేర్యాల, మార్చి 15 (జనంసాక్షి) :** చేర్యాల మండల కేంద్రంలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డిని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ టీఎన్జీవోస్ తరఫున చేర్యాల ప్రాజెక్టు నుండి అంగన్వాడీ టీచర్స్ కలిశారు. నేడు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలలో అంగన్వాడీ టీచర్లను ప్రీ ప్రైమరీ టీచర్లుగా తీసుకొని కనీస వేతనం 26,000, ప్రీ ప్రైమరీ ని అంగన్వాడీ కేంద్రాల ద్వారానే నడపాలి, రిటైర్మెంట్ అయిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ సౌకర్యం, ఆరోగ్య లక్ష్మి బిల్లులు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇవ్వాలి, అంగన్వాడీ టీచర్లకు ఇతర శాఖల పనులు ముఖ్యంగా బిఎల్ఓ లాంటి పనులు అప్పగించకూడదని,ఎన్ హెచ్ టి ఎస్ యాప్, పోషన్ ట్రాకర్ ఆప్ లతో ఇబ్బందులు, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచరు, ఆయా పోస్టులను వెంటనే భర్తీ, ఆన్లైన్ రిపోర్టులు చేయడానికి కొత్త మొబైల్స్, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్వాడి కేంద్రాలకు మార్చి 15వ తేదీ నుండి ఒంటిపూట బడులు, మే నెలలో మొత్తం టేక్ హోమ్ రేషన్ కి అనుమతిని ఇస్తూ సెలవులు మంజూరు లాంటి సమస్యల మీద అసెంబ్లీలో ఎమ్మెల్యే గా ప్రస్తావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో అంగన్వాడీ టీచర్స్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షురాలు తాటిపాముల కృష్ణవేణి, చేర్యాల ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, ప్రాజెక్టు సలహాదారు శోభ, స్వరూప రాణి రేణుక తదితరులు పాల్గొన్నారు.

## కరాటే టోర్నమెంట్‌లో తుంగతుర్తి విద్యార్థుల ప్రతిభ




**తుంగతుర్తి మార్చి 15 (జనం సాక్షి) :** వినోద్ కరాటే అకాడమీ వారి ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో తుంగతుర్తి విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు సుమన్ ఫోటో ఖాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ బొంకూరి అరుణ తెలిపారు, తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో తుంగతుర్తి పట్టణంలోని సుమన్ ఫోటో కం కరాటే అకాడమీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించినట్లు తెలిపారు, ఈ మేరకు ఖమ్మం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగేందర్ మరియు మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా మెడల్స్ సర్టిఫికెట్స్ అందుకోవడం జరిగిందన్నారు ఈ టోర్నమెంట్లో తుంగతుర్తి కి చెందిన మెంత బోయిన.లాస్య, అండర్ 12 విభాగంలో లో సిల్వర్ మెడల్ , నీలం ధన్విన్ సాయి పటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, పాలడుగు అవంతిక, నీలం శ్రీధైత్య సిల్వర్ మెడల్స్ మరియు మందుల మణిచంద్ అండర్ 14 విభాగంలో సిల్వర్ మెడల్ బయ్య. ఉమేష్, భయ్యా. హర్షిత, హిమాన్షు కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్స్. రెడ్డి బోయిన ప్రణీత, భార్గవి సిల్వర్ మెడల్స్ కటాస్ విభాగంలో సాధించినట్లు తెలిపారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



**మాడుగులపల్లి, మార్చి 15 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో ఆదివారం ప్రమాదం చోటుచేసుకుంది. వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన ఓ గీత కార్మికుడు ప్రమాదవశాత్తు పైనుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెరువుపల్లి గ్రామానికి చెందిన కొమ్మగోని సైదులు సుదీర్ఘ కాలంగా గీత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం తన దైనందిన పనిలో భాగంగా కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పైనుంచి కింద పడిపోయారు. తీవ్రమైన గాయాలు కావడంతో సైదులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు సైదులు మృదుస్వభావి అని, కష్టపడి పనిచేసే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి గీత కార్మికుల బీమా పథకం ద్వారా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆటోను ఢీ కొట్టిన లారీ

- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు



**నాంపల్లి, మార్చి 15 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా నాంపల్లి మండల పరిధిలో గల నాగార్జున సాగర్ హైవే మీద గల రేఖ్య తండా గ్రామపంచాయతీ వస్రం తండా వద్ద ఆటో నీ లారీ డీ కొట్టడంతో ముగ్గురు అక్కడికడే మరణించారు. మిగతా తొమ్మిది మంది తీవ్ర గాయాలతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి కొందరిని, హైద్రాబాద్ లో ప్రైవేట్ ఆసుపత్రికి కొందరిని తరలించారు, మృతుడు కొర్ర బద్య కొడుకు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆక్సిడెంట్ గల కారణాలను సేకరిస్తున్నారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం మల్లేపల్లి నుండి చింతపల్లి వైపు వెళ్తున్న ఆటో(ఏపీ24టిసి5299)నాగార్జున సాగర్ హైవే వస్రం తండా వద్ద ఆగి ప్రయాణికులు దిగుతున్న సమయంలో వెనక నుండి వస్తున్న (ఏపీ 29యు7795)నెంబర్ గల ఇటుక లారీ ఆటో నీ గట్టిగా డీ కొట్టి కొంత దూరం నెట్టుకుని వెళ్ళింది.ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 12 మంది ప్రయాణికుల్లో ముగ్గురు అక్కడికి అక్కడే మరణించగా మిగతా తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలైన కొందరిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,కొంత మందిని హైద్రాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఆటో లో ప్రయాణించేవారందరు బీహార్ నుండి బతుకుదెరువు కోసం వచ్చి కోళ్ల ఫామ్ లో పనిచేసుకునే వాళ్లు, చుట్టూ పక్కల తండాల్లో నివసించే నిరుపేదలు కావడం,కుటుంబ పెద్దలు కావడంతో వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితి పడిపోయాయి.మృతుల వివరాలు కొర్ర బద్య(57) ఆటో డ్రైవర్ కోర్రమను తండా వాసి,సంతోష్ ఖలిఫా(40) కోళ్ల ఫామ్ కూలి ,బీహార్ రాష్ట్రం,బండారు ఇసాక్(55) కూలి బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వాసి.ఈ ఘటన లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం వలన జరిగింది అని స్థానికులు,మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు.

## ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి

- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలు నాయక్




**దేవరకొండ, మార్చి 15 (జనం సాక్షి) :** ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతికగా నిలుస్తాయని, గంగా,జమున, తహజీప్ కు ప్రతిరూపంగా మారుతాయని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఉపవాస దీక్షలు పాటించిన ముస్లిం సోదరుల కోసం ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టణంలోని మక్క మస్జీద్ లో దావతే ఇఫ్తార్ మరియు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి దావతే ఇఫ్తార్ లో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో నియమ నిష్ఠతో ప్రత్యేక ప్రార్థనలతో ముస్లిం సోదరులు ఉపవాసాలు పాటిస్తున్నారని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లిం కుటుంబాలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రంజాన్ పండుగ ప్రతి ముస్లిం ఇంట్లో సుఖ సంతోషాలు గడవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజిమోద్దీన్, మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, మాజీ వైస్ చెర్మన్ రహత్ అలీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పున్న వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, మాజీద్ మౌలానా, మదర్సా మిస్బా ఉల్ ఉలూం నజీమ్ సాదీక్ అలీ, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ప్రాణ భద్రతపై అవగాహన



**మల్దకల్, మార్చి 15 (జనంసాక్షి) :** మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న బావుల వద్ద ఇటీవల చిన్నారులు ఎక్కువ సంఖ్యలో ఈత కొట్టడానికివస్తుండటంతో వారి భద్రతను దృష్టిలో పెట్టుకొని మల్దకల్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు,మల్దకల్ ఎస్ఐ శ్రీహరి సూచనలతో పోలీసు కానిస్టేబుల్స్ బీమరాయుడు,సుధాకర్ లు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని బావుల వద్దకు వెళ్లి అక్కడ ఈతకు వచ్చిన చిన్నారులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు చిన్నారులకు పలు జాగ్రత్తలు సూచించారు.పిల్లలు ఎప్పుడైనా బావులకు ఈత కొట్టడానికి వెళ్లాలనుకుంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులకు లేదా పెద్దలకు తప్పనిసరిగా చెప్పి వారి సహాయంతో మాత్రమే వెళ్లాలని సూచించారు. సరదాగా లేదా ఆకతాయి తనంతో స్నేహితులతో కలిసి ఒంటరిగా బావులకు వెళ్లడం చాలా ప్రమాదకరమని, అలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. అందువల్ల పిల్లలు ఎప్పుడూ ఒంటరిగా బావులకు వెళ్లకుండా పెద్దల పర్యవేక్షణలోనే ఈత కొట్టాలని సూచించారు. పిల్లలు బావులకు వెళ్లే ముందు ఇంట్లో పెద్దలకు తెలియజేయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.ప్రాణం విలువ ఎంతో గొప్పదని,చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా చిన్నారులకు పోలీసులు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

## మాడాపూర్‌లో రూ.30 లక్షలతో కొత్త పాఠశాల భవనానికి శంకుస్థాపన



**లింగాల, మార్చి 15 (జనం సాక్షి) :** లింగాల మండలం మాడాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపనను డీసీసీ అధ్యక్షుడు, యంఎల్ఏ డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేశారు. లింగాల మండలం మాడాపూర్ గ్రామంలో 30 లక్షల రూపాయలతో పాఠశాల బిల్డింగ్‌కు స్థానిక సర్పంచ్ శేఖర్ ,ఉప సర్పంచ్ నాయకులతో కలిసి ఫౌండేషన్ స్టోన్ వేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఈ కొత్త స్కూల్ భవనం నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాబేరా,మోహన్,రాములు మోహిన్, మల్లేష్ సంకి భగవంతు గ్రామ ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రింగ్ సెంటర్‌లో యాక్సిడెంట్ స్పాట్

- విచిత్రంగా ఒకే షాపుని పలుమార్లు ఢీకొడుతున్న లారీలు
- నిత్యం రద్దీగా ఉండే రింగ్ సెంటర్
- ప్రజలను బెంబేలెత్తిస్తున్న వరుస సంఘటనలు



**పెనుబల్లి, మార్చి 15 (జనం సాక్షి) :** నడి రింగు సెంటర్లో ఒకే ఫ్యాన్సీ షాపులోకి అనేకసార్లు విచిత్రంగా లారీలు దూసుకెళ్లి జరుగుతున్న ప్రమాదాల పట్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న సంఘటనలు రింగ్ సెంటర్లో చోటు చేసుకుంటున్నాయి. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వియం బంజర్ రింగ్ సెంటర్లో ఆదివారం పట్టపగలు మూసి ఉన్న ఫ్యాన్సీ షాపుని మినీ లారీ బలంగా ఢీకొన్నది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపు వెళుతున్న మినీ లారీ రింగ్ సెంటర్ అంచులో ఉన్న ఫ్యాన్సీ షాపుని బలంగా ఢీకొన్నది. ఇదే ఫ్యాన్సీ షాపుని విచిత్రంగా గతంలో ఎన్నోసార్లు షాపు మూసి ఉన్న సమయంలోనే లారీలు షాపులోకి దూసుకు వెళ్లిన సంఘటనలు జరిగాయి. ఇప్పటివరకు ఈ షాపులోకి లారీలు దూసుకు వెళ్లిన సంఘటనలో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ జరిగిన వరుస ప్రమాద దృశ్యాలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కనీసం ఏడు ఎనిమిది సార్లు ఈ ఫ్యాన్సీ షాపులోకి లారీలు దూసుకు వెళ్లి ప్రమాదాలు సంభవించినప్పటికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడం వల్ల సంబంధిత అధికారులు కూడా తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో అశ్రద్ధ వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి

- గ్రామీణ వైద్యులకు శిక్షణను అందించి సర్టిఫికెట్లు అందజేయాలి
- ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకన్న




**సూర్యాపేట, మార్చి 15 (జనంసాక్షి) :** గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి శిక్షణను అందించి సర్టిఫికెట్లను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకన్న అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్ లో తెలంగాణ ఆర్ఎంపి అండ్ పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా 13వ మహాసభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఆర్ఎంపి, పిఎంపిలను తిరిగి కమ్యూనిటీ పారామెడిక్ గా గుర్తించి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ మహాసభ ద్వారా ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు.గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు.అర్హత గల గ్రామీణ వైద్యులకు పారామెడికల్ శిక్షణను అందించేందుకు సంఘం తరఫున కృషి చేస్తామని తెలిపారు.గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అంతకుముందు ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజా విప్లవ గాయని విమలక్క, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞాన సుందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూనే ఆర్ఎంపి, పిఎంపీల సేవలు అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఎండి గఫార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాచారి, నీలాద్రి గ్రూప్ ఆఫ్ చైర్మన్ పీసాటి జితేందర్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త గుర్రం సత్యనారాయణ రెడ్డి, స్పర్శ అధ్యయన కేంద్రం కాకి భాస్కర్ రెడ్డి, అపెక్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ కుంభం భాస్కర్ రెడ్డి, అడ్వకేట్ జూపల్లి సాయికృష్ణ,కె.శ్రీనివాస్ రెడ్డి,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పుప్పల లక్ష్మీనరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి రాజేందర్, జిల్లా సహాధ్యక్షులు షేక్ రహమతుల్లా, కోశాధికారి జెర్రిపోతుల లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ డాంగే, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గూకంటి రాజబాబు రెడ్డి, పప్పుల వెంకన్న, సరికొండ నాగరాజు, చింతకింది సోమనారాయణ,సాయి మారుతి హాస్పిటల్ డైరెక్టర్ షేక్ రఫీ,ఆర్ఎంపీలు, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.




# ఐపీఓ రూల్స్‌కు కేంద్రం సవరణలు..

## జియో ఐపీఓకు లైన్ క్లియర్

**న్యూఢిల్లీ:**స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయ్యే కంపెనీలు ప్రవేశపెట్టే కనీస పబ్లిక్ ఆఫర్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సవరించింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువ ఆధారంగా వాటిని వర్గీకరించింది. సెబీ ప్రతిపాదనల మేరకు సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ రూల్స్, 2026ను ఆర్థిక శాఖ తాజాగా నోటిఫై చేసింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువతో సంబంధం లేకుండా కనీసం 2.5 శాతం వాటాను విక్రయించాలని సూచించింది. తాజా నిబంధనల సవరణతో జియో, ఎన్ఎస్ఈ వంటి ఐపీఓలకు మార్గం సుగమం అయినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఇష్యూ అనంతరం రూ.1600 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల మార్కెట్ విలువ ఉంటే ఆ కంపెనీలు 25 శాతం పబ్లిక్ వాటాను మూడేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది. అదే రూ.1600 కోట్లలోపు ఉంటే 25 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లను గానీ, డిబెంచర్లను గానీ పబ్లిక్ ఇష్యూ సమయంలోనే విక్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ మార్కెట్ విలువ రూ.4 వేల కోట్లలోపు ఉంటే కనీసం రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించాల్సి ఉంటుంది.రూ.4,000–5000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన




కంపెనీలు 10 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. లిస్టింగ్ అనంతరం మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల నుంచి రూ.1 లక్ష కోట్లు ఉంటే.. రూ.1000 కోట్లకు సమానమైన (కనీసం 8 శాతం) ఈక్విటీ షేర్లను లేదా డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనను ఐదేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది.రూ.1 లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు 2.75 శాతం వాటాకు సమానమైన రూ.6250 కోట్ల వాటాను పబ్లిక్ ఆఫర్‌లో విక్రయించాలి. రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు కనీసం రూ.15 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ డిబెంచర్లను విక్రయించాలి.లిస్టింగ్ సమయంలో 15 శాతం కంటే తక్కువ వాటాను విక్రయించిన కంపెనీలు తొలి ఐదేళ్లలో 15 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధన చేరుకోవడానికి 10 ఏళ్లు గడువు ఇచ్చారు. అదే లిస్టింగ్ సమయంలో 15 శాతం ఉంటే ఐదేళ్లలో 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను చేరుకోవాల్సి ఉంటుంది.జియో ఐపీఓకు గ్రీన్ సిగ్నల్ ఇలా: పబ్లిక్ ఇష్యూ అనంతరం సంస్థ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లను మించేటట్లయితే.. ఐపీఓలో 2.5% వాటా మాత్రమే విక్రయించేందుకు కంపెనీలకు అనుమతి ఇవ్వాలని గత సెప్టెంబరులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. అంతకుముందు నిబంధన ప్రకారం కనీసం 5% వాటాను కంపెనీలు విక్రయించాల్సి ఉంది.

# విమాన ప్రయాణికులపై 'సర్‌ఛార్జి' బాదుడు

హైదరాబాద్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో విమాన ప్రయాణికులపై సర్‌ఛార్జి రూపంలో విమానయాన సంస్థలు బాదుడు ప్రారంభించాయి. యుద్ధం కారణంగా విమాన ఇంధన ధరలు పెరిగాయని... తప్పని పరిస్థితుల్లో సర్‌ఛార్జి విధిస్తున్నామంటూ పలు విమానయాన సంస్థలు తెలిపాయి. ఎయిరిండియా, ఏఐ ఎక్స్‌ప్రెస్: ఈనెల 12 నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీని వసూలు చేయడం ప్రారంభించాయి. దేశీయ ప్రయాణాలపై రూ.399 అదనంగా వసూలు చేస్తున్నారు. ఆగ్నేయాసియా మార్గాల్లో 60 డాలర్లు, ఆఫ్రికాకు 90 డాలర్లు, ఐరోపాకు 125 డాలర్లు, ఉత్తర అమెరికా/ ఆస్ట్రేలియాకు 200 డాలర్లు చొప్పున సర్‌ఛార్జీ చెల్లించాలి. ఎయిరేషియా: మార్కెట్ పరిస్థితులను బట్టి టికెట్ ధరలు, ఇంధన సర్‌ఛార్జీలను సవరిస్తున్నట్లు తెలిపింది. స్పైస్‌జెట్: ఏటీఎఫ్ వల్ల సర్‌ఛార్జీ విధించక తప్పదని స్పష్టం చేసింది. ప్రభుత్వం విమాన ఇంధనంపై పన్నులు తగ్గించాలని కోరింది.ఇండిగో: మార్చి 14 నుంచి దేశీయ, అంతర్జాతీయ విమానాలపై రూ.425 నుంచి రూ.2,300 వరకూ ఇంధన సర్‌ఛార్జీలను వసూలు చేస్తోంది. ఆగ్నేయాసియా, చైనా, ఆఫ్రికా విమాన సర్వీసులపై రూ.1,800, ఐరోపా విమాన సర్వీసులకు రూ.2,300లుగా ఛార్జీలుంటాయి. ఆకాశ ఎయిర్: మార్చి 15 నుంచి బుక్ చేసుకునే దేశీయ, అంతర్జాతీయ టిక్కెట్లపై రూ.199 నుంచి రూ.1,300 వరకూ సర్‌ఛార్జీలను వసూలు చేయనుంది. ప్రయాణ వ్యవధి, విభాగాన్ని బట్టి, ఈ ఛార్జీలు మారుతాయి. క్యాథే పసిఫిక్: ఈనెల 18 నుంచి ప్రయాణికుల ఇంధన సర్‌ఛార్జీ రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దూర ప్రయాణాల విమానాలపై ఇది 1164 హాంకాంగ్ డాలర్లు (దాదాపు రూ.12000)కు



పెరగనుంది.థాయ్ ఎయిర్‌వేస్, హాంకాంగ్ ఎయిర్‌లైన్స్: చమురు ధరలకు అనుగుణంగా టికెట్ ధరలను పెంచాయి. ఎయిర్ న్యూజిలాండ్: ఇంధన ధరలు ఎక్కువగా ఉండటం వల్ల టికెట్ ధరలు పెరుగుతున్నాయని, విమాన షెడ్యూల్స్, మార్గాల్లో మార్పులు రావొచ్చని పేర్కొంది. ఫిన్ ఎయిర్: అదనపు సర్‌ఛార్జీ కాకుండా, ఇంధన ధరల వ్యత్యాసాన్ని నేరుగా టికెట్ ధరల్లో ప్రతిబింబించేలా మార్పులు చేసింది. మార్చి నెలాఖరు వరకు దోహా, దుబాయ్ విమానాలను రద్దు చేసింది.క్వాంటాస్, స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్: ఇంధన ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి తాత్కాలికంగా టికెట్ ధరలను సవరించాయి.

సుమారు 90,000 మంది ప్రయాణికులపై భారం

శంషాబాద్ విమానాశ్రయం నుంచి రోజూ రాకపోకలు కొనసాగించే సుమారు 90 వేల మంది ప్రయాణికులపై ఇంధన సర్‌ఛార్జి భారం పడనుంది.యుద్ధం నేపథ్యంలో దేశీయ విమాన సర్వీసుల టికెట్ ధరలు పెరిగాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తెలుగు రాష్ట్రాలు, దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలకు టికెట్ల ధరలు ఈ నెల రెండో తేదీతో పోలిస్తే దాదాపు రెండింతలయ్యాయి. విజయవాడకు సాధారణ రోజుల్లో టికెట్ ధర రూ.2,500 నుంచి రూ.3,500 వరకు ఉండగా... ఇప్పుడు కనిష్ఠంగా రూ.5,200, గరిష్ఠంగా రూ.7,300 అయింది. యుద్ధానికి ముందు దిల్లీ టికెట్ ధర రూ.5,800 ఉండగా... ప్రస్తుతం రూ.7,300 నుంచి రూ.9,200 వరకూ ఉంది. ఆదివారం నాడైతే రూ.పది వేలకుపైనే.బెంగళూరు, చెన్నై నగరాలకు టికెట్ ధరలు రూ.5 వేల నుంచి రూ.8,500 వరకు ఉన్నాయి. బెంగళూరుకు కనిష్ఠ ధర రూ.6,200.

రద్దవుతున్న గల్ఫ్ విమానాలు

పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ విమానయాన సంస్థలు పరిమితంగా విమాన సర్వీసులు నడుపుతుండటంతో దుబాయి, అబూధాబీ, కువైట్‌లకు రాకపోకలు కొనసాగిస్తున్న పలు అంతర్జాతీయ సర్వీసులు రద్దయ్యాయి. ఈ నెల 1 నుంచి 13 వరకు గల్ఫ్ దేశాల నుంచి రావాల్సినవి 210, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 224 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

**విమాన సరకు రవాణా 'ప్రియం'**

ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన తర్వాత కొన్ని మార్గాల్లో విమాన సరకు రవాణా ధరలు 70% పెరిగాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల కొన్ని విమాన ప్రయాణాలకు – సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసరంగా సరకు పంపాల్సిన కంపెనీలు, ఖరీదైన విమాన రవాణాను వినియోగించుకోవాల్సి వస్తోంది. విమాన ఇంధన (ఏటీఎఫ్) పెరగడంతో, ఈ ఖర్చులు మరింత అధికమవుతున్నాయి. ఫలితంగా ఎయిర్ కార్గో హబ్‌ల్లో కార్యకలాపాలు తగ్గాయి. పశ్చిమాసియా గగనతలం మూసివేత, భద్రతా సమస్యల వల్ల.. దక్షిణాసియా, ఐరోపా మధ్య మార్గాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయని పరిశ్రమ నిపుణులు తెలిపారు. చమురు ఎగుమతులకు కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో 100 కంటే ఎక్కువ కంటెయినర్ నౌకలు నిలిచిపోయాయి.

**హర్మూజ్ మీదుగానే జనరిక్ ఔషధాలు**

మన దేశం నుంచి ఐరోపా సమాఖ్య, ఆఫ్రికా, సౌదీ అరేబియా, యూఏఈ వంటి కొన్ని అరబ్ దేశాలకు వెళ్లే తక్కువ ధర కలిగిన జనరిక్ ఔషధాలు సాధారణంగా హర్మూజ్ జలసంధి ద్వారా కంటెయినర్ నౌకల్లో వెళ్తాయని ఔషధ సరఫరా వ్యవస్థ నిపుణుడు ప్రశాంత్ యాదవ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల వల్ల జనరిక్ ఔషధాలనూ, విమానాల్లో తరలించాల్సి వస్తోందని తెలిపారు. విలువ పరంగా ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒకవంతు విమాన రవాణా ద్వారానే జరుగుతోంది.

## ఫ్రీ టికెట్లు అమ్ముకున్న ఎయిరిండియా ఉద్యోగులు..

### 4 వేల మందిపై చర్యలు?

దిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా పలువురు ఉద్యోగులపై చర్యలకు సిద్ధమైంది. ఉద్యోగులకు కల్పించే లీజర్ ట్రావెల్ పాలసీని దుర్వినియోగం చేసినందుకు గానూ పెనాల్టీలు విధించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో ఎంప్లాయీ లీజర్ ట్రావెల్ పాలసీ కింద ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములకు ఉచిత విమాన ప్రయాణ సదుపాయం ఉంటుంది. ఏడాదికి ఇన్ని చొప్పున ఉచిత టికెట్లు అని కేటాయిస్తారు. అయితే, సంస్థ జరిపిన అంతర్గత దర్యాప్తులో కొందరు ఈ పాల సీని దుర్వినియోగం చేసినట్లు తేలింది.తమ కుటుంబ సభ్యులు కానప్పటికీ తమ వారే అని చూపించి ట్రావెల్ పాలసీ ప్రయోజనాలను కొందరు ఉద్యోగులు పొం దినట్లు తెలుస్తోంది. కొందరైతే ఉచిత టికెట్లు పొంది..




వాటిని వేరే వ్యక్తులకు అధిక ధరకు విక్రయించిన ఉదంతాలూ దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు 'పీటీఐ' వార్తా సంస్థకు వెల్లడిం చాయి. దీనిపై ఎయిరిండియాను పీటీఐ వివరణ కోరగా.. స్పందన రాలేదు. మొత్తం గా 4వేల మంది ఉద్యోగులు ఈ పాలసీని దుర్వినియోగం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పాలసీ దుర్వినియోగం జరిగినట్లు తెలిసింది.సరిగ్గా ఎంత మంది ఉద్యోగులు ఈ దుర్వినియోగానికి పాల్పడ్డారు? ఈ పాలసీ ద్వారా ఎంత సొమ్ము దుర్వినియోగమైంది? ఏ కాలంలో ఇది జరిగింది వంటి వివరాలు పూర్తిగా బయటకు రాలేదు. దీనిపై ఎయిరిండియా చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మోసపూరితంగా ప్రయోజనాలు పొందిన వారి నుంచి సొమ్మును తిరిగి రాబట్టడంతో పాటు, వారిపై పెనాల్టీలు సైతం విధించనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాలసీని దుర్వినియోగం చేసిన వారిలో ఎక్కువ మంది ప్రైవేటీకరణ తర్వాత ఎయిరిండియాలో చేరిన వారే అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పేర్కొన్నారు. 2022లో ఎయిరిండియా ప్రైవేటీకరణ పూర్తి కాగా.. ప్రస్తుతం సంస్థలో 24 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,48,200 (22 క్యారెట్లు) | ₹ 1,61,680 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,90,000

యుద్ధం ఎఫెక్ట్..

# ఐటీ ఉద్యోగులకు ఇంటి నుంచి పని

**ఆఫీస్ క్యాంటీన్లలో గ్యాస్ కొరతే కారణం**

**ఇంధన పొదుపునకూ వీలు**





**న్యూఢిల్లీ:**గ్యాస్ కొరత కారణంగా క్యాంటీన్ కార్యకలాపాలకు అంతరాయం కలగడంతో, ఐటీ సంస్థలు తమ ఉద్యోగులను ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలని సూచిస్తున్నాయి. కొన్నేమో ఇంటి నుంచి పనికి అవకాశమూ కల్పిస్తున్నాయి. ఇంధనాన్ని ఆదా చేసేందుకు సాధ్యమైనంత మంది ఉద్యోగులకు ఇంటి నుంచి పనికి అవకాశం కల్పించాలని వెల్స్‌ఫార్గో ఉన్నతాధికారి సూచిస్తున్నారు. హెచ్‌సీఎల్ టెక్ తమ చెన్నై కార్యాలయ ఉద్యోగులకు ఈనెల 12–13 తేదీల్లో వర్క్ ఫ్రమ్ హోమ్‌కి అనుమతి ఇచ్చినట్లు ఇద్దరు సీనియర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. వాణిజ్య గ్యాస్ లభించకపోవడం వల్ల పలువురు క్యాంటీన్ వెండర్లు సేవలు నిలిపివేశారని, దీంతో ఉద్యోగులకు ఇంటి నుంచే పని సౌలభ్యం ఇచ్చినట్లు వెల్లడించారు. ఇన్ఫోసిస్ సలహా ఇలా: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ కూడా బెంగళూరు, చెన్నైల్లోని తమ కార్యాలయాల్లో అడ్వైజరీ జారీ చేసింది. వాణిజ్య గ్యాస్ కొరత కారణంగా క్యాంటీన్లలో తక్కువ పదార్థాలే లభిస్తాయని బెంగళూరులోని ఉద్యోగులకు ఇన్ఫోసిస్ తెలిపింది. ఆఫీసుల్లో లైవ్ కౌంటర్ లను నిలిపివేయగా, ఇంటి నుంచి ఆహారం తెచ్చుకోవాలని ఉద్యోగులకు సూచించింది. గత ఏడాది చివరికి ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్‌లలో వరుసగా 3,37,034; 2,26,379 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. పశ్చిమాసియా దేశాల్లో ఇప్పటికే వ్యాపారాలు ఉన్న లేదా కొత్తగా ప్రారంభించాలని భావిస్తున్న కంపెనీలు, పెరుగుతున్న అనిశ్చితి దృష్ట్యా సీనియర్ స్థాయి నియామకాలను నిలిపివేస్తున్నట్లు గ్లోబల్ సెర్చ్ కంపెనీలు చెబుతున్నాయి. ఇంధనం, స్థిరాస్తి, నిర్మాణం, లాజిస్టిక్స్ వంటి రంగాలపై యుద్ధ ప్రభావం పడటంతో, ఆ ప్రాంతంలో సంబంధం ఉన్న కంపెనీల బోనస్‌లపై ఒత్తిడి పడొచ్చని కన్సల్టింగ్ కంపెనీలు హెచ్చరిస్తున్నాయి.దేశంలో గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో, ఇంధనాన్ని ఆదా చేసేందుకు కంపెనీలు ఇంటి నుంచే పనిని ప్రోత్సహించాలని అమెరికాకు చెందిన ఆర్థిక సేవల దిగ్గజ సంస్థ వెల్స్‌ఫార్గో ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కట్టకం కోరారు. ఈ విషయంలో కంపెనీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు. ఇందువల్ల వనరులను కీలక సేవలకు మళ్లించొచ్చని తెలిపారు. సాధ్యమైనప్పుడల్లా ఉద్యోగులను ఇంటి నుంచి పనిచేయడానికి అనుమతించడమనేది, కంపెనీలు తీసుకోగలిగిన సులభ నిర్ణయమని చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.వేల మంది ఉద్యోగులు రోజూ సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వస్తూ, భారీ మొత్తంలో ఇంధనాన్ని ఖర్చు చేస్తున్నారని, ఈ ప్రయాణాలను తగ్గిస్తే.. ఆ ఇంధనాన్ని ఆరోగ్య సంరక్షణ, అత్యవసర సేవలు, లాజిస్టిక్స్, ప్రజా రవాణా వంటి కీలక సేవలకు బదలాయించవచ్చని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి నుంచే పని కేవలం నిర్వహణపరమైన నిర్ణయం కాదని, అది ఒక బాధ్యతాయుతమైన సౌలభ్యమన్నారు.

**నీటి సీసాలకు 'యుద్ధ సెగలు'**



ఇరాన్– అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం మనదేశంలో సామాన్యులపై పడుతోంది. ఇప్పటికే వాణిజ్య సిలిండర్ల కొరత ఏర్పడి హోటళ్లు, మెస్‌లు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు, హాస్టళ్ల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలో వాడుకునే వంట గ్యాస్ ధర పెరిగింది. పెట్రోల్, డీజిల్ కొరత రావొచ్చనే భయాలతో కొందరు వాహనాల ట్యాంకులు నింపేస్తున్నారు. ఇప్పుడు తాగునీటి సీసాలపైనా ఆర్థిక భారం పడుతోందని సమాచారం. వేసవి ఎండలు ముదురుతున్న తరుణంలో, నీటి సీసాల ధరలు పెరిగేందుకు యుద్ధం కారణమవుతోంది. దేశంలో ప్యాకేజ్డ్ వాటర్ మార్కెట్ 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.46,000 కోట్ల) స్థాయిలో ఉందని అంచనా. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బాటిల్ వాటర్ మార్కెట్లలో మనది ఒకటి. ప్లాస్టిక్ సీసాల తయారీలో పాలిమర్ చాలా కీలక ముడివస్తువు. ముడిచమురు నుంచి ఇది తయారవుతుంది. చమురు ధరలు పెరగడంతో పాలిమర్ ధరలూ అధికమయ్యాయి. సీసాల తయారీలో వాడే ముడిపదార్థం ధర 50% పెరిగి కిలోకు రూ.170కు చేరగా, మూతల ధర రెట్టింపు కంటే ఎక్కువై ఒక్కొక్కటి రూ.0.45కు చేరినట్లు సమాచారం. చివరికి ప్యాకింగ్ బాక్సులు, లేబుల్స్, టేపుల ధరలు కూడా భారీగా పెరిగాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతానికి రిటెయిల్ ధరలపై ఈ ప్రభావం పడలేదు. పెద్ద కంపెనీలు పెరిగిన ముడివస్తువుల ధరల భారాన్ని భరిస్తున్నాయి. అయితే సీసాలు తయారు చేసే దాదాపు 2000 సంస్థలు మాత్రం, తమ రీసెల్లర్ల కోసం ధరలను బాటిల్‌కు రూపాయి (5%) చొప్పున పెంచారు. ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రకారం.. రాబోయే రోజుల్లో ఈ ధర మరో 10% పెరగనుంది. సాధారణంగా వినియోగదారులు ఒక లీటర్ నీటి సీసాకు రూ.15–20 చెల్లిస్తున్నారు. 'సీసా ధర వల్ల, మొత్తం నీటి సీసా ధర ఎంత పెరుగుతుందో మరో 4–5 రోజుల్లో తెలుస్తుంది' అని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అపూర్వ దోషి తెలిపారు.140 కోట్ల మంది జనాభా ఉన్న మన దేశంలో స్వచ్ఛమైన నీరు ఒక విలాసంగా మారింది. ప్రస్తుతం దేశంలో 70% భూగర్భ జలాలు, పైపులైన్లలో వచ్చే నీరు కలుషితమై ఉన్నట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వస్తే సీసా నీటిపైనే ఆధారపడుతున్నారు. బిస్లరీ, కిన్లీ, ఆక్వాఫినా, రిలయన్స్, టాటా కంపెనీలు ఈ విపణిలో ఆధిపత్యం కోసం పోటీపడుతున్నాయి.మొత్తం సీసా నీటి మార్కెట్‌లో నేచురల్ మినరల్ వాటర్ వాటా 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3680 కోట్లు). ఈ ఉత్పత్తులను ధనవంతులు ఎక్కువగా వాడుతున్నారు. యూరో మానిటర్ ప్రకారం.. 2021లో కేవలం 1%గా ఉన్న ప్రీమియం వాటర్ విభాగం వాటా, గతేడాది 8 శాతానికి చేరింది. రీసెల్లర్ల ధరలను 18% పెంచినట్లు ఆవా కంపెనీ సీఈఓ శిరోయ్ మెహతా తెలిపారు. క్లయింట్‌లను కోల్పోకూడదని 40–50% అదనపు ఖర్చును తయారుదారులే భరిస్తున్నారని, వేసవి కాలానికి ముందు పానీయాల పరిశ్రమకు ఇది గడ్డు పరిస్థితి అని అన్నారు. ప్యాకేజింగ్, ఉత్పత్తిలో వాడే ముడివస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయని, ప్రస్తుత విక్రయ ధరలతో.. పెరుగుతున్న ఈ వ్యయాలను భరించడం సాధ్యం కాదని క్లియర్ ప్రీమియం వాటర్ బ్రాండ్‌ను నిర్వహించే ఎనర్జీ బెవరేజెస్ ప్రకటించింది.

# మళ్లీ డిమాండ్‌లోకి కిరోసిన్

- రాష్ట్రాలకు నెలవారీ కోటాపై అదనంగా 48,000 కిలోలీటర్లు
- బొగ్గు, ఇతర ప్రత్యామ్నాయ ఇంధనాలకూ అనుమతి
- కేంద్రం తాత్కాలిక చర్యలు



**న్యూఢిల్లీ:**వంట అవసరాలకు మళ్లీ కిరోసిన్‌ను కేంద్రం తాత్కాలికంగా ప్రవేశపెట్టింది. అలాగే బొగ్గు, ఇతర ప్రత్యామ్నాయాలను హోటళ్లు, రెస్టారెంట్లు వాడుకోవచ్చని తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు దేశ ఇంధన సరఫరాకు అవాంతరాలు తెచ్చిపెట్టడం ఇందుకు నేపథ్యం. హర్మూజ్ జలసంధి మూతపడడం మన వంట గదికీ సెగ తెచ్చిపెట్టింది. ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఎక్కువ భాగం ఆ జలసంధి నుంచే మనకు వస్తోన్న సంగతి తెలిసిందే. చమురు, గ్యాస్ ఉత్పత్తి దేశాలైన సౌదీ అరేబియా, కువైట్, ఇరాన్, ఇరాక్, ఖతార్, యూఏఈలకు సముద్ర మార్గం ఇదొక్కటే కావడం గమనార్హం. గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఈ జలసంధి ప్రపంచంలో అయిదో వంతు చమురు, ఎల్ఎన్‌జీ ఎగుమతులకు వారధిగా ఉంటోంది. భారత ముడి చమురు దిగుమతుల్లో సగానికి పైగా, వంటకు ఉపయోగించే ఎల్‌పీజీ సరఫరాలో 55% వరకు ఈ మార్గం ద్వారానే మనకు వస్తోంది. ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 30 శాతానికి కూడా ఇదే ఆధారం. ఇపుడు అది మూతపడడంతో భారత్ తాత్కాలికంగా కొన్ని చర్యలు చేపట్టింది. అవేమిటంటే..రాష్ట్రాలకు అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేంద్రం కేటాయించింది. కుటుంబ వంట అవసరాలకు నెలవారీ ఇచ్చే 1 లక్ష కిలోలీటర్లకు ఇది అదనం హోటళ్లు, రెస్టారెంట్లు ఒక నెల పాటు ప్రత్యామ్నాయంగా బయోమాస్, రీఫ్యూజ్–డిరైవ్డ్ ఫ్యూయల్(ఆర్‌డీఎఫ్) పెలెట్స్, బొగ్గును వినియోగించడానికి పర్యావరణ నియంత్రణ సంస్థలను అనుమతి ఇవ్వాల్సిందిగా కేంద్రం కోరింది.ఎల్‌పీజీ సరఫరా: నెలవారీ వాణిజ్య ఎల్‌పీజీ గిరాకీలో 20 శాతాన్ని నిత్యావసర వ్యాపారాలకు ఓఎమ్‌సీలు(చమురు మార్కెటింగ్ కంపెనీలు) కేటాయించనున్నాయి. తద్వారా సరఫరాకు ఆటంకం లేకుండా చేస్తోంది.గ్యాస్ బండ బుకింగ్ కనీస గడువును పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెంచింది.

# రాహుల్ దేశాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు

రంగంలో రూ.2 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు కేంద్రమంత్రి ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు చేశారు. "అస్సాంాలో కాంగ్రెస్ తన 15 ఏళ్ల పాలనలో వైద్యారోగ్య రంగానికి సంబంధించిన బడ్జెట్ నుంచి ఏటా రూ.150 కోట్లు కాజేసింది. ఆ సమయంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆ పార్టీ కేవలం తమ నేతల కుటుంబాల ఆర్థిక ప్రయోజనాల కోసమే పనిచేసింది" అని అమిత్ షా (ంఎతిబి ూాష్ట్రజీష్ట్ర) ఆరోపించారు. సమాజంలోని అన్ని వర్గాలకూ అందుబాటు ధరల్లో వైద్య సేవలు లభించేలా భాజపా కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీర్చిదిద్దారని సీఎం హిమంత బిశ్వశర్మను అభినందించారు. ఇటీవల దిల్లీలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంపై అమిత్ షా మండిపడ్డారు. అదేవిధంగా పార్లమెంట్ మెట్లపై నిలబడి రాహుల్ గాంధీ చాయ్, పకోడీలు తీసుకోవడాన్ని కూడా ఖండించారు. పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్యానికి పవిత్ర ప్రదేశమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో అమిత్ షా పర్యటించడం నాలుగు నెలల్లో ఇది నాల్గోసారి.

# ఐరోపా దేశాల్లో చదువులకే పెద్దపీట

**అటువైపే మొగ్గుచూపుతున్న మన విద్యార్థులు**
**అందుబాటులో రుసుములు, అధిక నాణ్యతతో కూడిన విద్య కారణం**
**ఆక్సిలో ఫిన్‌సర్వ్ నివేదిక**

**ముంబయి:** భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు ఆసక్తి చూపిస్తున్నారని విద్యా సంబంధిత బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆక్సిలో ఫిన్‌సర్వ్ నివేదిక వెల్లడించింది. స్పెయిన్, జర్మనీ, సింగపూర్, యూఏఈ, దక్షిణ కొరియా వంటి దేశాలకు మన విద్యార్థులు వెళుతున్నారని తెలిపింది. అందుబాటులో రుసుములు, అధిక నాణ్యతతో కూడిన విద్య వారిని విదేశీ చదువులకు ప్రోత్సహిస్తున్నాయని పేర్కొంది. నివేదిక ప్రకారం..అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాలు ఇప్పటికీ ఎక్కువ మంది మన విద్యార్థులు వెళ్లి చదవాలనుకుంటున్న గమ్యస్థానాల్లో అగ్రస్థానాల్లో ఉన్నాయి. స్టెమ్ కోర్సులు చదివేందుకు అధికంగా అమెరికాను ఎంచుకుంటున్నారు. ఐరోపా దేశాలు, సింగపూర్‌లకు మారేందుకు విద్యార్థులు ముందుకొస్తున్నారు. అక్కడి ఫీజులు, విద్యా నాణ్యత, వీసా నిబంధనలు, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు, విద్యార్థుల భద్రత వారిని ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ విద్యపై ఖర్చు పెట్టే మొత్తంపై ఆర్ఓఐ (రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్) ఎంత వస్తుందనే ధోరణి కూడా మన విద్యార్థుల్లో కనిపిస్తోంది. స్పెయిన్, జర్మనీ, న్యూజిలాండ్‌లకు బలమైన గిరాకీ కనిపిస్తోంది. అధిక నాణ్యతతో కూడిన విద్య, అందుబాటు రుసుములు, స్పష్టమైన వీసా దారులు, విద్య పూర్తి చేసుకున్న వెంటనే ఉపాధి అవకాశాలు లభించడం (ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేట్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్–స్టెమ్ కోర్సులు) గిరాకీ కారణమని ఆక్సిలో ఫిన్‌సర్వ్ సీబీఓ - ఓవర్సీస్ లోన్ - శ్వేతా గురు వెల్లడించారు.2023–2025 మధ్య సంప్రదాయేతర ఐరోపా దేశాలు బలమైన, స్థిరమైన గమ్యస్థానాలుగా మారాయి. ఇక్కడ రూ.18–40 లక్షలు (ఏడాదికి) కోర్సు ఖర్చులు అవుతున్నాయి.

# కోట్‌పల్లి మండల కేంద్రంలో పచ్చని చెట్ల నరికివేత





- హరితహారం పేరిట లక్షలు ఖర్చుపెట్టి.. ఇక్కడ నరికివేత
- అనుమతి లేకుండా చెట్ల మూలాలతో సహా కోత
- అధికారులు కన్నెత్తి చూడటం లేదు.. ప్రజల ఆగ్రహం

కోట్‌పల్లి మార్చి 15 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం పేరిట లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పల్లెలను పచ్చదనంతో నింపాలని చెట్లను పెంచుతున్న నేపథ్యంలో, కోట్‌పల్లి మండల కేంద్రంలో మాత్రం పచ్చని చెట్లను దర్జాగా నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు లేవనెత్తాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్న చెట్లను సైతం మొదటికి నరికి వేయడం జరిగింది. దీనిని కప్పిపుచ్చుకోవడానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అపోహలు సృష్టించారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలకు అడ్డంకి కలిగితే చెట్టు కొమ్మలను మాత్రమే నరకాలి కానీ, చెట్టు మొదలుతో సహా నరికివేయడం ఎంతవరకు సమంజసమని ప్రకృతి ప్రేమికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం చెట్లను నాటడానికి భారీ మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టినా, ఇక్కడ ప్రభుత్వ ఆలోచనకు విరుద్ధంగా చెట్లను నాశనం చేస్తున్నారని, కనీసం అడిగే నాథుడు లేకుండా పోయిందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు, పర్యావరణవాదులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఘటనపై దారురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌ను సంప్రదించగా, తమకు ఎటువంటి సమాచారం లేదని, ఎవరూ తమ నుంచి పర్మిషన్ తీసుకోలేదని స్పష్టం చేశారు. అదేవిధంగా కోట్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎమ్మార్వో), మండల రెవెన్యూ అధికారిని సంప్రదించగా కూడా తమ నుంచి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, పర్మిషన్ తీసుకోలేదని వారు తెలిపారు. అనుమతి లేకుండా జరిగిన ఈ చెట్ల నరికివేతపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు ఒత్తిడి తెస్తున్నారు.

# రంజాన్ మాసం త్యాగం, కరుణ, సహనానికి ప్రతీక: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, మార్చి 15 (జనంసాక్షి) :** రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణుల కోసం ఆదివారం రామగుండం పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన దావత్–ఇ–ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ వేడుకలో రామగుండం నగర మేయర్, డిప్యూటీ మేయర్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ఇఫ్తార్ విందులో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రంజాన్ మాసం త్యాగం, కరుణ, సహనానికి అద్భుతమైన ప్రతీక అని తెలిపారు. ఈ పవిత్ర మాసం సమాజంలో సౌహార్ద్రత, సామరస్యం, ఐక్యతను మరింత బలపరుస్తుందని, అందరూ శాంతియుతంగా జీవించడానికి దోహదపడుతుందని అన్నారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, ఆధ్యాత్మిక శుద్ధి నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలోని విభిన్న వర్గాల మధ్య స్నేహభావం, పరస్పర అవగాహన మరింత పెరిగేలా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆయన వ్యాఖ్యానించారు


# మా ఇసుక బండ్లను ఆపేదేవరు?

## మాకు అడ్డు వచ్చేది ఎవ్వరు..?



- మండలంలో ఇసుక దందా జోరు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేకాతర్
- ట్రాక్టర్ కు రూ.5వేల నుండి రూ.7వేల వరకు విక్రయాలు
- పట్టుకున్న ట్రాక్టర్లకు నామ మాత్రంగా జరిమానాలు
- నాయకుల వత్తిడితో వదిలేస్తున్న అధికారులు
- పట్టా పగలు రాత్రి అనే తేడా లేదు
- చూసి చూడట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు.

**ధారూర్ మర్చి 15(జనం సాక్షి) :** జిల్లా ఉన్నతాధికారులు అక్రమ ఇసుకను అరికట్టాలని పదే పదే ఆదేశాలు ఇస్తున్న పై అధికారుల ఆదేశాలను క్రింది స్థాయి సిబ్బంది ఆచరించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ధారూర్ మండలంలో అక్రమ ఇసుక దందా ఆగడం లేదు.రాత్రి పగలు తేడా లేకుండా ప్రతి రోజు అక్రమ ఇసుక వ్యాపారస్థులకు పండుగే, పండుగ. ఉదయం సాయంత్రం మబ్బు పడిదంటే చాలు అక్రమ ఇసుక ట్రాక్టర్లు రోడ్లపై బహిరంగంగా వెళుతున్నాయి.పోలీస్,పారెస్ట్ రెవెన్యూ అధికారులకు పిర్యాదులు చేసిన లాభం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ట్రాక్టర్లకు నామ మాత్రంగా జరిమానాలు వేసి వదులేయడంతో ఇదంతా మామూలే అన్నట్లుగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు.దీంతో అక్రమ ఇసుక వ్యాపారం ఆగడం లేదు.అక్రమ ఇసుక ట్రాక్టర్లను వివిధ శాఖల అధికారులు పట్టుకున్న ఒత్తిడితో వదిలేస్తున్నట్లు ఆరోపనలు వినబడుతున్నాయి. అక్రమంగా ఇసుక నింపుతున్నారని ఎవరైనా సమాచారం అందిస్తే ఆ వెంటనే అక్రమార్కులకు తెలిసిపోతుందని ఆరోపిస్తున్నారు.ఫారెస్ట్ అధికారులు పై అధికారులు పనితీరు మెచ్చుకునేందుకు అప్పుడప్పుడు ఒకటో రెండో ఇసుక తరలిస్తున్న బండ్లను పట్టుకుని ఫైన్ వేసి వదిలిపెడుతున్నారు.వివిధ శాఖల అధికారుల కండ్ల ముందు నుంచి ఇసుక తరలిస్తే కూడా చూసి చూడనట్లుగా వ్యవహరించడం వెనకాల మతలాబు ఏంటోనని ప్రజలు అంటున్నారు.మొదటి సారి అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టుకుంటే రూ.5వేలు,రెంవడ సారి పట్టుకుంటే రూ.10వేల, మూడవ సారి అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టుకుంటే వహణంను సీజ్ చేయడం జరుగుతుందని రెవెన్యూ,పోలీస్ అధికారులు చెప్పడం తప్ప చర్యలు తీసుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అక్రమ ఇసుక వ్యాపారస్థులతో మండల అధికారులకు సంబందాలు ఉన్నందుకే మండలంలో అక్రమ ఇనుక వ్యాపారం జోరుగ కొనసాగుతుంది. నాగసము ందర్, రుద్రారం, గట్టే పల్లి, మన్నాన్పల్లిలో దొరికే ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు అక్రమంగా సంపాదిస్తున్నారు.ఫారెస్ట్ అధికారులు అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకోని,వారు నామ మాత్రంగా జరిమాన వేసి అక్రమ ఇనుక ట్రాక్టర్లను వదులుతున్నారని ప్రజలు అంటున్నారు.అక్రమ ఇసుక కొనసాగుతుంది.ప్రతి రోజు పదుల సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారు.ప్రభుతం నుండి ఏలాంటి అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలిస్తు ప్రభుత్వ ఆధాయానికి గండి కొడుతున్నారు.రాత్రి వేళల్లో ఇసుక వ్యాపారంతో ట్రాక్టర్ల చప్పుడు కంటికి కునుకు లేకుండా పోతుందని ప్రజలు అంటున్నారు.ఓక ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుండి రూ.7వేల వరకు విక్రయాలు చేస్తున్నారు.నిత్యం రెండు ట్రాక్టర్ అసుకను విక్రయాలు చేస్తే రోజుకు ఖర్చు పోను రూ.10వేల వరకు అక్రమ సంపాదన సంపాదించుకుంటున్నట్టు తెలుస్తుంది.ఇసుకను ఇష్టారాజ్యంగా భూమిలో నుండి తరలించడంతో భూగర్భజలాలు అడుగంటే అస్కారం ఉందని గ్రామాల రైతులు అంటున్నా రు. వాగుల నుండి ఇసుక తరలించడానికి నియమ నిబంధనలు ఉన్నా వాటిని దళారులు భేఖాతర్ చేస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. ధారూర్ మండలంలో మాత్రం ఇసుక వ్యాపారం జోరుగ కొనసాగుతుంది. ఇప్పటికైన పోలీస్,రెవెన్యూ,ఫారెస్ట్ అధికారులు స్పందించి అక్రమ ఇసుకను అరికట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



# సైబరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్

## వివిధ ప్రాంతాలలో మద్యం సేవించి పట్టుబడిన 262 మందిపై కేసులు

శేరిలింగంపల్లి, మార్చి 15 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతి వారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వారాంతపు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ కార్యక్రమాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం గమనార్హం. ఈ డ్రైవ్‌లో భాగంగా 262 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 205 ద్విచక్ర వాహనదారులు, 05 ఆటోలు, 50 కార్లు, 02 భారీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయని ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో డిసిపి రంజన్ వెల్లడించారు. వీరందరినీ ఆయా ప్రాంతాలవారీగా అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వారందరిని కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఆయన వివరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని ఈ సందర్భంగా ఆ పలువురు పోలీసు అధికారులు స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023 లోని సెక్షన్ 105(కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. కాగా గత వారం మొత్తం 187 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయని, వీరిలో ఇద్దరికి జరిమానా, జైలు శిక్ష, 23 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,162 మందికి జరిమానా విధించబడినట్లు డిసిపి తెలిపారు.

# కుల రహితమే సమాజ హితం

- ఏప్రిల్ 10 నుండి 'కుల నిర్మూలన సాంస్కృతిక ఉత్సవాలు'
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాలుగు రోజుల భారీ కార్యక్రమాలు
- కుల వివక్షను సాంస్కృతిక చైతన్యంతో పారద్రోలాలి
- కవి సమ్మేళనం, ఎగ్జిబిషన్, ప్రతిజ్ఞలు, సంతకాల సేకరణ



**ముషీరాబాద్, మార్చి 15 (జనంసాక్షి) :** కుల రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా, అణచివేతకు ఆధిపత్యానికి వ్యతిరేకంగా "కుల రహితం – సమాజ హితం" అనే నినాదంతో ఏప్రిల్ 10 నుండి 14 వరకు హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్తంగా 'కుల నిర్మూలన సాంస్కృతిక ఉత్సవాలు' నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన కవులు కళాకారులు రచయితలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ప్రముఖ రచయిత నళేశ్వరం శంకరం కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహీద్, శాంతా రావు లు పాల్గొని మాట్లాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ మాట్లాడుతు.. వైవిధ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్షను పారద్రోలడానికి, మనుస్మృతి వంటి చీకటి భావ జాలాలను ఎదిరించడానికి సాంస్కృతిక చైతన్యం అవసరమని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్య సమాజం సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. కుల నిర్మూలన కేవలం రాజకీయ నినాదంగా కాకుండా, సాంస్కృతిక ఉద్యమంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల విభజన లేని, వివక్షకు తావులేని సమ సమాజం కోసం పనిచేయాలని, తెలంగాణ మట్టి సంస్కృతిని ప్రజా కళల్లో చాటి చెప్పాలని నాలుగు రోజుల కార్యక్రమం భారీ ఎత్తున ఒక సాంస్కృతిక జాతర లాగా నిర్వహించాలన్నారు. నాలేశ్వరం శంకరం మాట్లాడుతూ భారత రాజకీయాల్లో కులం పోషించే పాత్రను గుర్తించడంలో మేధావులుగా రచయితలుగా కళాకారులుగా మనం విఫలమయ్యామని, దిన్ని అందరూ అంగీకరించాలన్నారు. ఇప్పటికైన కలాలు కదలాలని పిలుపు నిచ్చారు. కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో, కుల వివక్ష కు కేంద్రాలుగా మారాయన్నా రు. కులం ఒక కుట్రై వెంటాడుతున్నప్పుడు, మతం ఒక మంటై దహిస్తున్న ప్పుడు, మనుషులను మనుషులుగా కలిపే ఒక సాంస్కృతిక విప్లవం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ప్రారంభమై తెలంగాణ రాష్ట్రంలో కుల రహిత సమాజం పునాదిగా అవ్వాలన్నారు. అందుకు మా కలాలు గళాలు మీ వెంటే ఉంటాయని అన్నారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనుస్మృతి చీకట్లను చీల్చుదాం, సమానత్వపు జెండాను ఎగర వేద్దాం, కులం కోరలు పీకుదాం, మనువాద పునాదులు కూల్చుదాం, శ్రమ దోపిడీకి కులమే ముసుగు ఆ ముసుగును చీల్చడమే మన సాంస్కృతిక అడుగు అని చెప్పారు. బుద్ధుని శాంతి, అంబేద్కర్ క్రాంతి, పూలే చదువు, సావిత్రి వెలుగు, మార్క్స్ మార్గం వీరందరి వారసత్వమే మనందరి సంస్కృతి పునాదిగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.రమేష్ విజ్ఞాన దర్శిణి రచయిత్రి రాజేశ్వరి దేవి, మురళిధర్ దేశ్ పాండే, కొండల్ రావు, విప్లవ్ నో క్యాస్ట్ ఇండియా బండిసత్తెన్న, పాండురంగచారి, యంవి రమణ, అరుణోదయ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక

## జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూర్ మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ఈ యువకులు ఆ పార్టీలకు బిగ్ షాక్ ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యువకులు పార్టీలో చేరిక నిర్వహించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, అందుకే తాము కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నామని వారు తెలిపారు. ఈ చేరిక కార్యక్రమంలో సరుగు సందీప్, చైతన్య, ప్రవీణ్, అంజి, అజయ్, శ్రీకాంత్, మహేష్, రాజు తదితర యువకులు పాల్గొన్నారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వారందరికీ స్వాగతం పలికి, కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.




# ఫుల్‌కి పైసలు కొట్టు.. వారం సెలవు పట్టు..!

## చేయి తడిపితే ఏ పని చేయడానికైనా సిద్ధమే..

- ఖమ్మం కార్పొరేషన్‌లో ఒక ఉన్నత స్థాయి అధికారి తీరు
- పాలకవర్గం పట్టు సడలడంతో అధికారుల ఇష్టారాజ్యం

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఒంట్లో బాగోలేకో, ఇంట్లో బాగోలేకో ఒక వారం సెలవు పెట్టాలనిపిస్తుందా..? అయితే ఆయనకు ఓ ఫుల్ బాటిల్ డబ్బులు సర్దుబాటు చేయగలిగితే సరి.. మీ సెలవు సమస్య తీరిపోయినట్లే లెక్క.! ఇది ఖమ్మం కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బంపర్ ఆఫరండోయ్యాయ్.!! ఈ మాట నూటికి నూరు పాళ్లు పచ్చి నిజం. ఇక మిగతా పనులంటారా.? మనం అడిగే పనిని బట్టి ఆయన రేటు ఫిక్స్ చేస్తాడు. చేయి తడిపితే చాలు.. ఏ ఫైల్ అయినా ఇట్టే మూవ్ చేసి పని ఫినిష్ చేయగల సత్తా ఉన్న అధికారి ఆయన. ఇక ఆలస్యం ఎందుకు ఆ అధికారి ఎవరో తెలుసుకుందాం రండి.

అరవై డివిజన్లున్న అతి పెద్ద కార్పొరేషన్ ఖమ్మం. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదో మహా సముద్రమే. ఈ మహా సముద్రంలో ఎవరికి తోచినట్లు వాళ్ళు వేటాడుకోవచ్చన్న మాట. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అనే ఈ సముద్రంలో భారీ తిమింగలాలు చిట్టి చేపలను వేటాడుతూ ఆకలి తీర్చుకుంటూ ఉంటాయి. అలాంటి ఓ తిమింగలం చివరికి తను సేవించే లిక్కర్ ధరను సైతం బయటికి ప్రచారం చేసుకోవడమే విడ్డూరం. కమిషనర్ తర్వాత స్థాయి హోదాను వెలగబెడుతూ కూడా ఆ అధికారి తన బుద్ధిని బయటపెట్టుకోవడమే విస్మయం కలిగిస్తోంది. ఉదాహరణకి డివిజన్‌లో పని చేసే ఒక జవాన్ కి ఒక వారం సెలవు అవసరమైతే సెలవు మంజూరు కోసం ఆయనను ఆశ్రయించాల్సిందే. ఇలాంటి సందర్భాలే ఆసరాగా ఆ సారు తన లిక్కర్ బాటిల్ ధరను చెప్పి ముక్కు పిండి మరీ వసూలు చేస్తాడు. ఇక జవాన్లు చేసేదేమీ లేక ఆ రుసుము చెల్లించి సెలవు తీసుకోవాల్సి వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్వాకం కాస్తా ఆ నోటా ఈ నోటా పడి కార్యాలయం అంతటికీ తెలిసిపోయింది.

**విధుల్లో కోత..**

దాదాపుగా కమిషనర్ నిర్వహించే విధులన్నింటిని చక్కబెట్టగలిగే హోదా ఆయనకు ఉంది. కమిషనర్ స్థాయి అధికారి అయ్యుండి కూడా చిల్లర వ్యవహారాల్లో కాసులు వేరుకుంటున్న తీరును గమనించిన కమిషనర్ ఇటీవల ఆయన విధులకు కోత విధించడం గమనార్హం. ఆరు నెలల కిందట వరంగల్ నుంచి బదిలీపై ఖమ్మం కార్పొరేషన్ కు వచ్చిన సదరు అధికారి అక్కడ కూడా ఇలాంటి నిర్వాకాలని వెలగబెట్టినట్లు సమాచారం. ఈ ఫలితంగానే కమిషనర్ దృష్టి సారించి విధులను తగ్గించినప్పటికీ ఆయన తీరు మారకపోవడం గమనార్హం.

**పట్టింపులేని పాలకవర్గం..**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం అధికార యంత్రాంగంపై పట్టు కోల్పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత నుంచి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో టిఆర్ఎస్ పార్టీలో కొనసాగిన మేయర్.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కండువా అయితే మారింది గాని అధికార యంత్రాంగంపై పట్టు కోల్పోయారన్న విమర్శలు బాగా వినిపిస్తుంది. ఈ క్రమంలో టాప్ టు బాటమ్ టోటల్ యంత్రాంగం అవినీతి అక్రమాలకు అలవాటు పడినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# హెచ్ఎంఎస్‌లోకి సీనియర్ కార్మిక నాయకుడు ఆరెల్లి

**గోదావరిఖని, జనంసాక్షి :** సీనియర్ కార్మిక నాయకుడు ఆరెల్లి పోషం హెచ్ఎంఎస్ లో ఆదివారం చేరాడు. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆరెల్లి పోశం హెచ్ఎంఎస్ తీర్థం తీసుకున్నారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆరెల్లి పోశంకు కల్వకుంట్ల కవిత కండువా కప్పి హెచ్ఎంఎస్ లోకి ఆహ్వానించారు. అనంతరం ఆర్.జీవన్ ఉపాధ్యక్షుడు గా ఆరెల్లి పోషమును నియమించారు. ఇటీవలనే ఆరెల్లి పోచం ఏఐటీయూసీకి రాజీనామా చేశారు. అనంతరం పోచం హెచ్ఎంఎస్ లో చేరాడు.

# స్వచ్ఛత డ్రైవ్ ఇకముందు కూడా కొనసాగిస్తాం

- 'సన్ డే - ఫన్ డే'తో గోదావరిఖని పుష్కర ఘాట్‌లో స్వచ్ఛత కార్యక్రమం : మేయర్ మహంకాళి స్వామి
- నదిలో పేరుకుపోయిన చెత్త తొలగింపు.. 500 మంది స్వచ్ఛంద సేవకులు



**గోదావరిఖని, మార్చి 15 (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన స్వచ్ఛత డ్రైవ్‌ను ఇకముందు కూడా నిరంతరం కొనసాగిస్తామని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ఆఖరి రోజైన ఆదివారం 'సన్ డే – ఫన్ డే' థీమ్‌తో గోదావరిఖని పుష్కర ఘాట్ వద్ద విశేష కార్యక్రమం నిర్వహించారు.

సిడిఎంఏ కార్యాలయం హైదరాబాద్ నుంచి విచ్చేసిన జాయింట్ డైరెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది కలిసి నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 500 మంది స్వచ్ఛంద సేవకులు పాల్గొని నదిలో పడవేసిన వ్యర్థాలను ఏరి సంచీల్లో నింపి ట్రాక్టర్లతో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. మేయర్ మహంకాళి స్వామి ఆద్యంతం సూచనలు ఇస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. డిప్యూటీ మేయర్, అదనపు కలెక్టర్, కార్పొరేటర్లు కూడా పలుగు, పార చేతపట్టి ప్రక్షాళనలో పాలుపంచుకున్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ స్వచ్ఛతకు మారుపేరుగా రామగుండం నగరాన్ని తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని, ప్రజలందరూ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. రాబోయే గోదావరి పుష్కరాలకు లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సర్వే చేసి డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. సుమారు 150 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి పుష్కర ఏర్పాట్లు చేయడంలో ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

జాయింట్ డైరెక్టర్ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రామగుండంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరి నదీ తీరంలో ప్రతి నెల ఒకసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పరిశుభ్రం చేయాలని, నదిలో వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్, కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమస్తం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. ఆ తర్వాత నగర పాలక సంస్థ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛదనంతో పాటు పచ్చదనం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, మొక్కలు నాటడమే కాకుండా పెంచి పోషించాలని, పరిశ్రమల కాలుష్యం ఎక్కువగా ఉన్నందున పచ్చదనం పెంపుకు శ్రద్ధ చూపాలని అన్నారు.

అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడి కుటుంబాలకు ఆదుకోవచ్చని తెలిపారు. తర్వాత మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సప్తగిరి కాలనీలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ స్కూల్, బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, తడి–పొడి చెత్త వేరు చేయడంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో రాజేందర్, సారయ్య నేతృత్వంలో అందరికీ అల్పాహారం వడ్డించారు. కార్యక్రమం జరుగుతున్న తీరును మేయర్ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్‌కు ఫోన్‌లో వివరించారు. జాయింట్ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఇ గురు వీర, ఈఈ పి.వి. రామన్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓ ఆంజనేయులు, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, అకౌంటెంట్లు రాజ్ కుమార్, రవి తేజ, మెప్మా టీఎంసీ మౌనిక, సీఓలు, ఆర్పీలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 మార్చి 2026



ముస్లింలకు పార్టిషన్ డీడ్ సర్వే నంబర్... 57, 69లో ఫ్లాట్ నెంబర్ 36



# నెంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు..!!

## బోడుప్పల్‌లోని సర్వే నెం.69లో స్థలాలను చెరిపేస్తున్నారు

మీకు భూ సమస్యలుగానీ, రిజిస్ట్రేషన్ల ఇబ్బందులుగానీ ఏమైనా ఉన్నాయా..? అసలు యజమానులున్నా, లేకపోయినా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకుంటు న్నారా..? అయితే ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించండి, ఆ కార్యాలయానికి వెళ్తే ఇట్టే మీ సమస్య తీరిపోతుంది..! నిబంధనలు ఎలావున్నా అవన్నీ మీకు వర్తించకుండానే మీరనుకున్న పని ముగించుకుపోవచ్చు. కాకపోతే.. కాస్త ఖర్చెక్కువైనా మీరు భరించుకోవాలంతే..!! అదేంటీ.. ఇంత ఘాటుగా చెబుతున్నారనుకున్నా.., ఇంత బహిర్గతంగా విమర్శిస్తున్నారని అనుకుంటున్నా ఇదే నిష్టూర నిజం. కోట్ల రూపాయల భూములను చాలా తేలికగా కొల్లగొట్టేస్తున్న వైనం బోడుప్పల్ పరిధిలో ఇప్పటికే కోడై కూస్తుండగా.. అన్నీ తెలిసిన సబ్ రిజిస్ట్రార్ అప్పనంగా రిజిస్ట్రేషన్ చేసేశారు. వాస్తవాలను సరి'దిద్ది' సంబంధం లేని వ్యక్తుల పేర్లతో ఇతరులకు ప్లాట్లను కట్టబెడుతున్నారు. డాక్యుమెంట్ రైటర్ మీడియేటర్‌గా జరుగుతున్న ఈ భారీ భూదందా గత నెలన్నర క్రితమే బహిర్గతం కాగా.. ఏకంగా లేఅవుట్‌లోనే సర్వే నెంబర్లను మార్చేసి విలువైన స్థలాలను అక్రమార్కుల వశం చేస్తుండటం స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది.

- అన్నీ తెలిసి.. అనుకున్నది చేసిన ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్
- ఏకంగా లేఅవుట్‌లోనే సర్వేనెంబర్లను దిద్ది తారుమారు
- డాక్యుమెంట్ రైటర్‌ను ముందుంచి భారీ అవినీతికి తెర
- ముస్లిముల పేరున్నా వేరేవ్యక్తులతో ఇతరులకు రిజిస్ట్రేషన్
- కోట్లాది విలువైన రెండెకరాల వక్ఫ్ భూములపై 'బడావ్యక్తుల' కన్ను




**బోడుప్పల్, మార్చి 15 (జనంసాక్షి) :** మేడిపల్లి మండలం బోడుప్పల్ పరిధిలోని సర్వే నెంబర్ 69లోని భూములను మాయం చేస్తున్నారని 'జనంసాక్షి' గతంలోనే ప్రచురితం చేసింది. ఇది వక్ఫ్ బోర్డు దృష్టికి వెళ్లడంతో సదరు బోర్డును నోటీసులు కూడా జారీ అయ్యాయి. దీంతో గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలనుకున్నవారికి కళ్లెం పడింది. ఈ బాగోతంలో ప్రమేయం ఉన్న ఓ వక్ఫ్ బోర్డు జిల్లా అధికారి, మాజీ ప్రజాప్రతినిధి, ఓ బిల్డర్ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదుగానీ.. వక్ఫ్ నోటీసులు, పలు ఫిర్యాదులను, ఇతర నిబంధనలను తోసిరాజని సర్వేనెంబర్ 69లో గల స్థలాల్లో రిజిస్ట్రేషన్ పర్వానికి తెరలేసింది. భూమిని కాజేయాలనుకున్న వ్యక్తులు ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని డాక్యుమెంట్ రైటర్, సబ్ రిజిస్ట్రార్, ఇతర కొందరితో కుమ్మక్కై ఈ తంతు పూర్తిచేసేందుకు సిద్ధమయ్యారు. నిజానికి 57, 69 సర్వేనెంబర్‌తో లేఅవుట్ ఉండగా.. 69ను చెరిపేసి అక్కడ 58గా నమోదుచేశారు. 58లోనే 1 నుంచి 36 ప్లాట్లు ఉన్నట్టుగా దానిని మార్చేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్లు, సర్వేయర్లు ఇచ్చిన రిపోర్టులను సైతం ఖాతరు చేయకుండా.. ఏకంగా సర్వేనెంబర్‌నే తారుమారు చేశారంటే పరిస్థితి ఏస్థాయికి చేరిందో అర్థమవుతోంది. ఇందులో సబ్‌రిజిస్ట్రార్ విజయ జ్యోతి, డాక్యుమెంట్ రైటర్ నందీశ్వర్ గౌడ్, మేడ్చల్ జిల్లాకు చెందిన మరో ఉన్నతాధికారి కీలకంగా వ్యవహరించినట్టు తెలిసింది.

### ముడుపులందుకుని.. మొత్తం మార్చేశారా..?

57, 69 సర్వే నెంబర్లతో కూడిన లేఅవుట్‌ను 57, 58గా మార్చడం ఒకెత్తయితే.. సర్వేచేసిన రెండో రిపోర్టు ఆధారంగా రిజిస్ట్రేషన్ ముగించడం గమనార్హం. 69లో 1 నుంచి 36 ప్లాట్లు ఉండగా.. అందులో 36వ నెంబర్ ప్లాటును 58లో ఉన్నట్టుగా చూపెడుతూ ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడి పేరిట గత నెల 18న ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తంతు పూర్తిచేశారు. పైగా అన్ని ధ్రువపత్రాలను పరిశీలించాకే రిజిస్ట్రేషన్ చేశామని చెబుతున్న సబ్ రిజిస్ట్రార్.. అసలు సంబంధం లేని వ్యక్తుల పేర్లతో ఇతరులపై ఎలా మార్చారన్నది ప్రశ్న. సుమారు 40 కోట్ల విలువైన ఆ భూమి మాటున భారీ ముడుపులు అందడంతోనే సబ్ రిజిస్ట్రార్ గుట్టుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలుపెట్టినట్టు విమర్శలొస్తు న్నాయి. రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటు ముస్లిముల పేరుతో ఉన్నట్టుగా లేఅవుట్‌లో చూపెడుతుండగా.. పహాణీల ఆధారంగా ఇతరులతో పేరుతో మరొకరికి కట్టబెట్టడం విశేషం. గతం నుంచి ఉన్న పత్రాల ను, నివేదికలను ఇటీవల పరిశీలించిన కొందరు స్థానిక అధికారు లు.. ఈ రిజిస్ట్రేషన్లను చూసి ముక్కున వేలేసుకోవడం గమనార్హం.


### సబ్ రిజిస్ట్రార్ తప్పు.. పోలీసుల నిజాయితీ

వక్ఫ్ బోర్డు నోటీసులు, ఒరిజినల్ లేఅవుట్ పట్టకుండా సర్వేనెంబర్ 69లోని భూములకు రిజిస్ట్రేషన్లు షురూచేసిన వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారి అండదండలతో సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్ కీలకంగా ఉ న్నట్టు తెలుస్తోంది. గతంలోనూ సబ్ రిజిస్ట్రార్ విజయజ్యోతి తీరుపై ఎన్నో విమర్శలున్నా యి. బోడుప్పల్ శ్రీలక్ష్మీనగర్‌లో దాదాపు 60 లక్షల విలువైన ప్లాటును సంబంధం లేని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు. అసలు యజమాని నిలదీయడంతో గతేడాది అక్టోబర్‌లో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఛార్జిషీట్ వేయాలని పదేపదే కోరినా 'మీరు చేసిన తప్పుకు మేమెలా బాధ్యత వహిస్తాం. జాగ్రత్తగా చూసి రిజిస్ట్రేషన్ చేయాలి కదా' అంటూ పోలీసులు నిజాయితీ చాటుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఆ స్థల యజమాని ఒత్తిడి చేస్తుండటంతో సబ్ రిజిస్ట్రార్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. అదేవిధంగా, బోడుప్పల్‌లోని ఎకరా స్థలంలో గల 20 ప్లాట్లకు నిబంధనలకు విరుద్ధంగా తెచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌తో రిజిస్ట్రేషన్ చేశారు. 20 కోట్ల రూపాయల విలువైన ఆ భూమికి పర్మిషన్లు దొడ్డిదారిన ఇచ్చినట్టు హెచ్‌ఎండీఏ అధికారులు కూడా భావిస్తున్నారు. దీనిపై హెచ్‌ఎండీఏ అధికారులు సైతం ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఇలా.. ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ తీరు విమర్శలూ, ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారింది. మేడ్చల్‌కు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారి ప్రోద్బలంతోనే ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి జడలు విప్పుకుందన్నది అక్షర సత్యం..!










# చిన్నారుల్లో పౌష్టికాహార లోపం

- పిల్లల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- వంద మందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ



**చిగురుమామిడి మార్చి 15 (జనంసాక్షి):** చిన్నపిల్లలు పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారని, వారి ఎదుగుదలకు వైద్యుల సలహాలు తీసుకొని సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ పిల్లల డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవిందు మోహన్ తెలిపారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పిల్లల ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా దాదాపు 100మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవింద్ మోహన్ మాట్లాడుతూ చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్య అని, ఇది శారీరక, మానసిక ఎదుగుదలను అడ్డుకుంటుందని చెప్పారు. పిల్లలు జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వాటిని తగ్గించే ప్రయత్నం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. పెద్దవాళ్ళకు పలు సూచనలు సలహాలు చేసి మందులను పంపిణీ చేశారు. తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పిల్లలకు పరీక్షలు చేసిన పిల్లల డాక్టర్స్ అసోసియేషన్ వారికి గ్రామ సర్పంచ్ గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు దొడ్ల సుగుణ, జెల్ల మమ త, బూడిద శేఖర్, ఏంర్ర నారాయణ, జెల్ల అజయ్, బద్ధం సంతోష్ రెడ్డి, జెల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 15 (జనం సాక్షి) :** 2026 సెన్సస్ 2027 కు సంబంధించిన దశ 1 గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి సబ్ డివిజన్ స్థాయి ఛార్జ్ స్థాయి అధికారులకు ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్ ఆద్వర్యం లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం 2026 మే 11 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల కు శిక్షణ సందర్భంగా జిల్లా ఉపజిల్లా అధికారులు, ఛార్జ్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ ట్రైనర్లు వంటి జనాభా గణన 2027 విధులకు కేటాయించిన అధికారులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని జిల్లా, సబ్-డివిజనల్ అధికారులు, ఛార్జ్ అధికారులకు లెవల్ 1 శిక్షణా కార్యక్రమం ఈనెల 15 నుండి 17వరకు నిర్వహించడం జరుగుతుందని

జనాభా గణన ను సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించబడుతుందనిమొదటి దశలో గృహాలు, భవనాలు, కుటుంబ వివరాలు, రెండో దశలో వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారని తెలిపారు.

అధికారులు, ఎన్యూమరేటర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలపరిమితి లో జనాభా గణన ను పూర్తి చేయాలని ఆయన సూచించారు. శిక్షణలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, సీఈఓ చందర్, ఆర్డీఓ వీణ, సిపిఓ రఘునందన్, జిల్లాలోని సంబంధిత అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవో లు, మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ జార్జ్ నినోస్‌లో ఘనంగా గ్రాడ్యుయేట్ వేడుకలు

### ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి



**కరీంనగర్, మార్చి 15 (జనంసాక్షి) :** ఆదివారం రోజున కరీంనగర్ కొత్తపల్లి లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల వేదికగా సెయింట్ జార్జ్ నినోస్ రేకుర్తి, విద్యానగర్, తీగలగుట్టపల్లి బ్రాంచుల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, సెయింట్ జార్జ్ సిబిఎస్ ఈ ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఇన్చార్జిలు సంగీత, సంధ్య, స్వప్న, మొదటగా జ్యోతి ప్రజలను చేసి వేడుకలను ప్రారంభించారు. తదుపరి చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక కాలంలో విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం తప్పనిసరిగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలని నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించి కిండర్ గార్డెన్-2 విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు.

## అల్ఫోర్స్‌లో తెలంగాణ అంతర్రాష్ట్ర కరాటే
# ఛాంపియన్‌షిప్ ప్రారంభం

- కరాటే ఆత్మరక్షణకు విశిష్ట క్రీడ
- విద్యార్థుల్లో క్రీడా ఆసక్తి పెంపొందించాలి
- 450 మంది క్రీడాకారులు సత్తా చాటారు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (జనంసాక్షి) :** కరాటే ఆత్మరక్షణకు అత్యంత విశిష్టమైన క్రీడగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో తెలంగాణ అంతర్రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన శనివారం వేడుకగా ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, కరాటే ఇన్‌స్పెక్టర్ వసంత్ కుమార్‌లతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో మాట్లాడిన ఒడితల ప్రణవ్ బాబు విద్యార్థులు తప్పనిసరిగా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, అందుకు అవసరమైన వనరులను సమకూర్చుకుని ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే కాకుండా పోటీల్లో విజయం సాధించే లక్ష్యంతో శిక్షణ పొందాలని, జపాన్, చైనా వంటి దేశాల్లో కరాటేకు ఉన్న ప్రత్యేకతను గుర్తు చేశారు. ఈ క్రీడ ద్వారా తెలివితేటలు, శారీరక దక్షత పెంపొందడమే కాకుండా భవిష్యత్తులో అవకాశాలు కూడా వస్తాయని వివరించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా, క్రమశిక్షణతో ఉంటారని ప్రశంసించారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని, విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్యక్రమాలు సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

ఈ ఛాంపియన్‌షిప్‌లో సుమారు 450 మంది క్రీడాకారులు వివిధ వయసు, విభాగాల్లో పాల్గొని తమ సత్తా చాటారు. బంగారు, వెండి, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పోటీదారులందరికీ భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు, న్యాయ నిర్ణేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థులతో చెలగాటమాడితే
# ప్రభుత్వాలు ప్రమాదంలో పడతాయి

### ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి : బండారు దత్తాత్రేయ


- బడ్జెట్‌లో 10 వేల కోట్లు కేటాయించాలి
- ఆమరణ దీక్షకు సిద్ధం: జాజుల శ్రీనివాస్ గౌడ్

**ముషీరాబాద్, మార్చి 15 (జనంసాక్షి) :** విద్యార్థులతో చెలగాటమాడితే ప్రభుత్వాలు ప్రమాదంలో పడతాయని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్రం, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీజు పోరు దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఈ బడ్జెట్‌లో పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

దీక్షలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి, మాజీ మంత్రి జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఎల్. రమణ, తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ నేత జి. నరసింహ, టీజేఎస్ ఉపాధ్యక్షులు నిజ్జన రమేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, సినీ దర్శకులు ఎన్. శంకర్, బహుజన తత్వవేత్త వి. జీ. ఆర్. నారగోని, జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తని, ఉన్నత చదువులకు అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. 7 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించడం ప్రభుత్వానికి పెద్ద లెక్క కాదని, ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడిందని, ఫీజులు ఇవ్వకుండా కళాశాల యజమాన్యాలను బెదిరించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దివాలా తీసినట్లుగా ఉందన్నారు. విద్యార్థుల బలిదానాలతో సాధించిన పథకం రాకపోవడంతో ఆత్మహత్యలు జరుగుతున్నాయని, పేద విద్యార్థుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని, కనీసం బీసీ విద్యార్థులకు బడ్జెట్‌లో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రి కమిషన్లు వచ్చే కాంట్రాక్టర్లకు వేల కోట్లు



చెల్లిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులకు ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో మూడు లక్షల కోట్లు అప్పు చేసి, బడా కాంట్రాక్టర్లకు 70 వేల కోట్లు విడుదల చేసిందని, బడుగు విద్యార్థులకు 7,500 కోట్ల ఫీజు బకాయిలు ఇవ్వడానికి కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 5 వేల కోట్లతో గాంధీ విగ్రహం పెడుతున్న ప్రభుత్వం విద్యార్థులకు మొండి చేయి చూపుతోందన్నారు. నిధుల విడుదలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, ఫీజులు చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని, రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉ ధృతం చేస్తామని హెచ్చరించారు. ఫీజు బకాయిల కోసం ఆమరణ నిరాహార దీక్షకు తాను సిద్ధమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు మని మంజరి సాగర్, బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తదితర బీసీ సంఘ నాయకులు, విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చేపల కోసం చెరువు నీళ్లను మోటార్ల ద్వారా ఖాళీ చేస్తున్న కాంట్రాక్టర్

- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు
- చెరువు నీళ్లు ఖాళీ అయితే బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతన్నల ఆవేదన



**చిగురుమామిడి మార్చి15 (జనంసాక్షి):** చేపలు పట్టుకునేందుకు చెరువు నీళ్లను ఓ కాంట్రాక్టర్ ఖాళీ చేసే కుట్ర చేస్తున్నా సంబంధిత అధికారు లు చూసి చూడనట్టు వ్యవహరిస్తూ పట్టించుకో వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న మూల్కనూరు గ్రామంలోని చెరువు నుండి నీటిని వృధాగా మోటార్ల ద్వారా కాంట్రాక్టర్ నీటిని తరలిస్తున్నారని ఆయకట్టు రైతులు, గ్రామస్తులు వచ్చి అధికారులకు మొరపెట్టుకు న్నా ఫలితం లేకుండా పోతోందని గ్రామానికి చెందిన యువకుడు పిట్టల రాజు ఆవేదన వ్య క్తం చేశారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమ తులు లేకున్న మోటర్లు పెట్టి నీటిని బయటకు వృధాగా వదులుతున్నా పట్టించుకునేవారు లేరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఎండిపోతే చుట్టుపక్కల బావులు, ఆయకట్టులోని బావులు పూర్తిగా ఎండిపోయి పశువులకు సైతం నీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని తెలిసి కూడా గ్రామ పాలక వర్గం, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 మార్చి 2026

# రూ.250 కోట్ల విలువైన భూమికి హైడ్రా రక్షణ




## కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు

- 12 మంది నిందితులు అరెస్ట్
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (జనంసాక్షి) :** జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ క్రాక్‌డౌన్" లో భాగంగా ఒక భారీ వ్యవస్థీకృత నేర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సైబర్ మోసాలకు కీలకమైన "మ్యూల్ బ్యాంక్ ఖాతాలను" సృష్టించి సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారితో సహా 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... కరీంనగర్ -2 టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని (క్రైమ్ నం. 84/2026, అ/సె 112, 318 (4) బిన్ ఎస్, సికి 66-డి ఐటీ యాక్ట్, పిఎస్ కరీంనగర్ -2 టౌన్) ప్రకారం కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తులో భాగంగా ఈ ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయని, నిందితులు అమాయక వ్యక్తుల పేరుతో లేదా స్వయంగా వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, కరెంట్ ఖాతాలను తెరిచేవారని ఆ ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులను పైస్థాయి సైబర్ నేరగాళ్లకు విక్రయించేవారని తెలిపారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు గురైన బాధితుల డబ్బును చేతులు మార్చడం, ఉపసంహరించుకోవడం చేసేవారని తెలిపారు.

సుదీర్ఘ దర్యాప్తు అనంతరం పోలీసులు ప్రధాన నిర్వాహకుడు రాజేశ్వర్ రెడ్డి తో పాటు కరీంనగర్‌కు చెందిన మరో 11 మంది సహచరులను అదుపులోకి తీసుకున్నామని, ముదుగుంటి రాజేశ్వర్ రెడ్డి, తండ్రి శ్రీనివాస్ రెడ్డి, (22) భగత్‌నగర్ - కరీంనగర్, నందగిరి సాయి వర్ధన్, తండ్రి ఈశ్వరాచారి (22) కిసాన్‌నగర్ - కరీంనగర్, కాలిదాస్ కౌశిక్, తండ్రి కన్నయ్య, (23) ధోబీవాడ- కరీంనగర్, ములంకుల రాజ్‌కుమార్, తండ్రి కంకయ్య (23) కట్టరంపూర్- కరీంనగర్, బండి సాయి కృష్ణ, తండ్రి సదయ్య (26) కన్నాపూర్, శంకరపట్నం, అడవెల్లి సాయి కార్తిక్, తండ్రి కుమార్ (23) విద్యానగర్- కరీంనగర్, మీర్ జామీ ఉద్దీన్, తండ్రి మీర్ జాకీ ఉద్దీన్ (22) స్వరణ్ స్ట్రీట్- కరీంనగర్, మహమ్మద్ జవాద్ ఖాన్, తండ్రి మహమ్మద్ సాజిద్ ఖాన్ ( 23) స్వరణ్ స్ట్రీట్- కరీంనగర్, సర్దార్ దల్జీత్ సింగ్ తండ్రి సర్దార్ గోవింద్ సింగ్ (23) కోతిరాంపూర్- కరీంనగర్, పల్లెర్ల అజయ్ తండ్రి రాజు ( 24) వెంకట్రావుపల్లి- లక్ష్మీపూర్, రామడుగు, నిర్మల్ల శివ తండ్రి శ్రీనివాస్ (23) మారుతినగర్- కరీంనగర్, దిద్దీ సాయి చరణ్ తండ్రి నాగరాజు (22) రుక్మాపూర్- చొప్పదండి, ఈ ముఠా సభ్యులు కేవలం ఒక్క కేసులోనే కాకుండా, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ఇతర కేసులలో ఈ నిందితులు క్రింది కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించబడిందని సీపీ తెలిపారు. వీరి వద్ద నుండి కీలక పత్రాలు, బ్యాంక్ కిట్లు, ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు. వీటిపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని సీపీ తెలిపారు.

## హామీలు అమలుకు కార్యాచరణ ప్రకటించాలి




- తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- తెలంగాణ ఉద్యమకారుడు నక్క శ్రీనివాస్

**హైదరాబాద్ / పాలకవీడు (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం శూన్య పహాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నక్క శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఈ హామీల అమలుకు సంబంధించిన స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను ప్రకటించాలని ఉద్యమకారుడు నక్క శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు హామీలు ఇచ్చిందని వారు గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీల అమలులో గణనీయమైన పురోగతి కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, అందువల్ల వారి సమస్యలను వెంటనే పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనే ఉద్యమ కారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించి, ఇంటి స్థలాలు మరియు పెన్షన్ల అమలుకు స్పష్టమైన కార్యచరణ ప్రకటించాలని వారు కోరారు. ఇలా చేస్తే ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని, వారి త్యాగాలకు సరైన గౌరవం లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. లేకపోతే ఉద్యమకారులు మరోసారి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు డిమాండ్ చేశారు.

## రంజాన్ మాసం మనకు నేర్పే విలువలు గొప్పవి



- తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**ఖమ్మం, మార్చి 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అస్లాంఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రంజాన్ మాసం కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా ఆత్మశుద్ధి, క్రమశిక్షణ, దాతృత్వాన్ని పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎండి ముజాహిద్, టీఎస్-మెసా గౌరవ అధ్యక్షుడు ఎండి సలీం, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జిలాని, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, మైనార్టీ ఉద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 2.34 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్







**రాజేంద్రనగర్, మార్చి 15 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతంలో ఉన్న సర్వే నంబర్లు 354/1, 354/2, 354/3లలోని 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.250 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ భూమిపై దేవాలయాల విస్తరణకు ఇవ్వాలన్న ఒక వర్గం, సిక్కు సమాజానికి కేటాయించాలని మరో వర్గం డిమాండ్ చేస్తూ చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ అంశంపై సిక్కు ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించగా, భూమి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని జనవరి 29న జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇంతలో కొందరు టిన్ షీట్లతో ప్రహరీ నిర్మించి భూమిని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీనిపై స్పందించిన హైడ్రా కమిష నర్ ఏవీ రంగనాథ్ స్థలాన్ని పరిశీలించి, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. ఆదేశాల మేరకు టిన్ షీట్లను తొలగించి 2.34 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. సిక్కుల సమాధి ఉన్న 366 గజాల స్థలాన్ని మాత్రం అలాగే వదిలిపెట్టారు. ఇదే సమయంలో సీతారామచంద్రస్వామి దేవాల యం భూములతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిని అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించి, ఇక్బాల్ సింగ్‌తో పాటు మరో పదిమందిని విడుదల చేసినట్లు అత్తాపూర్ ఇన్స్‌పెక్టర్ కె. నాగేశ్వరరావు తెలిపారు. భూ వివాదంపై హైడ్రా జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## హనుమకొండలో తెలంగాణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో

# హమాలీ మహాగర్జన

**మహా గర్జనలో పాల్గొన్న మంత్రి సీతక్క ఎమ్మెల్యే నాయిని ఎమ్మెల్సీ కోదండరాం**



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 15 (జనంసాక్షి) :** హనుమకొండ బాలస ముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో తెలంగాణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హమాలీ మహా గర్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమానికి ముందు హమాలీలు అంబేద్కర్ జంక్షన్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి హయగ్రీవాచారి మైదానం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుడు తన కష్టంతో సంపాదించే ఏకైక వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజం అభివృద్ధి చెందడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. హమాలీల సమస్యలను తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరంమంత్రి సీతక్క గ మాట్లాడుతూ హనుమకొండ కేంద్రంలో హమాలీల కోసం భూమి కేటాయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. హమాలీలు రక్తాన్ని చెమటగా మార్చి కష్టాన్ని ఇష్టంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఇంత పెద్ద స్థాయిలో ఒక వేదికపై చేరి తమ సమస్యలను చెప్పడం ఎంతో సంతోషకరమని అన్నారు. హమాలీలకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో హమాలీ సంఘాలకు భూమి కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో పనిచేసే హమాలీలకు కూర్చునేందుకు కూడా స్థలం లేకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పని చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత మిట్టపల్లి సురేందర్,గాయకులు చుక్క రామ్ నర్సయ్య,హమాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం,ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,కార్మికులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**బూర్గంపహాడ్ మార్చి 15 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా (గణితం) పనిచేస్తున్న ఇ నాగేశ్వరరావును జిల్లా విద్యాశాఖ అధికారిని బి నాగలక్ష్మి సస్పెండ్ చేస్తూ ఉత్తరోలు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి యదు సింహరాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాగేశ్వరరావుపై కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేస్ నమోదు అయ్యి అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీలోకి తీసుకుని రెండు రోజులు దాటడంతో తెలంగాణ సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం అతనిపై చర్య తీసుకోవడం జరిగిందని ఆ ప్రకటనలో వివరించారు.

## హాస్టల్‌లో కేరళ మహిళకు వేధింపులు

- వ్యక్తి అరెస్ట్

**బెంగళూరు (జనంసాక్షి) :** హాస్టల్‌లో నివసిస్తున్న కేరళ మహిళను ఒక వ్యక్తి వేధించాడు. ఆమెను అసభ్యకరంగా దూషించడంతో పాటు దాడి చేశాడు. ఆ మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. ఇందిరానగర్ ప్రాంతంలోని ప్రముఖ హాస్టల్‌లో కేరళకు చెందిన 28 ఏళ్ల మహిళ నివసిస్తున్నది. అదే హాస్టల్‌లో నివసిస్తున్న మను శర్మ చాలా రోజులుగా కేరళ మహిళను వేధిస్తున్నాడు. తామిద్దరం కలిసి ఉందామని పదే పదే అడుగుతున్నాడు. ఆమె నిరాకరించడంతో ఇబ్బంది పెడుతున్నాడు. మహిళ స్నేహితురాలి ద్వారా ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించాడు. మరోవైపు మార్చి 11న రాత్రి వేళ ఆ హాస్టల్ ఆవరణలో మను శర్మ హంగామా చేశాడు. గట్టిగా అరవడంతో పాటు తను, తన స్నేహితురాలిని అతడు అసభ్యకరంగా దూషించినట్లు ఆ మహిళ ఆరోపించింది. వాగ్వాదం సమయంలో తమపై భౌతికంగా దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేరళ మహిళ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. మను శర్మపై కేసు నమోదు చేసి అతడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో అన్నం బదులు పానీపూరీలు

**కోల్‌కతా (జనంసాక్షి) :** ఎల్పీజీ కొరత దేశమంతా ఉన్న సంగతి తెలిసిందే. ఎల్పీజీ సిలిండర్ల కొరత ప్రభావం ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనంపై కూడా పడింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఎల్పీజీ కొరత కారణంగా విద్యార్థులకు అన్నం బదులు పానీపూరీ (గోల్‌గప్పా)లు వడ్డించడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. కమర్షియల్ సిలిండర్లపై విద్యార్థులకు స్థానికంగా పాఠశాలల్లోనే వంట చేసి వడ్డిస్తుంటారు. అయితే, ఇటీవల ఇరాన్ సంక్షోభం కారణంగా దేశంలో ఎల్పీజీ కొరత తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగాల్‌లోని భద్రకాళి పాఠశాలలో కూడా ఎల్పీజీ కొరత కారణంగా రెగ్యులర్ మధ్యాహ్న భోజనం అందించడం వీలు కాలేదు. దీంతో విద్యార్థులకు పానీపూరీలు అందించారు. దీనికి ఎక్కువ గ్యాస్ అవసరం ఉండదనే సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి విడుదలైన వీడియోలో పిల్లలు వరుసగా నిలబడి తమ ప్లేట్లలో పానీపూరీలు తీసుకెళ్లారు. అక్కడి ఒక అసిస్టెంట్ టీచర్ దీన్ని వీడియో తీసి తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. మిలియన్‌కు పైగా వ్యూస్ దక్కించుకుంది.

# గిరిజన ఆశ్రమంలో నిండు ప్రాణం బలి

- పాఠశాల సిబ్బంది వేధింపులే కారణమంటున్న బంధువులు
- అధికారుల పర్యవేక్షణ లోపం అంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద ధర్నా





**ఖమ్మం, (జనంసాక్షి):** తమ బిడ్డ ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో తమకు ఆసరాగా నిలుస్తుందనే ఆశతో గిరిజన ఆశ్రమ పాఠశాలకు పంపించిన తల్లిదండ్రుల కలలు కళ్లముందే కూలిపోయాయి. ఇంటి నుంచి దూరంగా ఉన్నప్పటికీ అక్కడి ఉపాధ్యాయులు, సిబ్బంది తమ బిడ్డను సురక్షితంగా చూసుకుంటారనే నమ్మకంతో ఆశ్రమంలో చేర్పించారు. కానీ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు, నిత్యం సంరక్షించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానో, పర్యవేక్షణ చేయాల్సిన అధికారుల వైఫల్యం మూలంగానో చివరకు ఓ చిన్నారి ప్రాణం బలైంది. ముదిగొండ మండల పరిధిలోని వల్లభి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చింతకాయల శ్వేత అనుమానాస్పద పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యార్థిని శ్వేత ఆరోగ్యం బాగాలేదని ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఆమె అమ్మమ్మకు సమాచారం అందించారు. ఈనెల 9వ తేదీన ఆమె అమ్మమ్మ పాఠశాలకు చేరుకోగా, అక్కడ ఆమెతో ఒక లేఖ రాయించారు. అయితే అప్పటికే శ్వేత ఆశ్రమంలోనే ఐరన్ టాబ్లెట్లు అధిక మోతాదులో తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనను కప్పిపుచ్చుకునేందుకే ఉపాధ్యాయులు, సిబ్బంది శ్వేత అమ్మమ్మను పిలిచి, ఆమెతోపాటు ఇంటికి పంపించారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత శ్వేత ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడంతో ముందుగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లినా ప్రాణాలు నిలవలేదు.

### పర్యవేక్షణ లోపమే కారణమా?

గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యమే కాకుండా జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏటిడివో పర్యవేక్షణ లోపం కారణంగానే తమ ఇంటి దీపం ఆరిపోయిందని శ్వేత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. శ్వేత మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తెప్పించింది.

### వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ధర్నా

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్వేత మృతి చెందడం జిల్లాలో కలకలం రేపింది. పాఠశాల హెచ్.ఎం, వర్కర్ వేధింపులను తట్టుకోలేకే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చూరి ముందు ధర్నా నిర్వహించాయి. బాధ్యులను వెంటనే సస్పెండ్ చేసి హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. స్పందించిన ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, విద్యార్థిని తల్లికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. అలాగే కుటుంబానికి తక్షణ సాయంగా రూ.1.50 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

### అనుమానాలకు తావిస్తున్న ఘటన

వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపితే భయంకరమైన నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. నిరక్షరాస్యురాలైన శ్వేత అమ్మమ్మ ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లీషులో సంతకం ఎలా చేసిందో వివరించాలని ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. అలాగే పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందించే ఆహారం, మెనూ విషయాల్లో గిరిజన అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏటీడీవో సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఒక నిండు ప్రాణం బలైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370